మంగళవారం 9-5-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 234



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



రసెల్ ధమాకా

చివరి బంతికి కోల్‌కతా గెలుపు.. పంజాబ్‌కు మరో ఓటమి - 12లో



మార్కెట్ల హైజంప్

710 పాయింట్లు ఎగసిన సెన్సెక్స్.. నిఫ్టీ 195 పాయింట్లు అప్ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఇంటిపై కూలిన మిగ్

రాజస్థాన్‌లో మిగ్ యుద్ధ విమానం ఇంటిపై కూలిన ఘటనలో ముగ్గురు మహిళలు మృతి చెందగా, పైలట్ సురక్షితంగా బయటపడ్డారు.

వివరాలు 6లో ▸



రెజ్లర్లకు రైతుల సంఘీభావం

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలంటూ నిరసన దీక్ష చేస్తున్న మహిళా రెజ్లర్లకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంఘీభావం తెలిపారు.

వివరాలు 6లో ▸



కాల్పుల్లో తెలంగాణ యువతి మృతి

అమెరికాలోని టెక్సాస్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తాటికొండ ఐశ్వర్య మృతి చెందింది.

వివరాలు 2లో ▸



కాంగ్రెస్ గుర్తింపు రద్దు చేయాలి

'కర్ణాటక సార్వభౌమత్వం' అని సోనియా గాంధీ దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఈసీకి ఫిర్యాదు చేసింది.

వివరాలు 6లో ▸

మణిపూర్ నుంచి మన రాష్ట్రానికి

అంతా క్షేమంగా..

163 మంది ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు స్వస్థలాలకు తరలింపు

- రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో రెండు ప్రత్యేక విమానాలు ఏర్పాటు
- తొలుత హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు 108 మంది.. ఆపై ఆర్టీసీ బస్సుల్లో స్వస్థలాలకు
- కోల్‌కతాకు చేరుకున్న మరో 55 మంది.. వారు కూడా హైదరాబాద్ మీదుగా సొంతూళ్లకు చేరుకునేలా ఏర్పాట్లు
- రాష్ట్ర ప్రభుత్వ తక్షణ స్పందనతో ఊపిరి పీల్చుకుంటున్న తల్లిదండ్రులు



మణిపూర్ నుంచి క్షేమంగా విజయవాడకు చేరుకున్న విద్యార్థులు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: అల్లర్లు చెలరేగడంతో కర్ఫ్యూ విధించిన మణిపూర్‌లో చిక్కుకుపోయి క్షణక్షణం భయంభయంగా గడిపిన మన విద్యార్థులు 163 మందిని ప్రత్యేక విమానాలు, బస్సుల్లో సురక్షితంగా స్వస్థలాలకు తరలించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించడంతో తల్లిదండ్రులు ఊరట చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చులతో విద్యార్థులను భద్రంగా స్వస్థలాలకు తరలిస్తోంది. నాలుగు రోజులుగా తిండి, నీరు లేకపోవడంతోపాటు తుపాకులు, బాంబుల మోతలతో నిద్రలేని రాత్రులు గడిపినట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి రాగానే తక్షణం స్పందించి రెండు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఎంపీలు, అధికారులు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని విద్యార్థులకు భరోసా కల్పించి సొంత గ్రామాలకు వెళ్లేందుకు బస్సులు సైతం ఏర్పాటు చేయడంపై

మిగతా 2వ పేజీలో ▶

ఖర్చుకు వెనుకాడొద్దు.. భద్రతే ముఖ్యం

- సమస్య తన దృష్టికి రాగానే స్పందించిన సీఎం వైఎస్ జగన్
- మన విద్యార్థులను మణిపూర్ నుంచి తక్షణమే రప్పించాలని అధికారులకు ఆదేశం

2లో

ఫ్యాక్ట్ చెక్

తప్పుడు రాతలెందుకో..

చెప్పవే 'సిలికా'

సిలికా శాండ్ పై 'ఈనాడు' అసత్య కథనం

- లీజుదారులకు ఆన్‌లైన్‌లో మాత్రమే అనుమతులు
- ఆన్‌లైన్‌లోనే సీనరేజీ, డీఎంఎఫ్, మెరిట్, కన్సిడరేషన్ చెల్లింపు
- లీజుదారులు చేసే విక్రయాలతో గనుల శాఖకు సంబంధం ఉండదు
- నిబంధనల ప్రకారం జీఎస్టీ చెల్లింపులు జరుగుతున్నాయి
- జరిమానాలు తగ్గించారన్న ఆరోపణలు అవాస్తవం
- లీజుదారులు వారికి ఇష్టమైన సంస్థలకు సిలికా శాండ్ అమ్ముకోవచ్చు.. ఈనాడు యాజమాన్యం కూడా కొనుక్కోవచ్చు
- నలుగురు డీలర్లకు లబ్ధి చేకూర్చామన్నది అవాస్తవం
- ఇటీవలే 11 మందికి కొత్తగా లీజులు ఇచ్చాం
- నలుగురికే లబ్ధి చేకూర్చాలనుకుంటే ఈ లీజులూ వారే దక్కించుకొనేవారు.. గనుల శాఖ నిష్పక్షపాత శైలికి ఇదే నిదర్శనం
- గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి

2లో

ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదు

ఆరబెట్టిన ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన తరలించడానికి ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం
- గన్నీ బ్యాగ్‌ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- నూక శాతాన్ని నిష్పక్షపాతంగా అంచనా వేయాలి.. మినీ మిల్లుల సంఖ్యను పెంచాలి
- ఆఫ్‌లైన్ కొనుగోళ్ల వివరాలను 24 గంటల్లో ఆన్‌లైన్‌లోకి మార్చాలి
- ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సీఎం సమీక్ష

3లో



నెల్లూరు జిల్లా మడపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారి

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

ఏప్రిల్ రెండో వారం నుంచే కొనుగోళ్లకు శ్రీకారం

- ఆలస్యం చేయకుండా రైతులకు నగదు చెల్లింపులు
- హమాలీలు, రవాణా చార్జీలను చెల్లిస్తున్న ప్రభుత్వం
- దళారులను నమ్మి మోసపోవద్దు
- రైతులను ఆదుకుంటాం.. అధైర్యపడొద్దంటున్న ప్రభుత్వం
- సర్కారు ఎంతో మేలుచేస్తోందంటున్న అన్నదాతలు

- వివరాలు 3లో

న్యూస్‌రీల్

జూన్ 2 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ



పదో తరగతి ఫెయిలైన వారికి విద్యా సంవత్సరం వృథా కాకుండా జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు పాఠశాల విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

వివరాలు 14లో ▸

విశాఖ టు బంగ్లా బోర్డర్



డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించేందుకు సాయిసంపత్ అనే విద్యార్థి 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో విశాఖ నుంచి బంగ్లాదేశ్ సరిహద్దు వరకు సైకిల్ యాత్రను చేపట్టాడు.

వివరాలు 5లో ▸

ఇదండీ సంగతి



మన వాళ్లను లైట్ తీసుకుంటున్నారు మేడం!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరించిన సిక్కు మత పెద్దలు



సిక్కులకు కార్పొరేషన్

సిక్కు మతపెద్దలతో భేటీలో అప్పటికప్పుడే సీఎం జగన్ ఆదేశాలు

- గురుద్వారాలకు ఆస్తి పన్ను నుంచి మినహాయింపు
- పూజారులు, పాస్టర్లు, మౌల్వీల మాదిరిగానే గ్రంథీలకు కూడా లబ్ధి
- సెలవు దినంగా గురునానక్ జయంతి రోజైన కార్తీక పౌర్ణమి
- మైనార్టీ విద్యాసంస్థ ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు
- వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం

సాక్షి, అమరావతి: సిక్కుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారు. గురుద్వారాలకు ఆస్తి పన్ను నుంచి మినహాయింపు కల్పించాలన్న సిక్కు మతపెద్దల విజ్ఞప్తిపై అప్పటికప్పుడు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు గురుద్వారాలపై ఆస్తి పన్నును తొలగించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి చెందిన సిక్కు మత పెద్దలతో సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ సమావేశమయ్యారు. ఏపీ స్టేట్ మైనార్టీస్ కమిషన్ సభ్యుడు జితేందర్‌జిత్‌సింగ్ నేతృత్వంలో సిక్కు మతపెద్దలు ముఖ్యమంత్రిని కలిశారు. శతాబ్దం క్రితం నుంచి సిక్కులు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో

మిగతా 2వ పేజీలో ▶

'జగనన్నకు చెబుదాం' @ 1902

- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యం
- సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులున్నా చెప్పొచ్చు
- పౌరులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్లు.. నేరుగా సీఎం కార్యాలయం పర్యవేక్షణ

సాక్షి, అమరావతి: సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్దేశిత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించే ఉద్దేశంతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టనున్నారు. క్యాంపు కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కోసం ప్రత్యేకంగా 1902 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారు.

పరిష్కారమయ్యే వరకూ ట్రాకింగ్

ప్రతి వినతి పరిష్కారమయ్యే వరకూ ట్రాకింగ్ చేస్తారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పొందడంలో

మిగతా 2వ పేజీలో ▶



మైకులు బంద్.. కర్ణాటకలో ప్రచారానికి తెర

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సోమవారంతో తెర పడింది. కాంగ్రెస్ తరఫున రాహుల్, ప్రియాంక, పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తదితరులు.. బీజేపీ తరఫున ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా వంటి ప్రముఖులు ప్రచారం చేశారు. జేడీ(ఎస్) నేతలు కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. పోలింగ్ 10న జరగనుండగా.. ఫలితాలు 13న వెలువడనున్నాయి.

6లో



ఏపీ ఈఏపీసెట్‌కు దరఖాస్తుల వెల్లువ

రాష్ట్రంలో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2023కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. సోమవారం నాటికి 3,38,407 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎంపీసీ స్ట్రీమ్‌లో 2,38,037 మంది, బైపీసీ స్ట్రీమ్‌లో 1,00,370 మంది ఉన్నారు. మంగళవారం నుంచి అభ్యర్థులకు వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయి. ఈనెల 15 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు.

14లో

పక్కాగా 'స్వయం' లెక్క..

- ఇకపై 'లోకోస్' ద్వారా సంఘాల కార్యకలాపాలు
- అక్రమాలకు చెక్ పెట్టే దిశగా కొత్త విధానం



సాక్షి, రాజమహేంద్రవరం: స్వయం సహాయక సంఘాల్లో పారదర్శకతకు పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) శ్రీకారం చుట్టింది. అక్రమాలు అరికట్టడంపై దృష్టి సారించేందుకు 'లోకోస్' అనే యాప్‌ను తీసుకొస్తోంది. సంఘాల సమస్త సమాచారం ఇందులో పొందుపరిచేందుకు చర్యలు ప్రారంభించింది. సంఘాల కార్యకలాపాలు ప్రస్తుతం వెలుగు విభాగం ద్వారా నిర్వహిస్తున్నారు. అక్కడక్కడ అక్రమాలు జరుగుతున్నాయి. రుణాలను వెలుగు సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పొదుపు సొమ్ము సైతం ఆరగిస్తున్నారన్న విమర్శలున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి వాటికి స్వస్తి చెప్పి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు యాప్ తీసుకొచ్చారు. ప్రస్తుతం లోకోస్ యాప్‌లో నమోదు ప్రక్రియ అంశాలపై శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈనెల 15వ తేదీ వరకు ఇవి కొనసాగనున్నాయి. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు డీఆర్‌డీఏ, సీబీఓ ఆడిటర్లు, డీపీఎంలకు శిక్షణ ఇచ్చారు. వీరు పొదుపు సంఘాలకు మండలాల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించి, యాప్‌లో వివరాలు నమోదు చేయిస్తారు.

ఒకే యాప్: మహిళా సంఘాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు ఇతర వివరాల నమోదుకు ఒక్కో యాప్‌ను వినియోగించేవారు. ఇకపై ఈ సమస్యకు చెక్ పడనుంది. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తోంది. రుణాల మంజూరు పారదర్శకంగా ఉండేందుకు యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. 17 మండలాల పరిధిలో 30,831 మహిళా సంఘాలుండగా.. 3,08,910 సభ్యులున్నారు. వీరు అర్హతను బట్టి రుణాలు తీసుకుంటున్నారు. వీటికి ప్రస్తుతం ఒక్కో రకమైన రుణానికి(స్త్రీనిధి, బ్యాంక్ లింకేజ్ తదితర) ఒక్కో యాప్ ఉంటోంది. ఒక్కో మహిళకు సంబంధించిన వ్యక్తిగత, కుటుంబ, పొదుపు, రుణాల సమగ్ర సమాచారం ఇకపై 'లోకోస్' యాప్‌లో లభించనుంది. పొదుపు సంఘం పర్యవేక్షణకు ఒక్కో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీఓఏ) చూస్తారు. వీరు కూడా పొదుపు సంఘాల సభ్యులే కావడంతో పారదర్శకత లోపిస్తోందని భావించి పక్కా వివరాలు తెలియజేసేలా లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. జిల్లా వ్యాప్తంగా 100 మంది వీఓఏలకు యాప్ నిర్వహణపై శిక్షణ ఇస్తున్నారు. ప్రతి సభ్యురాలి సమాచారం ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. శిక్షణను ఐబీసీబీ డీపీఎం జనార్దనరావు పర్యవేక్షిస్తున్నారు.

15 వరకు శిక్షణ



లోకోస్ యాప్‌పై ఈనెల 15వ తేదీ వరకు శిక్షణ వీఓఏలకు శిబిరాలు నిర్వహిస్తున్నాం. వారు యాప్‌లో సభ్యుల వివరాలు నమోదు చేస్తారు. యాప్ వల్ల పొదుపు సంఘాల సమగ్ర సమాచారం యాప్‌లో లభిస్తుంది. ఎలాంటి అవకతవకలకు తావుండదు. - ఎస్.సుభాషిణి, డీఆర్‌డీఏ పీడీ

అలా చూస్తూ ఉంటే.. అంతే సంగతి!

గంటల తరబడి ఓటీటీలకే పరిమితమవుతున్న పిల్లలు, పెద్దలు

- వెబ్ సిరీస్‌ల వైపే ఎక్కువ మొగ్గు.. ఒకే సిట్టింగ్‌లో అన్ని ఎపిసోడ్స్ పూర్తి
- ఫలితంగా మానసిక సమస్యలు.. దెబ్బతింటున్న కుటుంబ సంబంధాలు
- 'బింజ్ వాచింగ్ అడిక్షన్'తో బాధపడుతున్నారంటున్న వైద్యులు
- బింజ్ ఈటింగ్‌తో ఊబకాయం బారినపడుతున్న వైనం

5లో



చిన్నారులపై కుక్కలు దాడులు చేస్తే అధికారులపై చర్యలు

బాలల హక్కుల కమిషన్ హెచ్చరిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వీధి కుక్కల బారినుంచి పిల్లలను కాపాడేలా అధికార యంత్రాంగం అప్రమత్తమైన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీధి కుక్కలను నియంత్రించేలా పురపాలక సంస్థ, పంచాయతీరాజ్, ప్రజారోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. చిన్నారులపై కుక్కల దాడులు జరిగితే సంబంధిత అధికారులపై సుమోటోగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా...

ప్రత్యేక సీఎస్‌లుగా కృష్ణబాబు, ద్వివేదీ, సింఘాల్

సాక్షి, అమరావతి: ముగ్గురు ముఖ్యకార్యదర్శులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనిల్ కుమార్ సింఘాల్, ఎం.టి.కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేదీలకు ముఖ్యకార్యదర్శుల నుంచి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం పనిచేస్తున్న శాఖల్లోనే ప్రత్యేక సీఎస్‌లుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

తాడేపల్లిగూడెం కేంద్రంగా రెవెన్యూ డివిజన్

సాక్షి, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కేంద్రంగా మరో రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది. దీనికి సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను ప్రభుత్వం సోమవారం జారీచేసింది. భీమవరం రెవెన్యూ డివిజన్‌లో ఉన్న తాడేపల్లిగూడెం, పెంటపాడు, అత్తిలి, నరసాపురం రెవెన్యూ డివిజన్‌లో ఉన్న తణుకు, ఇరగవరం మండలాలతో ఈ డివిజన్‌ను నెలకొల్పారు. దీనిపై గతంలోనే ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చి అభ్యంతరాలు స్వీకరించారు. తాజాగా తుది నోటిఫికేషన్ విడుదల చేశారు. అలాగే 6 అర్బన్ మండలాలను రెండుగా విభజిస్తూ వేర్వేరుగా తుది నోటిఫికేషన్లు ఇచ్చారు. విజయనగరం, చిత్తూరు, నంద్యాల, అనంతపురం, ఒంగోలు మండలాలను అర్బన్, రూరల్ మండలాలుగా విభజించారు. మచిలీపట్నం మండలాన్ని మచిలీపట్నం నార్త్, సౌత్ మండలాలుగా విభజించారు. మే 8వ తేదీ నుంచే తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్, కొత్త మండలాలు ఉనికిలోకి వస్తాయని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీపీఆర్వో, ఏపీఆర్వో పోస్టుల తుది జాబితా విడుదల

సాక్షి, అమరావతి: డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్(డీపీఆర్వో), అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్(ఏపీఆర్వో) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. అభ్యర్థుల తుది జాబితాను ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో చూడవచ్చని పేర్కొంది.

టెక్సాస్ కాల్పుల్లో తెలంగాణ యువతి మృతి

- షాపింగ్‌కు వెళ్లొస్తుండగా ఆగంతకుడి కాల్పుల్లో ఐశ్వర్య కన్నుమూత

నేరేడుచర్ల/హుడా కాంప్లెక్స్ (హైదరాబాద్): అమెరికాలోని టెక్సాస్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తాటికొండ ఐశ్వర్య (27) మృతి చెందింది. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన ఆమె.. అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసింది. కొన్ని నెలల కిందే అక్కడ ఉద్యోగంలో చేరింది. ఇంతలోనే ఆమె కన్నుమూయడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

షాపింగ్ కోసమని వెళ్లి..

ఐశ్వర్య కుటుంబం స్వస్థలం సూర్యాపేట జిల్లా పాత నేరేడుచర్ల. తండ్రి తాటికొండ నర్సిరెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టులోని ఆర్థిక వివాదాల పరిష్కారాల కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ హుడాకాలనీలో ఉంటున్నారు. హైదరాబాద్‌లోనే ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఐశ్వర్య.. 2019 జనవరిలో ఎంఎస్ చేయడానికి అమెరికాకు వెళ్లారు. టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తిచేశాక.. అక్కడే పర్ఫెక్ట్ జనరల్ కాంట్రాక్టర్స్ కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్‌గా ఉద్యోగంలో చేరారు. శనివారం మధ్యాహ్నం (భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున) టెక్సాస్‌లోని డాలస్‌లో ఓ ఫ్రెండ్‌తో కలసి షాపింగ్‌కు వెళ్లింది. ఆ సమయంలో షాపింగ్ మాల్‌లోకి వచ్చిన ఓ దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఎనిమిది మంది అక్కడిక్కడే మృతిచెందారు. కాల్పుల్లో ఐశ్వర్య ముఖం ఛిద్రం కావడంతో తొలుత ఆమె ఎవరనేది తెలియలేదు. పోలీసులు వేలిముద్రల ఆధారంగా ఐశ్వర్యను గుర్తించి సోమవారం ఉదయం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఐశ్వర్య మృతదేహాన్ని ఇండియాకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో సోమవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.4	26.8
రాజమండ్రి	39.5	28.0
కర్నూలు	39.0	28.3
విజయవాడ	38.0	28.0
తిరుపతి	38.0	25.0
ఏలూరు	38.0	28.0
నెల్లూరు	37.8	28.4
శ్రీకాకుళం	37.0	25.0
కడప	35.2	26.9
విజయనగరం	35.0	28.0

మోచా తుపాను మనకు లేనట్టే!

- బంగాళాఖాతంలో నేడు వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- బంగ్లాదేశ్, మయన్మార్ తీరాల వైపు పయనం
- ఏపీపై ప్రభావం ఉండదంటున్న వాతావరణ శాఖ
- రాష్ట్రంలో మళ్లీ పెరుగుతున్న ఉష్ణ తాపం



సాక్షి, విశాఖపట్నం/అమరావతి/కర్నూలు (అగ్రికల్చర్): దక్షిణ అండమాన్ సముద్రానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ అల్పపీడనం మంగళవారం వాయుగుండంగా మారనుంది. అనంతరం తూర్పు మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 10 నాటికి తుపానుగా బలపడనుంది. ఆపై ఈ తుపాను మొదట్లో 11వ తేదీ వరకు ఉత్తర, వాయవ్య దిశగా కదులుతుంది. ఆ తర్వాత మలుపు తిరిగి మరింత బలపడి ఉత్తర, ఈశాన్య దిశగా బంగ్లాదేశ్, మయన్మార్ తీరాల వైపు పయనించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం రాత్రి బులెటిన్‌లో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌పై తుపాను ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది. అయితే బంగాళాఖాతంలో తుపాను ఏర్పడనున్న నేపథ్యంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని ఐఎండీ హెచ్చరించింది.

మళ్లీ సెగలు

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి.. తుపానుగా బలపడనుందన్న వార్తల నేపథ్యంలో రాష్ట్రంలో వానలు కురిసి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని అంతా భావించారు. అందుకు భిన్నంగా తుపాను ప్రభావం రాష్ట్రంపై ఉండకపోవడంతో వర్షాలకు బదులు ఎండలు విజృంభించనున్నాయి. నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది ఉపరితల ద్రోణి, అల్పపీడనంతో అనుసంధానమై ఉంది. ఫలితంగా రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. మరోవైపు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2–4 డిగ్రీలు అధికంగా నమోదవుతాయని పేర్కొంది. ఫలితంగా రాష్ట్రంలో మళ్లీ సెగలు మొదలు కానున్నాయి.

పిడుగులు పడి ముగ్గురి దుర్మరణం

కర్నూలు జిల్లాలో సోమవారం పిడుగులు పడి ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామంలో నాసేపాటి(38) అనే వ్యక్తి పత్తికొండ నుంచి ఆటో టాప్‌పై కూర్చుని ప్రయాణిస్తుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నంద్యాల జిల్లా డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(36) చిన్న మల్కాపురం గ్రామానికి పనికి వెళ్లగా.. పిడుగు పడటంతో మరణించింది. మరో నలుగురు గాయపడ్డారు. తెలంగాణలోని వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూముకుంట బొల్లవరం గ్రామానికి చెందిన ఆవుల విష్ణు(18) గొర్రెలు మేపేందుకు వచ్చి పగిడ్యాల–కొణిదేల రహదారి మధ్య పొలాల్లో పిడుగుపాటుకు గురై మరణించాడు.

సిక్కులకు కార్పొరేషన్



తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సిక్కు మత పెద్దలతో సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

నివాసం ఉంటున్నారని సిక్కుమత పెద్దలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హులకు ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు అందుతున్నాయని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేశారు. సిక్కుల కోసం ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నవరత్నాలను మరింత సమర్థంగా అందించాలని కోరగా ముఖ్యమంత్రి అందుకు అంగీకరించారు.

గురుద్వారాల్లో పూజారులైన గ్రంథీలకు ప్రయోజనాలు

గురుద్వారాల్లో పూజారులైన గ్రంథీలకు పూజారులు, పాస్టర్లు, మౌల్వీల మాదిరిగానే ప్రయోజనాలు కల్పించాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. గురునానక్ జయంతి రోజైన కార్తీక పౌర్ణమి నాడు సెలవురోజుగా ప్రకటించేందుకు అంగీకారం తెలిపారు. ఓ మైనార్టీ విద్యాసంస్థను నెలకొల్పేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే మంత్రివర్గ సమావేశంలో దీనికి సంబంధించి తీర్మానం కూడా చేస్తామని ప్రకటించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే క్రమంలో సిక్కులకు అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందినవారు నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఈల వ్యాపారాలను పెంచే క్రమంలో ఈ చర్యలు ఉండాలని నిర్దేశించారు. పది రోజుల్లోగా ఇవన్నీ కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎండీ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలెందుకో చెప్పవే 'సిలికా'

సిలికా శాండ్ పై 'ఈనాడు' అసత్య కథనం

ఒకవైపు జరిమానాలు అంటూ..

మరో వైపు ఉల్లంఘనలు పట్టించుకోలేదని ఎలా రాస్తారు?

గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి



సాక్షి, అమరావతి: తప్పుడు కథనాల్లో ఈనాడుది అందె వేసిన చేయి. అదే కోవలో సిలికా శాండ్ విక్రయాలపై మరో కట్టు కథనం ప్రచురించింది. గనుల శాఖకు సంబంధం లేని విషయాలను ఆ శాఖకు ముడిపెట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసింది. పరస్పర విరుద్ధ వాదనలతో కథనాన్ని అల్లింది. ఈనాడు కథనమంతా పూర్తిగా అవాస్తవాలతో కూడుకున్నదని గనుల శాఖ స్పష్టం చేసింది. సిలికా శాండ్ మైనింగ్‌పై అసలు వాస్తవాలను ఆ శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి వివరించారు. అసత్యాలు, వక్రీకరణలతో ప్రభుత్వంపై బురదచల్లేలా ఈ కథనం ఉందని చెప్పారు. సిలికా శాండ్ మైనింగ్, రవాణా, విక్రయాలు, జీఎస్టీ చెల్లింపులపై ఆ కథనంలో చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేశారు. గనుల శాఖ నలుగురికే అనుకూలంగా ఉందన్న ఆరోపణా అసత్యమని చెప్పారు. ఆ నలుగురికే అనుకూలంగా ఉంటే ఇటీవల కొత్తగా 11 మందికి ఎలా లీజులు జారీ చేస్తామని ప్రశ్నించారు. ఈ అంశంపై సోమవారం ఆయన మీడియాతో చెప్పిన వివరాలు..

చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే..

సిలికా శాండ్ లీజు అనుమతులు, చెల్లింపులు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. సిలికా శాండ్‌కు లీజుదారుల నుంచి సీనరేజీ, డీఎంఎఫ్, మెరిట్, కన్సిడరేషన్ మొత్తాలను గనుల శాఖ ఆన్‌లైన్‌లోనే స్వీకరిస్తుంది. అన్ని అనుమతులున్న లీజుదారులకు రవాణా పత్రాలను కూడా ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తుంది. లీజుదారులు మైనింగ్ చేసిన మెటీరియల్‌ను మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా బహిరంగ మార్కెట్‌లో ఎవరికైనా అమ్ముకోవచ్చు. లీజుదారులు వారికి అనుకూలమైన సంస్థలకే మినరల్‌ను విక్రయించుకుంటారు. ఇందులో గనుల శాఖ ప్రమేయం ఉండదు. ఒత్తిడి చేసే అవకాశమే ఉండదు. నష్టం వచ్చేలా ఎవరైనా వ్యాపారం చేస్తారా? వ్యాపార రంగంలో విస్తరించి ఉన్న ఈనాడు సంస్థకు ఈ విషయం తెలియదా? ఆసక్తి ఉంటే ఈనాడు యాజమాన్యం కూడా నిబంధనల ప్రకారం సిలికా శాండ్ లీజులు పొందవచ్చు. అలాగే లీజుదారుల నుంచి శాండ్‌ను కొనుక్కోవచ్చు. నిబంధనల ప్రకారం అవసరమైన సహకారాన్ని అందిస్తాం.

నిష్పాక్షికతకు నిదర్శనమిది

కేవలం నలుగురు డీలర్లకే మేలు చేకూర్చేలా, లీజుదారులు సిలికా శాండ్‌ను వారికి మాత్రమే విక్రయించేలా గనుల శాఖ జరిమానాల పేరుతో వారిపై ఒత్తిడి తెచ్చిందనడం పూర్తిగా నిరాధారం. ఇటీవల గనుల శాఖ కొత్తగా 11 మందికి సిలికా శాండ్ మైనింగ్ లీజులు జారీ చేసింది. నిజంగా ఆ నలుగురికే మేలు చేసే ఉద్దేశం ఉంటే ఈ లీజులు వారే దక్కించుకొని ఉండే వారు. కొత్త వారికి అవకాశం లభించేదా? గనుల శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరించబట్టే కొత్త వారికి లీజులు లభించాయి.

ఫ్యాక్ట్ చెక్

గనుల శాఖకేం సంబంధం?

లీజుదారులు డీలర్లకు విక్రయిస్తున్న సిలికా శాండ్‌కు సగం మొత్తాన్ని ఆన్‌లైన్‌లో, మిగిలిన దాన్ని నగదుగా తీసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై గనుల శాఖకు ఎటువంటి బాధ్యత ఉండదు. లీజుదారులు, విక్రయదారుల మధ్య జరిగే లావాదేవీల్లో గనుల శాఖ జోక్యం చేసుకోదు. నిబంధనల ప్రకారమే లీజుదారులు జీఎస్టీ చెల్లింపులు చేస్తున్నారు. ఏడాదికి సగటున 20 లక్షల టన్నులు సిలికా శాండ్ విక్రయిస్తున్నారు. దానిలో సగం మాత్రమే ఆన్‌లైన్‌లో స్వీకరిస్తూ, దానికి మాత్రమే జీఎస్టీ చెల్లిస్తున్నారంటూ చేసిన ఆరోపణకు ఆధారాలున్నాయా?

పరస్పర విరుద్ధ వాదనలేమిటి?

సిలికా శాండ్ మైనింగ్‌లో పెద్దఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూనే, మరోవైపు గనుల శాఖ జరిమానాలు విధించిందని, ఆ తర్వాత వాటిని సర్దుబాటు చేసిందని పరస్పరం విరుద్ధంగా రాస్తున్నారు. జిల్లా స్థాయిలో విజిలెన్స్ స్క్వాడ్, అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్ పోస్టులు, కీలక ప్రాంతాల్లో నిఘా బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా సిలికా శాండ్ మైనింగ్‌లో అక్రమాలను గనుల శాఖ పూర్తి స్థాయిలో నియంత్రిస్తోంది. ఆరోపణలు వచ్చిన చోట తనిఖీలు చేసి, జరిమానాలు విధిస్తున్నాం. ఈ జరిమానాలపై లీజుదారులు రివిజన్ అథారిటీకి అప్పీల్ చేసుకోవచ్చు. ఇది అన్ని మినరల్స్ మైనింగ్‌లోనూ సర్వసాధారణంగా జరుగుతుంది. అథారిటీ ఆ జరిమానాలను సమీక్షించి నిర్ణయం తీసుకుంటుంది. కేవలం ఎవరికో లబ్ధి చేకూర్చేందుకు జరిమానాలను సర్దుబాటు చేశారని రాయడం తప్పు.

తిరుపతి జిల్లా చిల్లకూరు, కోట మండలాల్లోని 1150.975 హెక్టార్లలో 73 సిలికా శాండ్ లీజులున్నాయి. శుద్ధి చేయని సిలికా శాండ్‌ను టన్ను రూ.700 కి విక్రయిస్తారు. శుద్ధి చేసిన ఇసుకను దానికి అయిన వ్యయాన్ని బట్టి రేటు నిర్ణయిస్తారు. శుద్ధి చేయని ఇసుకకు లీజుదారులు టన్నుకు రూ.100 సీనరేజీ, కన్సిడరేషన్ కింద రూ.212, డీఎంఎఫ్ కింద రూ.30, మెరిట్ కింద రూ.2 కలిపి రూ.346 ప్రభుత్వానికి చెల్లించాలి.

కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నాం

సిలికా శాండ్ మైనింగ్‌పై కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తున్నాం. 2019లో 73 లీజులను గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి ఉల్లంఘనలు గుర్తించి 61 లీజులకు జరిమానా విధించారు. వారిలో 52 మంది లీజుదారులు రివిజన్ అథారిటీకి అప్పీల్ చేసుకున్నారు. అథారిటీ వాటిని సమీక్షించి పరిష్కరించింది. సిలికా శాండ్ మైనింగ్, రవాణాపై మూడంచెల నిఘా వ్యవస్థ కొనసాగుతోంది. ఇంటర్నల్ బృందాలు, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ తనిఖీలు, జిల్లా విజిలెన్స్ బృందాలు ఎప్పటికప్పుడు మైనింగ్‌ను పర్యవేక్షిస్తున్నాయి. ఆకస్మిక తనిఖీల ద్వారా ఎక్కడా అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాయి. తిరుపతి జిల్లా మోమిడి, బల్లవోలు, వేల్లపాలెం తదితర గ్రామాల్లోని అసైన్డ్ భూముల్లో అక్రమ సిలికా తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు అవాస్తవం. తిరుపతి జిల్లా తడ మండలం బీవీ పాలెం వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి అక్రమ మైనింగ్ రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రిస్తున్నాం. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంగా నిఘా బృందాలు ఎప్పటికప్పుడు సిలికా శాండ్ మైనింగ్‌ను పర్యవేక్షిస్తున్నాయి. సిలికా శాండ్ మైనింగ్‌లో లీజుదారులది ప్రేక్షక పాత్రని, వందల కోట్ల దందా జరుగుతోందని, కొందరు పెద్దలకు ఈ మొత్తాలు చేరుతున్నాయంటూ ప్రభుత్వంపై ప్రజల్లో అపోహలు కలిగించేలా ఈనాడులో తప్పుడు కథనాన్ని ప్రచురించడాన్ని ఖండిస్తున్నాం. నిబంధనల ప్రకారమే మైనింగ్, విక్రయాలు, రవాణా జరుగుతుంటే, అక్రమాలు, పెద్దల పాత్రంటూ ఊహాత్మక అంశాలను జోడించి, అసత్య కథనాలు రాయడం మానుకోవాలి.

'జగనన్నకు చెబుదాం' @1902

▶ మొదటి పేజీ తరువాయి

ఎలాంటి సమస్యలున్నా తెలియచేయవచ్చు. సంక్షేమ పథకాలు, వైఎస్సార్ పెన్షన్ కానుక, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ సేవలు పొందడంలో ఏమైనా అవాంతరాలు ఎదురైతే రైతన్నలు, అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, మరెవరైనా సరే ఫిర్యాదు చేయవచ్చు. రెవెన్యూ రికార్డులకు సంబంధించి ఏమైనా సమస్యలున్నా, ప్రభుత్వ సేవలకు సంబంధించి మరే ఇతర ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కారం కోసం 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలి. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుంది. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతో పాటు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుంది.

జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లకు ఆహ్వానం

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల పరిషత్ కార్యాలయాలతో పాటు గ్రామ సచివాలయాలు/రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జడ్పీ సీఈవోలు, డీపీవోలకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. స్థానిక జడ్పీటీసీకి ఈ సమాచారాన్ని అందచేయడంతోపాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని పేర్కొంది. గ్రామ సచివాలయాల్లో నిర్వహించే కార్యక్రమానికి స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలను ఆహ్వానించాలని సూచించింది.

ఎలా చెబుదామంటే..?

1. మీ సమస్యను తెలియచేసేందుకు తొలుత 1902 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలి
2. కాల్ సెంటర్ ప్రతినిధికి మీ సమస్యను చెప్పండి
3. మీ ఫిర్యాదును నమోదు చేసుకుని వైఎస్సార్ (యువర్ సర్వీస్ రిక్వెస్ట్) ఐడీని కేటాయిస్తారు
4. మీ అర్జీ స్టేటస్ గురించి ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా అప్‌డేట్ అందుతుంది
5. సమస్య పరిష్కారం తర్వాత ప్రభుత్వ సేవలపై మీ అభిప్రాయాన్ని పంచుకోండి

అంతా క్షేమంగా..

▶ మొదటి పేజీ తరువాయి

హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విద్యార్థులు ప్రత్యేక బస్సుల్లో స్వగ్రామాలకు బయలుదేరుతూ థ్యాంక్యూ సీఎం సర్ అంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమను మణిపూర్ నుంచి హైదరాబాద్ వరకు తీసుకొస్తే చాలనుకుంటే స్వగ్రామాలకు వెళ్లేందుకు కూడా బస్సులను సమకూర్చడం తమ యోగక్షేమాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధకు నిదర్శనమని గుంటూరు జిల్లాకు చెందిన అవినాష్ అనే విద్యార్థి పేర్కొన్నాడు. మణిపూర్‌లో విద్యాసంస్థల నుంచి బయలుదేరింది మొదలు స్థానిక పోలీసుల భద్రతతో ఇంఫాల్ ఎయిర్‌పోర్టుకు తరలించడమే కాకుండా రవాణా, భోజన వసతులను కూడా ప్రభుత్వమే భరించడం పట్ల కృతజ్ఞతలు తెలియచేస్తున్నారు. రోజూ తాగడానికి ఒక బాటిల్ మాత్రమే మంచి నీళ్లు ఇస్తున్న విషయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తేవడంతో ధైర్యం చెప్పడమే కాకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి ఏర్పాట్లు చేసినందుకు విజయనగరం జిల్లాకు చెందిన ఒక విద్యార్థి ధన్యవాదాలు తెలిపాడు. సురక్షితంగా తమ గ్రామానికి చేర్చిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన హర్షిత, కృష్ణా జిల్లాకు చెందిన రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టులో విద్యార్థులతో ఎంపీ భరత్‌రామ్

ఇంఫాల్ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్న విద్యార్థులను ఎయిర్‌పోర్టులో వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి చేదు అనుభవాలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మీకు ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం వారంతా ప్రత్యేక బస్సుల్లో బయలుదేరేలా దగ్గరుండి స్వయంగా పర్యవేక్షించారు. క్షేమంగా విద్యార్థుల తరలింపుపై ముఖ్యమంత్రి జగన్ ఎప్పటికప్పుడు సమీక్షించినట్లు ఎంపీ భరత్‌రామ్ తెలిపారు.

కోల్‌కతా నుంచి మూడు ఫ్లైట్లలో 55 మంది

మణిపూర్ నుంచి రాష్ట్రానికి చెందిన 163 మంది విద్యార్థులను సురక్షితంగా తరలించినట్లు అధికారులు చెప్పారు. ఇండిగో ఏ 320 ఫ్లైట్‌లో సోమవారం మధ్యాహ్నం 12.45కు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న 108 మందిని అక్కడ నుంచి బస్సుల్లో స్వగ్రామాలకు పంపారు. మణిపూర్ నుంచి మరో 55 మంది కోల్‌కతా విమానాశ్రయం చేరుకోగా వారిని మూడు ఫ్లైట్స్ ద్వారా హైదరాబాద్ తరలించేలా రాష్ట్ర ప్రభుత్వం టికెట్లు బుక్ చేసింది. 27 మంది, 15 మంది, 13 మంది చొప్పున మూడు ఫ్లైట్స్‌లో తరలించేలా ఏర్పాట్లు చేశారు.

- ఇంఫాల్‌లో ఇంజనీరింగ్ నాలుగో ఏడాది చదువుతున్న దాసరి యాదిత్యపాల్ ప్రత్యేక విమానంలో సురక్షితంగా హైదరాబాద్ చేరుకున్నట్లు ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు 'సాక్షి'కి వెల్లడించారు. తమ కుమారుడిని క్షేమంగా రప్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



యాదిత్యపాల్

- మణిపూర్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నా కుమారుడు బి.కల్యాణ్‌కుమార్‌ను సురక్షితంగా రప్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. మంగళవారం ఉదయం స్వగ్రామానికి చేరుకుంటానని నా కుమారుడు ఫోన్‌లో తెలియజేశాడు.
  – ముసలయ్య (కల్యాణ్‌కుమార్ తండ్రి) వెంకటాచలం మండలం, పాలిచెర్లపాడు (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా)



- మణిపూర్ ట్రిపుల్ ఐటీలో చదువుకుంటున్నా. తినడానికి ఏమీ దొరకక పస్తులున్నాం. తాగే నీళ్లల్లో సైతం విషపదార్థాలు కలిపే ప్రయత్నాలు చేశారు. చాలా భయపడ్డాం. ప్రత్యేక విమానంలో కోల్‌కతా చేరుకున్నాం. మాకు సాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
  – పవన్‌కళ్యాణ్, బంగారుపాళ్యం, చిత్తూరు జిల్లా



- మా పెద్ద కుమారుడు ఎస్.కార్తీక్ మణిపూర్‌లోని ఎన్ఐటీలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. మూడు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. అక్కడ జరుగుతున్న ఘర్షణలతో ఎంతో ఆందోళన చెందాం. ప్రభుత్వం సకాలంలో స్పందించింది. మా కుమారుడు రాత్రికి తిరుపతిలోని కొర్లగుంట చేరుకుంటానని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.
  – రెడప్ప, మాధవి, తిరుపతి (విద్యార్థి కార్తీక్ తల్లిదండ్రులు)



కార్తీక్,విద్యార్థి

ఖర్చుకు వెనుకాడొద్దు.. భద్రతే ముఖ్యం

సాక్షి, అమరావతి: మణిపూర్‌లో చదువుకుంటున్న మన విద్యార్థులు స్థానికంగా చెలరేగిన అల్లర్ల కారణంగా చిక్కుకుపోయిన విషయం సీఎం జగన్ దృష్టికి వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి ఖర్చుకు వెనుకాడకుండా అందరినీ సురక్షితంగా రప్పించాలని ఆదేశించినట్లు సీఎం కార్యదర్శి రేవు ముత్యాలరాజు వెల్లడించారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ 'విద్యార్థులు చిక్కుకున్న విషయం తెలియగానే ఆ రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ శాఖలతో సంప్రదించేందుకు ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్ సిద్ధం చేసి హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులోకి తెచ్చాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫోన్ చేసి వివరాలు అందించారు. 161 మంది మణిపూర్‌లో ఉన్నట్లు లెక్క తేలడంతో సురక్షితంగా రాష్ట్రానికి రప్పించేందుకు మణిపూర్ ప్రభుత్వం, పౌర విమానయాన శాఖతో పాటు ప్రైవేట్ విమానయాన సంస్థలతో చర్చించాం. ప్రత్యేక విమానాలు నడిపేందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ ముందుకు రావడంతో ఓ విమానం ద్వారా 106 మందిని హైదరాబాద్‌కు తరలించి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో స్వగ్రామాలకు చేర్చాం. కోల్‌కతా విమానాశ్రయంలో ఉన్న మిగిలిన 55 మంది మూడు దఫాలుగా సోమవారం రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారు. ఇంకా ఎవరైనా మిగిలిన వారు హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదిస్తే తగిన ఏర్పాట్లు చేస్తాం'.

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



తీవ్రమైన ఘర్షణలు ఆందోళన కలిగించాయి. భయానక సంఘటనలతో క్యాంపస్‌లో ఉన్న మేమంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికాం. జీవితం ఈ ఘర్షణల్లోనే ముగిసిపోతుందనే భయం వచ్చేసింది. అలాంటి పరిస్థితుల నుంచి ఒక్కసారిగా మమ్మల్ని మన రాష్ట్రం గడ్డ మీదకు తీసుకొచ్చారు. మమ్మల్ని ప్రాణాలతో కుటుంబ సభ్యుల చెంతకు చేర్చుతున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.
– జె.అభిషేక్ (నరసరావుపేట), మణిపూర్ వర్సిటీ విద్యార్థి

భయంకర పరిస్థితుల నుంచి బయటపడ్డాం



మణిపూర్‌లో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. తాగేందుకు నీళ్లు రావడం లేదు. విద్యుత్, ఇంటర్‌నెట్ ఆపేశారు. తినడానికి ఏమీ దొరకడం లేదు. రవాణా పూర్తిగా నిలిచిపోయింది. అలాంటి దారుణమైన పరిస్థితుల నుంచి ప్రభుత్వం మమ్మల్ని కాపాడింది. ఇక చూడలేమనుకున్న నా కుటుంబ సభ్యుల చెంతకు చేరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.
– కె.చరణ్ (ఒంగోలు), మణిపూర్ నిట్ విద్యార్థి

క్షేమంగా ఇంటికి చేర్చారు



ఇంఫాల్‌లోని నిట్‌లో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) చదువుతున్నా. ఐదు రోజుల నుంచి అక్కడ తిండి, మంచినీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఏపీ ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించి ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేసింది. మణిపూర్‌లో రెండు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేయడంతో హైదరాబాద్ వరకు చేరుకున్నాం. అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో కర్నూలుకు.. అక్కడి నుంచి బనగానపల్లె చేరుకున్నాం. – కె.మధుకిశోర్ (నందవరం, బనగానపల్లె మండలం), నిట్ విద్యార్థి

బుల్లెట్లు, బాంబుల వర్షాన్ని తప్పించుకుని..



యూనివర్సిటీ చుట్టూ బాంబుల మోత, క్యాంపస్‌లోకి బుల్లెట్ల వర్షం. వీటి మధ్యలో బిక్కుబిక్కుమంటూ బతికాం. ప్రశాంతంగా ఉండే మా యూనివర్సిటీ క్యాంపస్ రణరంగాన్ని తలపిస్తోంది. బతికుంటామా అనే సందేహంలో పడ్డాం. తినడానికి తిండి లేదు. తాగేందుకు నీరు లేదు. ఇలాంటి పరిస్థితుల నుంచి ఏపీ ప్రభుత్వం మమ్మల్ని సురక్షితంగా తీసుకొచ్చింది. – ఎం.వెంకటేష్ (వినుకొండ), మణిపూర్ నిట్ విద్యార్థి

జగన్‌కు రుణపడి ఉంటాం



మణిపూర్ అల్లర్ల నుంచి బయటపడి మన రాష్ట్రానికి వచ్చామంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. విజయవాడ బస్టాండ్‌లో ఉన్నాననేది ఇప్పటికీ కలగానే ఉంది. ఈ రోజు తెల్లవారుజామున మన వాళ్లు వచ్చి లేపారు. మణిపూర్‌లో విమానం ఎక్కించి హైదరాబాద్ తీసుకొచ్చేశారు. సీఎం జగన్‌కు మా కుటుంబం మొత్తం రుణపడి ఉంటుంది.
– బి.కల్యాణ్ (నెల్లూరు), మణిపూర్ వర్సిటీ విద్యార్థి

ఆపదలో అండగా నిలిచిన సీఎం



ఆపదలో అండగా నిలబడి సీఎం వైఎస్ జగన్ మా బిడ్డ శ్రీరామ్‌చరణ్‌తేజను మా చెంతకు చేరుస్తున్నారు. మా కుమారుడు మణిపూర్ నిట్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. విద్యార్థుల భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతి ఒక్కరినీ క్షేమంగా ఇళ్లకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేసింది. – సహదేవనాయుడు, రేణుక, విద్యార్థి తల్లిదండ్రులు, మదనపల్లి

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

ఏప్రిల్ రెండో వారం నుంచే కొనుగోళ్లకు శ్రీకారం

సాక్షి నెట్‌వర్క్‌:

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏప్రిల్ రెండో వారం నుంచి అనేక జిల్లాల్లో రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా రబీ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు చెల్లింపులను ప్రభుత్వం ఎలాంటి ఆలస్యం చేయకుండా నిర్ణీత వ్యవధిలోగా చెల్లిస్తోంది. అక్కడక్కడ రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ నెంబరు అనుసంధానం కాకపోవటంవల్ల నగదు జమకాకుండా పెండింగ్‌లో ఉంది. మరోవైపు.. ఈ ప్రక్రియలో హమాలీలు, రవాణా చార్జీలు రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని రైతులెవరూ అధైర్యపడకుండా ఉండాలని.. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని విక్రయించాలని.. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఉన్నతాధికారులు రైతులకు సూచిస్తున్నారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తమకెంతో మేలు చేస్తోందని.. సకాలంలో డబ్బులు చెల్లిస్తోందని రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. దళారీలకు అమ్ముకుని ఉంటే బాగా నష్టం జరిగేదని.. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు అమ్ముకోవడం బాగా కలిసొచ్చిందని వారంటున్నారు. జిల్లాల వారీగా చూస్తే..

- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఇప్పటివరకు 4,460 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసింది. ఎన్నడూ లేని విధంగా ఈ దఫా జిల్లాలో తెగుళ్ల తగ్గుముఖం పట్టి అధిక దిగుబడులు, అధిక ధరలతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.
- బాపట్ల జిల్లాలో ఏప్రిల్ 10 నుంచి రబీ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ జిల్లాలో 2,244 మంది రైతుల నుంచి 13,516 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది.
- ప్రకాశం జిల్లాలోనూ ఏప్రిల్‌లోనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇక్కడ మొత్తం 35 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు 3 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో తడిసిన ధాన్యం ఎక్కడాలేదు. వర్షం వచ్చినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. గోనె సంచులను ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాల్లోనే అవసరమైనన్ని అందుబాటులో ఉంచారు.
- తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం నాటికి 24,766 మంది రైతుల నుండి 1,69,370 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణకు కూపన్లు విడుదల చేశారు. సోమవారం ఆన్‌లైన్‌లో 2,579.200 మెట్రిక్ టన్నులు, ఆఫ్‌లైన్‌లో 2,620.748 మెట్రిక్ టన్నులు మొత్తంగా చూస్తే 14,733 మంది రైతులు నుండి 1,33,302.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.
- పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా దాళ్వా సీజన్‌లో ఇప్పటివరకు 33,929 మంది రైతుల నుంచి 3.20 లక్షల టన్నులను కొనుగోలు చేశారు.
- ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1.50 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. 12,581 మంది రైతుల నుంచి రూ.297 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.
- కృష్ణాజిల్లాలో ఇప్పటివరకు 19,020 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.


పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం కాళ్లకూరు రైస్ మిల్లు వద్ద ధాన్యం కొనుగోలు తీరును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారులు


రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తరలిస్తున్న లారీ


నంద్యాల జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న సిబ్బంది

- అనకాపల్లి జిల్లాలో ధాన్యం సేకరణ సోమవారం నుంచి ప్రారంభమైంది. జిల్లాలో 39 ఆర్బీకేల ద్వారా 14 కొనుగోలు కేంద్రాలు సిద్ధంచేశారు. ఇందుకు ప్రభుత్వం స్పెషలాఫీసర్లను నియమించింది. రానున్న రోజుల్లో వర్షాలుపడే అవకాశం ఉన్నందున పంట నష్టం కలుగకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రత్యేకాధికారి జె. నివాస్ ఆదేశించారు.


అనకాపల్లి జిల్లా మర్రిపాలెంలో వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న నివాస్

ప్రభుత్వం చొరవతో 40 క్వింటాళ్లు అమ్ముకున్నా



ప్రభుత్వం చొరవ తీసుకుని మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టడం శుభపరిణామం. నిజానికి.. మొక్కజొన్నకు ధరలు తగ్గిపోయాయి. మద్దతు ధర రూ.1,962 ఉండగా.. దళారీలు క్వింటా కేవలం రూ.1,500–1,600 ధరకు కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చారు. కానీ, ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలూ ఏర్పాటుచేయడంతో సోమవారం 40 క్వింటాళ్లు అమ్ముకున్నా. దళారీలకు అమ్ముకుని ఉంటే దాదాపు రూ.15వేల వరకు నష్టం జరిగేది. మద్దతు ధరతో అమ్ముకోవడం బాగా కలిసొచ్చింది.

– సంగ నాగేశ్వర్, ముతలూరు, రుద్రవరం మండలం, నంద్యాల జిల్లా

- పల్నాడు జిల్లాలో ఇప్పటికే 85 శాతం వరి నూర్పిళ్లను రైతులు పూర్తిచేశారు. మొక్కజొన్న సేకరణ కేంద్రాలనూ ప్రారంభించారు. ఈ జిల్లాలోనూ కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి.


పల్నాడు జిల్లా పాలపాడులో మొక్కజొన్న కొనుగోలును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సూర్యకుమారి

రైతులకు సకాలంలో డబ్బులు అందుతున్నాయి



నేను సుమారు ఐదెకరాలు సాగుచేస్తున్నా. దాళ్వా వరి సాగుకు సంబంధించి ఇప్పటివరకు మాసూళ్లు చేసిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసింది. సకాలంలోనే డబ్బులు కూడా అందాయి. వాతావరణంలో మార్పులవల్ల కొంత పంట మాసూళ్లు ఆలస్యమైంది. ఇప్పుడు మిగిలిన పంటను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. గిట్టుబాటు ధర ఉండడం సంతోషం.

– బొక్కా రాంబాబు, రైతు, కొండేపూడి, పాలకోడేరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా

ఎప్పుడూ లేని విధంగా బస్తాకు రూ.1,530 ఇచ్చారు



ఎన్నడూ, ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ఈ ప్రభుత్వం ధాన్యం డబ్బు అందించింది. 75 కిలోల బస్తాకు రూ.1,530 ఇచ్చింది. గతంలో దళారులు కమీషన్ తీసుకునేవారు. డబ్బులకు రెండునెలలు పట్టేది. ఇప్పుడు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి నేరుగా మా ఖాతాలో డబ్బు జమచేసింది. సంచులు కూడా సకాలంలో ఇచ్చింది. ధాన్యం రవాణాకూ లారీని ఏర్పాటుచేస్తున్నారు.

– పొన్నాడ రాఘవరావు, రైతు, యర్రమళ్ల, ఏలూరు జిల్లా

ఆదాయం బాగుంది.. సంతోషంగా ఉంది



నేను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మడపల్లి గ్రామంలో సొంత పొలంలో వరి సాగుచేశాను. మొత్తం 30 పుట్ల దిగుబడి వచ్చింది. ఈ ధాన్యాన్ని ఆర్బీకే ద్వారా విక్రయించా. ఆదాయం బాగుంది. సంతోషంగా ఉంది.

– కొండారెడ్డి, రైతు, మడపల్లి, చేజెర్ల మండలం, నెల్లూరు జిల్లా

రైతులకు సహకరించాం



మడపల్లిలో సుమారు 560 ఎకరాల్లో వరిని సాగుచేశారు. పంటను కాపాడేందుకు రైతులకు సూచనలు, సలహాలిచ్చాం. ఏ సమయంలో పంటను కోయాలో వివరించాం. చివరలో ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా సేకరిస్తున్నాం.

– ఎ. మమత, మడపల్లి, వీఏఏ, చేజెర్ల మండలం, నెల్లూరు జిల్లా

వారం రోజుల్లో డబ్బులు జమయ్యాయి



బాపట్ల జిల్లా చినగంజాం మండలం, చింతగుంపల్లి గ్రామానికి చెందిన నేను 110 క్వింటాళ్ల ధాన్యాన్ని ఏప్రిల్ 25న మా గ్రామంలోని ఆర్బీకే ద్వారా రైస్‌మిల్లుకు తోలాను. క్వింటాకు రూ.2,060 చొప్పున రూ.2,26,600 నగదు ఈనెల 4న నా అకౌంట్‌కు జమచేశారు. గతంలో దళారులు మా వద్ద ధాన్యం కొనుగోలు చేసి నెలల తరబడి వారి చుట్టూ తిప్పుకునే వాళ్లు. ప్రస్తుతం గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సకాలంలో నగదు జమచేయటం చాలా సంతోషంగా ఉంది.

– కరణం శ్రీనివాసరావు, చినగంజాం మండలం, బాపట్ల జిల్లా

తెలంగాణ

రేపటి నుంచి తెలంగాణ ఎంసెట్

సాక్షి, హైదరాబాద్‌: ఇంజనీరింగ్, వైద్య, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే తెలంగాణ ఎంసెట్–2023 ఈ నెల 10వ తేదీ నుంచి మొదలవుతుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. 10, 11 తేదీల్లో అగ్రి, మెడికల్ ఎంసెట్ జరుగుతుంది. 12 నుంచి 14 వరకూ ఇంజనీరింగ్ ఎంసెట్ ఉంటుంది. రెండు సెషన్లుగా ఉండే ఈ పరీక్ష, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ ఒక విడత, సాయంత్రం 3 నుంచి 6 వరకూ రెండో విడత జరుగుతుంది. రెండు రాష్ట్రాల పరిధిలో ఇంజనీరింగ్ ఎంసెట్ 2,05,405 మంది, అగ్రి, మెడికల్ ఎంసెట్ 1,15,361 మంది రాస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా 104, ఆంధ్రప్రదేశ్‌లో 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం పూట ఎంసెట్ పరీక్షకు హాజరయ్యేవారు 7.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. సాయంత్రం పరీక్ష రాసేవాళ్ళు మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్షా కేంద్రానికి రావాలి.

శరత్‌చంద్రారెడ్డి మధ్యంతర బెయిల్ పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో శరత్‌చంద్రారెడ్డికి సీబీఐ ప్రత్యేక కోర్టు మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 16 వరకూ పొడిగించింది. గతంలో మంజూరు చేసిన షరతులతో కూడిన బెయిల్ సమయం ముగియడంతో.. ఈ అంశంపై సోమవారం జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ధర్మాసనం విచారించింది. భార్య అనారోగ్యం రీత్యా మధ్యంతర బెయిల్ కోరుతూ శరత్‌చంద్రారెడ్డి దాఖలు చేసిన పిటిషన్, వైద్య పత్రాల తనిఖీ నివేదికపై ఈడీ కౌంటర్ ఇవ్వాల్సి ఉంది. కానీ వైద్యపరమైన కారణాలతో శరత్‌చంద్రారెడ్డికి హైకోర్టు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. ఆ ఉత్తర్వులు హైకోర్టు ఇంకా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు. ఈ నేపథ్యంలో పరిణామాలు దృష్టిలో ఉంచుకొని శరత్‌చంద్రారెడ్డికి గతంలో షరతులను వర్తింపజేస్తూ మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 16 వరకూ పొడిగిస్తున్నామని.. ఈలోగా హైకోర్టు ఉత్తర్వు ప్రతి అందజేస్తే స్వీకరిస్తామని స్పష్టం చేస్తూ జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రం జాగీర్ అనుకుంటున్నారు

'యువ సంఘర్షణ సభ'లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఫైర్

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో ప్రజాస్వామిక పాలన లేదని, నియంతృత్వం కొనసాగుతోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ విమర్శించారు. టీఆర్‌ఎస్ నేతలు ఈ రాష్ట్రం తమ జాగీర్ అనుకుంటున్నారని మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన 'యువ సంఘర్షణ సభ'లో ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ ప్రజల కలలను, ఆకాంక్షలను బీఆర్‌ఎస్ ఛిద్రం చేసిందని ఆరోపించారు. 'మీరంతా నన్ను నయా ఇందిరమ్మ అంటున్నారు. ఆమెతో పోలుస్తుంటే నాపై బాధ్యత పెరుగుతోంది.' అని ప్రియాంకాగాంధీ అన్నారు.

ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదు

అధికారులకు సీఎం జగన్ ఆదేశం



సాక్షి, అమరావతి: అకాల వర్షాలతో తడిసిన, మొలకెత్తిన, తేమ శాతం అధికంగా ఉన్న ధాన్యం కొనుగోలు విషయంలో ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్లపైన, వ్యవసాయ క్షేత్రాల వద్ద రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన తరలించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఏ రైతూ మిల్లర్ల వద్దకు వెళ్లొద్దు

ఇప్పటికే వ్యవసాయ క్షేత్రాల నుంచి మిల్లులకు ధాన్యం రవాణా చేయడానికి అనుమతిచ్చాం. వర్షాల ప్రభావం ఉన్న జిల్లాల్లో గన్నీ బ్యాగ్‌ల కొరత లేకుండా చూడాలి. అవసరమైతే పొరుగు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున గన్నీ బ్యాగ్‌లను ఆయా జిల్లాలకు తరలించాలి. రైతులు మిల్లులను సందర్శించడం, మిల్లర్లను కలవడం వల్ల రైతులపై అనవసరమైన ఒత్తిళ్లు తీసుకొస్తారు. ఇది ప్రతికూల సందేశానికి దారితీస్తుంది. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎఫ్‌టీవో జనరేట్ అవుతుంది. చెల్లింపుల విషయంలో ఏ ఒక్క రైతూ మిల్లర్ దగ్గరకు వెళ్లనవసరం లేదు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలి. ఆఫ్‌లైన్ ద్వారా కొన్న వివరాలను 24 గంటల్లో ఆన్‌లైన్‌లో మార్చుకోవాలి. విరిగిన నూక శాతాన్ని అంచనా వేసేందుకు మినీ మిల్లుల సంఖ్యను పెంచాలి. ఆర్బీకేల ద్వారా నూక శాతాన్ని నిష్పక్షపాతంగా అంచనా వేయొచ్చు. అధిక తేమ, విరిగిన, పగుళ్లు, పలువలు మారడం, మొలకెత్తడం వంటి కారణాలతో కొనుగోళ్లను తిరస్కరించడం ద్వారా రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి. వరి విస్తీర్ణం ఎక్కువగా ఉండి.. మిల్లింగ్ సామర్థ్యం తక్కువగా ఉన్న ఎన్టీఆర్, ఉత్తర కోస్తా జిల్లాల్లో ఆధునిక రైసు మిల్లుల ఏర్పాటును ప్రోత్సహించాలి. కాగా ఆదివారం నాటికి కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో 6.5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లోనే కొనుగోలు

సాధారణంగా 5 శాతం మొలక ధాన్యానికి మినహాయింపు ఉంటుంది. వర్షాల వల్ల ప్రస్తుతం మొలక శాతం 7–10 వరకు ఉంటోంది. అయినా ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. వాస్తవానికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. కానీ, వర్షాల వల్ల రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఆఫ్‌లైన్‌లో కొనుగోలుకు చర్యలు చేపట్టింది. వాటిని సమీపంలోని మిల్లులకు తరలిస్తున్నారు. ప్రస్తుతం రైతులు వాటిని ఆరబెట్టుకోలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నేరుగా ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. వాటిని బాయిల్డ్ రకంగా పరిగణించి బాయిల్డ్ మిల్లులకు తరలిస్తున్నారు. మండలానికి ఒకటి చొప్పున మొబైల్ మినీ మిల్లులు ఏర్పాటు చేశారు. ఈ మినీ మిల్లుల ద్వారా మిల్లరు రైతుల ఎదుటే ధాన్యాన్ని మరాడించి ఎంత శాతం నూక వస్తుందో పరిశీలిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ క్యాడర్ అధికారులను కస్టోడియన్ ఆఫీసర్లుగా మిల్లుల వద్ద నియమించి రైతులకు సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆర్బీకేలో ధాన్యం అప్పగించి రసీదు పొందే వరకే రైతు బాధ్యత. ఆ తర్వాత మిల్లర్లు పిలిచిన వెళ్లవద్దంటూ ఆర్బీకేల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ధాన్యం సేకరణ పద్ధతి ఇలా..

దశాబ్దాలుగా రైతుల గిట్టుబాటు ధరను దోచుకుంటున్న మిల్లర్లు, దళారులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. సాధారణంగా తొలుత ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతు ఆర్బీకేలోని ధాన్యం సేకరణ సిబ్బంది (వీఏఏ)ను సంప్రదిస్తారు. సదరు అధికారి క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ధాన్యం శాంపిళ్లను తీసుకుని ఆర్బీకేలోని ల్యాబ్‌లో పరీక్షిస్తారు. ఎఫ్‌ఏక్యూ నిబంధనల ప్రకారం.. ధాన్యం ఉన్నది, లేనిది నిర్ధారించి.. తేమ 17శాతం కంటే ఎక్కువ ఉంటే ఆరబెట్టేందుకు సూచిస్తారు. ధాన్యం శాంపిళ్ల నిబంధనల ప్రకారం ఉంటే.. రైతుకు ధాన్యం ఎప్పుడు తరలించేది షెడ్యూల్‌ను ఖరారు చేస్తూ మెసేజ్ రూపంలో రైతు మొబైల్‌కు సమాచారం పంపిస్తారు. అనంతరం షెడ్యూల్ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు హమాలీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని వాహనంలో లోడింగ్ చేస్తారు. తర్వాత తూకం వేసి ట్రాక్ షీట్ జనరేట్ చేస్తారు. అప్పుడు మాత్రమే సదరు రైతు ధాన్యం ఏ మిల్లుకు వెళ్లేది తెలుస్తుంది. ధాన్యం లోడింగ్‌లో రైతు సొంతంగా హమాలీలను ఏర్పాటు చేసుకుని ధాన్యాన్ని తరలిస్తే ప్రభుత్వం ఆర్బీకే, మిల్లు మధ్య దూరాన్ని బట్టి ఆ మొత్తాన్ని చెల్లిస్తుంది. ఎక్కువగా మిల్లరు లేదా ఏజెన్సీ ఏర్పాటు చేసిన హమాలీలు, వాహనాల్లోనే సరుకును రవాణా చేస్తున్నారు. ట్రాక్ షీట్ జనరేట్ అయిన తర్వాత మిల్లుకు ధాన్యాన్ని తరలిస్తారు. ఈ క్రమంలోనే ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో) వస్తుంది. అందులో రైతు విక్రయించిన ధాన్యం బరువు, దానికి చెల్లించే నగదు, హమీలు, రవాణా తదితర వివరాలు పొందుపరుస్తారు. ఒకసారి ఎఫ్‌టీవో జనరేట్ అయిన తర్వాత ఆర్బీకే సిబ్బందే ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తారు. మిల్లు దగ్గర ప్రభుత్వం నియమించిన కస్టోడియన్ అధికారి ధాన్యం వచ్చినట్టు ధ్రువీకరించి.. మిల్లరు లాగిన్‌కు ఫార్వర్డ్ చేస్తారు. మిల్లరు కూడా ధాన్యం వచ్చినట్టు ధ్రువీకరించుకుంటారు. అనంతరం ఎఫ్‌టీవోలో చూపించిన ప్రకారం రైతుకి నిర్ణీత వ్యవధిలో ధాన్యం నగదు జమవుతాయి. మిల్లర్లు తరుగు కింద ధాన్యం తగ్గించినా, రైతు నుంచి డబ్బు డిమాండ్ చేసినా, ఇతర విషయాలపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నెంబర్ 1967 వివరాలను ఎఫ్‌టీవో రసీదుపై ముద్రించారు.

రైతుల విషయంలోనూ రాజకీయమేనా?

- ఇన్‌పుట్ సబ్సిడీ, పరిహారాన్ని చంద్రబాబు ఏనాడైనా సకాలంలో ఇచ్చారా?
- ఆయన హైదరాబాద్‌కే పరిమితం కావాలి
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ఇప్పటివరకు రూ.వెయ్యికోట్ల ధాన్యం కొనుగోలు: మంత్రి కారుమూరి


నందమూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి

తాడేపల్లిగూడెం రూరల్‌: పంట నష్టపోయి కష్టాల్లో ఉన్న రైతుల విషయంలోనూ చంద్రబాబునాయుడు రాజకీయం చేయడం ఏమిటని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం నందమూరు, కృష్ణాయపాలెం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన, మొక్క వచ్చిన ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖమంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉండగా, రైతులకు ఏనాడు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పరిహారం ఇచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. తడిసిన, మొక్క వచ్చిన ధాన్యాన్ని సైతం మిల్లులకు తరలించాలని సీఎం జగన్ ఆదేశించారని చెప్పారు. రైతును ఆదుకునే దిశగా తాము పనిచేస్తుంటే చంద్రబాబు రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ పాలనలో రైతులు బాగున్నారని, వారితో రాజకీయాలు చెయ్యొద్దని, హైదరాబాద్‌కు పరిమితం కావాలని చంద్రబాబుకు హితవు పలికారు.

రైతులు మిల్లులకు వెళ్లక్కర్లేదు: కారుమూరి

కృష్ణాయపాలెంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులు మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. దళారులతో ప్రమేయం లేకుండా ధాన్యాన్ని ఆర్బీకేల్లో అప్పగిస్తే సరిపోతుందన్నారు. ఎవరైనా మిల్లర్లు మిల్లుల వద్దకు రావాలని రైతులకు ఫోన్‌చేస్తే తమకు తెలియజేయాలని చెప్పారు. దాళ్వా సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు రూ.వెయ్యి కోట్ల మేర ధాన్యం కొనుగోలు చేశామని, రూ.850 కోట్ల వరకు రైతుల ఖాతాలకు ధాన్యం సొమ్ములు చెల్లించామని ఆయన తెలిపారు.

బొండాలు రకం ఎంత ఉన్నా కొనుగోలు చేస్తాం..

కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన రైతు గుణ్ణం సూర్యనారాయణ 2636 రకం బొండాలు ధాన్యం కొనుగోలు చేయడంలేదని మంత్రి కారుమూరి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. రాష్ట్రంలో బొండాలు ధాన్యం కావాలని కేరళ ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందన్నారు. బొండాలు ధాన్యం ఎంత ఉన్నా రైతుల నుంచి కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించినట్లు ఆయన చెప్పారు.

బడి ఈడు పిల్లలందరూ బడికే..

2023-24లో నూరు శాతం నమోదు కోసం విద్యా శాఖ ప్రణాళిక

- ప్రత్యేకంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్
- ఇందులో బడిలో చేరని, డ్రాపవుట్, బాల కార్మికులు గుర్తింపు
- వీరిని పాఠశాలల్లో చేర్చడానికి ప్రత్యేక డ్రైవ్.. మార్గదర్శకాలు జారీ



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరంలో బడి ఈడు పిల్లలందరినీ బడుల్లో చేర్పించాలని విద్యా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. నూరు శాతం విద్యార్థుల నమోదు కోసం ఐదువారాల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. ఇందులో భాగంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం, ఒక తరగతి నుంచి మరో తరగతిలో పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవడం, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాక తదుపరి విద్యాభ్యాసం కోసం చేరికల డేటాను సేకరించడం, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో అసలు బడిలో చేరని, డ్రాపవుట్, బాల కార్మికులను గుర్తించడం, వీరి కోసం ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం వంటివి నిర్వహించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. నూరు శాతం విద్యార్థుల నమోదు కోసం ఈ నెల 12 వరకు డిప్యూటీ ఈవోలు, సెక్టోరల్ అధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో డీఈవోలు సమావేశాలు నిర్వహించాలి. అలాగే ఈ నెల 15 నుంచి 19 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా సంబంధిత పాఠశాలలు పిల్లల గణన చేపట్టాలి. ఉపాధ్యాయుల సహాయంతో బడి ఈడు పిల్లల జనాభాను లెక్కించి రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఇందుకు అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ, వార్డు వలంటీర్లు, విద్య–సంక్షేమ సహాయకులు, ఏఎన్‌ఎంలు సహకరిస్తారు. బడి ఈడు పిల్లల జాబితాను వయసుల వారీగా, బాల బాలికలవారీగా తయారుచేయాలి. ఈ డేటాను సంబంధిత గ్రామ, స్కూల్, మండల స్థాయిల్లో ఉంచాలి. మండల స్థాయి తుది జాబితాను సంబంధిత ఎంఈవోకు, డీఈవోకు సమర్పించాలి.

పథకాల ప్రయోజనాలను వివరించాలి..

పేరెంట్–టీచర్స్, సర్పంచ్, వార్డు సభ్యులు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సంబంధిత ప్రజాప్రతినిధులు సమావేశాలను నిర్వహించాలి. వీటిలో బడి ఈడు పిల్లల జాబితాను ప్రదర్శించాలి. ఆయా స్కూళ్లలో విజయాలతోపాటు మన బడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మ ఒడి తదితర పథకాల వల్ల కలిగే లబ్ధి గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించాలి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను, బ్యానర్లను గ్రామ కేంద్రాల్లో ప్రదర్శించాలి. పిల్లల నమోదు కోసం ర్యాలీలు నిర్వహించాలి. సమీపంలోని పాఠశాలల్లో నమోదు చేయడానికి ఐదేళ్లు, ఆ పై వయసు గల పిల్లలను, ఫౌండేషన్ స్కూళ్లలో 2వ తరగతి పూర్తి చేసిన పిల్లలను గుర్తించాలి. వీరిని సమీపంలోని పాఠశాలల్లో మూడో తరగతిలో చేర్పించాలి. అలాగే ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన పిల్లలను గుర్తించి సమీపంలోని పూర్వ ఉన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతిలో నమోదు చేయించాలి. ప్రీ హైస్కూల్స్‌లో 7వ తరగతి, 8వ తరగతి పూర్తి చేసిన పిల్లలను గుర్తించి సమీపంలోని హైస్కూల్స్‌లో 9వ తరగతిలో చేర్పించాలి. ఉన్నత విద్యలో ప్రవేశం పొందడానికి విద్యార్థులకు రికార్డ్ షీట్స్, బదిలీ సర్టిఫికెట్ జారీ చేయాలి. ప్రభుత్వ లేదా ఇతర సంస్థల్లో వారి ప్రవేశాన్ని నిర్ధారించుకోవాలి.

బాల కార్మికులను గుర్తించాలి..

ఈ నెల 22 నుంచి 26 వరకు పదో తరగతిలో ఉత్తీర్ణులైనవారు తదుపరి విద్యా సంస్థల్లో చేరుతున్నారో, లేదో తెలుసుకోవాలి. విద్యా సంవత్సరంలో డ్రాపవుట్ అడ్మిషన్ల జాబితాను తయారు చేయాలి. మే 29 నుంచి జూన్ 2 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా అసలు ఎప్పుడూ బడిలో చేరని, డ్రాపవుట్స్, బాల కార్మికుల జాబితాలను గుర్తించాలి. వారి ఎన్‌రోల్‌మెంట్ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. ఆ జాబితాలను సంబంధిత ఎంఈవోకు సమర్పించాలి.

పాఠశాల సంసిద్ధత

జూన్ 5 నుంచి 9 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ సమయంలో ప్రవేశ ప్రక్రియను ప్రారంభించాలి. పాఠశాలలను పునఃప్రారంభించే ముందు దానిలో భద్రతా చర్యలను పరిశీలించాలి. పాఠశాల ఆవరణ, రూఫ్ టాప్స్, క్రీడా మైదానాలు, ఆర్వో ప్లాంట్లు, తాగునీటి సరఫరా ట్యాంకులు, కిచెన్ షెడ్, పాత్రలు, టాయిలెట్లను శుభ్రం చేయాలి. నీటి సరఫరా ఉండేలా చూడాలి. చిన్న మరమ్మతులు ఏవైనా ఉంటే వాటిని ముందుగానే పూర్తి చేయాలి. కిచెన్ షెడ్‌లో గడువు ముగిసిన స్టాక్ ఏదైనా ఉంటే వాటిని పారేయాలి. విద్యుత్ మరమ్మతులు ఏవైనా ఉంటే చేయించాలి. తగినన్ని సంఖ్యలో జగనన్న విద్యా కానుక కిట్‌లు ఉన్నాయో, లేదో నిర్ధారించుకోవాలి. బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగి మాల్ట్, రికార్డులు, రిజిస్టర్లు, ఇతర స్టేషనరీ లభ్యతను చూసుకోవాలి. రాబోయే విద్యా కార్యకలాపాల నిర్వహణ కోసం సంస్థాగత ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

ఎన్‌ఎస్‌డీసీతో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఒప్పందం

సాక్షి, అమరావతి: అంతర్జాతీయంగా వివిధ దేశాల్లోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ)మరో ముందడుగు వేసింది. అంతర్జాతీయ ప్లేస్‌మెంట్లు అందిపుచ్చుకునే విధంగా నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఒప్పందం చేసుకుంది. సోమవారం ఏపీఎస్‌ఎస్‌డీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎస్‌డీసీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ అజయ్ కుమార్, ఏపీఎస్‌ఎస్‌డీసీ ఎండీ సీఈవో వినోద్ కుమార్ ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌ను ప్రారంభించడంతోపాటు అంతర్జాతీయ నియామకాల్లో ఎన్‌ఎస్‌డీసీఐ భాగస్వామిగా ఉంటుంది.



ముందు వాళ్లు నన్ను విస్మరిస్తారు, తర్వాత నిన్ను చూసి నవ్వుతారు, తర్వాత నీతో పోరాడుతారు, తర్వాత నువ్వు గెలుస్తావు.

– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, 9 మే 2023

ఔషధ రంగ ప్రక్షాళనే మందు!

ఒంట్లో నలతగా ఉండటం మొదలుకొని ఎలాంటి అనారోగ్య సమస్యలొచ్చినా వైద్యుణ్ణి సంప్రదించటం, తగిన మందు వాడి ఉపశమనం పొందటం సర్వసాధారణం. కానీ 'కొండ నాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడిన చందాన' ఔషధాలుంటే జనం ప్రాణాలు గాల్లో దీపంగా మిగిలిపోయినట్టే. ఔషధ సంస్థలన్నిటినీ అనలేంగానీ కొన్ని సంస్థలు అందరి కళ్లూ కప్పి నాసిరకం ఔషధాల ఎగుమతులతో లాభాలు గడించేందుకు తహతహలాడుతున్న తీరువల్ల మన దేశం పరువు ప్రతిష్ఠలు దెబ్బతింటున్నాయి. ఈ విషయంలో పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆలస్యంగానైనా కేంద్ర ప్రభుత్వం సంకల్పించటం సంతోషించదగ్గ విషయం. ఇకపై ఉత్పత్తుల తయారీ ప్రక్రియలో మంచి విధానాలు (జీఎంపీ) పాటిస్తున్నట్టు ధ్రువపడితేనే ఆ ఉత్పత్తులను విడుదల చేయటానికి అంగీకరించాలనీ, ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో విడుదల చేయాలనీ కేంద్రం నిర్ణయించింది. ఫార్మా ఉత్పత్తుల్లో మన దేశం విశ్వగురు అయిందని రెండు నెలలక్రితం కేంద్ర ఇంధన శాఖ సహాయమంత్రి భగవత్ కూబా ఘనంగా ప్రకటించారు. కానీ ఇక్కడినుంచి ఎగుమతవుతున్న ఔషధాల వాడకంవల్ల పదులకొద్దీమంది మృత్యువాత పడిన ఉదంతాలు ఆ ఘనతను కాస్తా హరిస్తున్నాయి. నిరుడు ఆఫ్రికా ఖండ దేశం గాంబియాలో దగ్గుమందు సేవించి 70 మంది పసిపిల్లలు మరణించగా, ఉజ్బెకిస్తాన్‌లో 19 మంది పిల్లలు చనిపోయారు. భారత్ నుంచి వచ్చిన కొన్ని ఔషధాల ప్రమాణాలు సక్రమంగా లేవని అమెరికా కూడా ప్రకటించింది. ఔషధాల్లో మోతాదుకు మించి రసాయనాలున్నాయని కొన్నిసార్లు, నిర్దేశిత ప్రమాణాల్లో లేవని కొన్నిసార్లు ఫిర్యాదులొస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో పంపిన ఔషధాలు పంపినట్టు వెనక్కొస్తున్నాయి. నిజానికి గాంబియాకు ఎగుమతయిన దగ్గు మందు మన దేశంలో విక్రయానికి పనికిరాదని నిషేధించారు! అయినా అది నిరాటంకంగా గాంబియాకు చేరుకుంది. వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపమే ఈ దుఃస్థితికి కారణం. దీన్ని ఎంత త్వరగా సరిదిద్దితే అంత మంచిది.

ఔషధాల్లో వినియోగించే ముడి పదార్థాలు ప్రామాణికమైనవి అవునో కాదో, అవి నిర్దేశించిన పాళ్లలో ఉన్నాయో లేదో తనిఖీ చేయటం, రోగంనుంచి ఉపశమనమిస్తుందని చేసిన ప్రకటనకు అనుగుణంగా ఆ ఉత్పత్తి ఉందో లేదో నిర్ధారించటం నియంత్రణ వ్యవస్థల పని. అలాంటి సంస్థలు మన దేశంలో 38 వరకూ ఉన్నాయి. కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ)తో పాటు రాష్ట్రాల్లో పలుచోట్ల ఔషధ పరీక్ష కేంద్రాలు(సీడీఎల్) ఉన్నాయి. కానీ ఏదీ సక్రమంగా అమలు కావటం లేదని పలుమార్లు రుజువైంది. గాంబియాలోనూ, ఆ తర్వాత ఉజ్బెకిస్తాన్‌లోనూ పసివాళ్ల ప్రాణాలు తీసిన దగ్గు, జలుబు మందులను హరియాణాలోని మైడెన్ ఔషధ సంస్థ ఉత్పత్తి చేసింది. ఈ సంస్థ తరచు ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉంది. తమ ఫ్యాక్టరీకి ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు ఉందని తన వెబ్‌సైట్‌లో ఆ సంస్థ ఘనంగా ప్రకటించుకున్నా అదంతా ఉత్తదేనని తేలింది. అయినా ఏ నియంత్రణ విభాగం ఆ ఔషధ సంస్థపై చర్య తీసుకోలేకపోయింది. ఇప్పుడు కొత్తగా అమల్లోకి తెస్తామంటున్న జీఎంపీ అయినా సక్రమంగా అమలు చేయగలిగితే మంచిదే. ఉత్పాదక ప్రక్రియ సక్రమంగా లేకపోతే ఆ ఉత్పత్తులు కాస్తా కొద్ది రోజుల్లోనే దెబ్బతింటాయి. ఔషధాలు రోగం తగ్గించకపోయినా ఎంతోకొంత సరిపెట్టుకోవచ్చుగానీ ప్రాణాలే తీస్తే?! అసలే పౌష్టికాహార లోపం, వాతావరణ కాలుష్యం, విషాహారం తదితరాలు జనం ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. చివరకు ఔషధాలు సైతం ఈ జాబితాలో చేరితే ఇక చెప్పేదేముంది?

వాస్తవానికి ఎగుమతి చేసే ఔషధాలకు జీఎంపీ విధానం ఎప్పటినుంచో అమలులో ఉంది. కానీ దాన్ని అమలు చేయటంలోనే అడుగడుగునా నిర్లక్ష్యం కనబడుతోంది. ఔషధాలు ఎగుమతి చేయదల్చుకున్న ప్రతి దేశమూ తమ ఔషధ సంస్థలు నిర్దిష్టమైన ప్రమాణాలు అమలు చేస్తున్నట్టు నిర్ధారించుకోవాలని గాంబియా విషాద ఉదంతం తర్వాత ప్రపంచ ఆరోగ్య సంస్థ నాలుగు నెలల క్రితం తెలిపింది. ఇందుకోసం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ముడి పదార్థాల నాణ్యత మొదలుకొని కర్మాగారంలోని పరిసరాలు, యంత్రాలు, సిబ్బంది పాటించే పరిశుభ్రత వరకూ సమస్తం సరిగా ఉన్నాయో లేదో చూడటం ఈ మార్గదర్శకాల సారాంశం. ఉత్పత్తి ప్రక్రియలోని ప్రతి దశలోనూ పాటించే విధానాలను నమోదు చేసేందుకు అవసరమైన నమూనాను ఎవరికి వారు రూపొందించుకోవాలనీ, పకడ్బందీ తనిఖీలతో ఇవన్నీ సక్రమంగా అమలయ్యేలా ఎప్పటికప్పుడు చూడాలనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది. కేంద్రం ప్రకటించబోయే జీఎంపీ ఇకపై మన దేశంలో విక్రయించే ఔషధాలకు కూడా వర్తిస్తుందంటున్నారు. మంచిదే. అయితే ఎగుమతయ్యే ఔషధాల విషయంలో చూపిన అలసత్వమే ఇక్కడా కనబడితే అనుకున్న లక్ష్యం నెరవేరదు. కర్మాగారం దాటి బయటికొచ్చే ప్రతి ఔషధమూ అత్యంత ప్రామాణికమైనదన్న విశ్వాసం రోగుల్లో కలగాలి. ఔషధాల తనిఖీ విధానంలో మార్పులు తెస్తే తప్ప దీన్ని సాధించటం కష్టం. మన దేశంలో ఔషధ తయారీ సంస్థలు దాదాపు 30,000 వరకూ ఉన్నాయి. వీటిని సక్రమంగా తనిఖీ చేయాలంటే ఇప్పుడున్న సిబ్బంది ఏమాత్రం సరిపోరు. కనుక కొత్త నియామకాలపై కూడా దృష్టి పెట్టాలి. అలాగే చాలా ఫార్మా సంస్థలు తమ ఉత్పత్తుల ప్రయోగ ఫలితాల వివరాలను బహిరంగపరచటం లేదు. ఏమాత్రం పారదర్శకత పాటించని ఇలాంటి ధోరణులే కొంప ముంచుతున్నాయి. ఔషధ రంగాన్ని సంపూర్ణంగా ప్రక్షాళన చేస్తేనే ఈ పరిస్థితి మారుతుంది.

నెహ్రూ హిందువు కాదంటారా?

విశ్లేషణ



సుధీంద్ర కులకర్ణి

నెహ్రూ నిజంగానే హిందువులకు వ్యతిరేకిగా ఉన్నారా? ఆయన జీవితాన్ని తరచి చూసిన ఏ సత్యాధ్యయనమైనా వంచనాపూరితమైన ఈ దుష్ప్రచారాన్ని బహిర్గతం చేస్తుంది. రామాయణ, మహాభారత, భగవద్గీతల పట్ల నెహ్రూకు ఉన్న ప్రీతి, గౌరవ ప్రపత్తులకు సాక్ష్యాల వెల్లువలు ఆయన రచనల్లో కనిపిస్తాయి. గుడిలో ప్రదక్షిణాలు చేసే హిందువు కాదు నెహ్రూ. కానీ హిందూ ఆధ్యాత్మికత, మార్మికతలపై ప్రగాఢమైన ఆసక్తులతో పెరిగారు. హిమాలయాలు, గంగానది భారతీయ నాగరికతకు ఉయ్యాలలు అని నెహ్రూ చేసిన అభివర్ణన మనల్ని వాటి దివ్యత్వంలో ఓలలాడిస్తుంది. దురదృష్టవశాత్తూ నెహ్రూ హిందువని సంఘ్ పరివార్, కాంగ్రెస్ రెండూ మరిచిపోయాయి.

తప్పుడు సమాచారానికి విస్తృత ప్రచారం కల్పించడంలో బీజేపీలోని కేంద్రీకృత సోషల్ మీడియా కమ్యూనికేషన్ వ్యవస్థ ఎంతో సమర్థంగా పని చేస్తుంటుందని ఢిల్లీ కాలేజీలో పాఠాలు చెబుతుండే నా మిత్రుడొకరు అన్నారు. ''ఢిల్లీ నుంచి పంపిన సమాచారం వేలాది వాట్సాప్ గ్రూపుల ద్వారా దేశం మొత్తానికి చేరుతుంది. ఉదాహరణకు, నేనొకసారి బిహార్‌లోని నా గ్రామస్థులు కొందరిని...'విద్య వల్ల నేను ఆంగ్లేయుడిని, సంస్కృతి వల్ల మహమ్మదీయుడిని, యాదృచ్ఛికంగా మాత్రమే హిందువును' అని ఒక నాయకుడు చెప్పుకున్నారని అంటారు. ఆ నాయకుడెవరో మీకు తెలుసా?' అని అడిగాను. ఆ ప్రశ్నకు తటాలున వచ్చిన సమాధానం: 'నెహ్రూ'!

భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ అంటే గిట్టని హిందూ జాతీయవాద రాజకీయ పార్టీ 'హిందూ మహాసభ' 1950లో తొలిసారి, ''నెహ్రూ విద్య చేత ఆంగ్లేయుడు. సంస్కృతి చేత మహమ్మదీయుడు. యాదృచ్ఛికంగా మాత్రమే హిందువు'' అని విమర్శించింది. తదనంతర కాలంలో ఆ మాటను నెహ్రూను ద్వేషించేవారంతా నెహ్రూకే ఆపాదించి, స్వయంగా ఆయనే తన గురించి ఆ విధంగా చెప్పుకొన్నట్లు ప్రచారంలోకి తెచ్చారు. గత ఏడాది ప్రారంభంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ, ''యాదృచ్ఛికంగా మాత్రమే తాము హిందువులమని చెప్పుకున్న వారి వారసులు తమను తాము హిందువులమని చెప్పుకోకూడదు'' అని రాహుల్ గాంధీపై చురకలు వేయడంతో ఉద్దేశపూర్వకమైన ఆ ఆపాదింపునకు పునరుద్ధరణ జరిగినట్లయింది.

సుసంపన్న భారత ఆనవాళ్లు

నెహ్రూ నిజంగానే హిందువులకు వ్యతిరేకిగా ఉన్నారా? ఆయన జీవితాన్ని తరచి చూసిన ఏ సత్యాధ్యయనమైనా వంచనాపూరితమైన ఈ దుష్ప్రచారాన్ని బహిర్గతం చేస్తుంది. నెహ్రూ రాసిన 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' (1934), 'యాన్ ఆటోబయాగ్రఫీ' (1936), 'ద డిస్కవరీ ఆఫ్ ఇండియా' (1946) మూడూ ప్రభావశీలమైనవి. డిస్కవరీ ఆఫ్ ఇండియా కారాగార వాసంలో రాసిన ఒక క్లాసిక్. (బ్రిటిష్ వాళ్లు ఆయన్ని 14 సార్లు జైలుకు పంపారు. 3,259 రోజులు కటకటాల వెనుక గడిపారు.) ఆయన ప్రసంగ సంకలనాలు, వ్యాసాలు, లేఖలు (పక్షానికొకసారి ముఖ్యమంత్రులకు ఆయన రాసిన లేఖలే ఐదు భారీ సంపుటాలు అయ్యాయి!) ... ఇవన్నీ కూడా ఇస్లాం, ఇతర బాహ్య ప్రభావాల చేత సుసంపన్నమైనదిగా నెహ్రూ భావించిన భారతదేశం తాలూకూ ప్రాచీన హిందూ నాగరికత సార్వత్రికత, సమగ్రతలతో నిండి ఉన్నవే.

రామాయణ, మహాభారత, భగవద్గీతల పట్ల నెహ్రూకు ఉన్న ప్రీతి, గౌరవ ప్రపత్తులకు సాక్ష్యాల వెల్లువలు ఆయన రచనల్లో కనిపిస్తాయి. వేదాలు, ఉపనిషత్తులు, తదితర గ్రంథాలలోని మన రుషుల జ్ఞానం, భక్తియుగంలోని సాధువులు, కవులు, సంఘ సంస్కర్తలు; రామకృష్ణ పరమహంస, స్వామీ వివేకానంద, మహర్షి అరబిందో, ఆధునిక కాలంలో జాతీయతా భావం మేల్కొనేందుకు దోహదపడిన ఇతర హిందూ తాత్విక మహర్షుల గొప్పదనాన్ని నెహ్రూ రచనలు దర్శింపజేస్తాయి. ఇక తన గురువు, హిందూ మతబోధనలతో జీవిత మార్గాన్ని ఏర్పరచిన మహాత్మాగాంధీపై ఆయనకున్న గురి ఎంతటిదో తెలిసిందే. నెహ్రూ తన చివరి సంవత్సరాలలో ఉపనిషత్తులపై చర్చించడానికి తరచు తనను కలిసేందుకు వచ్చేవారని భారత రాష్ట్రపతి (1962–67), హిందూ తాత్వికతపై ప్రశంసలు పొందిన అనేక పుస్తకాలకు రచయిత అయిన ఎస్.రాధాకృష్ణన్ ఒక సందర్భంలో వెల్లడించారు.



భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి, తొలి ప్రధాని నెహ్రూ, ఆర్ఎస్ఎస్ మాజీ సర్‌సంఘ్‌చాలక్ గోల్వాల్కర్

ఆలోచనల ప్రతిధ్వనులు

నెహ్రూ ప్రాపంచిక దృక్పథానికి, ఆయన కాలం నాటి కొందరు జనసంఘ్ హిందూ నాయకుల దృష్టి కోణానికి మధ్య స్పష్టమైన సారూప్యాన్ని కూడా మనం చూడవచ్చు. ఉదాహరణకు, బీజేపీ తన సైద్ధాంతిక మార్గదర్శిగా పరిగణించే పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రంథం 'ఇంటెగ్రల్ హ్యూమనిజం'... పెట్టుబడిదారీ, కమ్యూనిస్టు వ్యవస్థలను విడిచిపెట్టి భారతదేశం సమగ్ర అభివృద్ధి మార్గాన్ని అనుసరించాలన్న నెహ్రూ ఆలోచనను ప్రతిధ్వనిస్తుంది. నెహ్రూ మాదిరిగానే దీన్‌దయాళ్ కూడా మన ప్రాచీన సంస్కృతిలో మంచిది ఏదో దానిని తీసుకుని, అందులోని చెడును రూపుమాపడానికి సంసిద్ధమవడాన్ని గర్వంగా భావించాలని చెప్పారు. ఆయన ఇలా రాశారు: ''మనం మన ప్రాచీన సంస్కృతిలోని ప్రత్యేకతను గుర్తించకపోలేదు. అలాగని మనం పురావస్తు శాస్త్రజ్ఞులం కాలేము. విస్తారమైన ఈ పురావస్తు మ్యూజియానికి సంరక్షకులం కావాలన్న ఉద్దేశం కూడా మనకు లేదు. మన సమాజంలో విలువలను, జాతీయ ఐక్యతను పెంపొందించడానికి అవసరమయ్యే కొన్ని సంస్కరణలైతే చేయాలి. అందుకోసం కొన్ని సంప్రదాయాలకు స్వస్తి చెప్పాలి''.

నెహ్రూకు, ఆర్ఎస్ఎస్, జనసంఘ్, మోదీ-పూర్వపు బీజేపీలలోని నెహ్రూ విమర్శకులకు మధ్య తీవ్రమైన కొన్ని విభేదాలు ఉండొచ్చు. వాటిని దాచేయలేం. కానీ ఇప్పుడు నెహ్రూపై మనం చూస్తున్న క్రూర, విషపూరితమైన దూషణలు అప్పుడు లేవు. 1964 మేలో ఆయన మరణించినప్పుడు పార్లమెంటులో అటల్ బిహారీ వాజ్‌పేయి... ''తన ముద్దుల యువరాజు దీర్ఘ నిద్రలోకి కనురెప్పలు వాల్చడంతో భరతమాత శోక సముద్రంలో మునిగిపోయింది'' అని ఘనంగా నివాళులు అర్పించారు. నెహ్రూను శ్రీరామచంద్రుడితో పోలుస్తూ, ''వాల్మీకి గాథలో కనిపించే గొప్ప భావనలు మనకు పండిట్‌జీ జీవితంలో లభిస్తాయి'' అన్నారు. ''రాముడిలా నెహ్రూ కూడా అసాధ్యమైన, అనూహ్యమైన వాటికి రూపకర్త. ఆయన వ్యక్తిత్వ బలం, ఆ చైతన్యం, మనోస్వేచ్ఛ; ప్రత్యర్థికి, శత్రువుకు సైతం స్నేహహస్తం చాచే గుణం, ఆ పెద్ద తరహా, ఆ గొప్పతనం బహుశా భవిష్యత్తులో కనిపించకపోవచ్చు'' అని నివాళులు అర్పించారు. ఆర్ఎస్ఎస్ రెండవ చీఫ్ 'గురూజీ' గోల్వాల్కర్... నెహ్రూ దేశభక్తిని, మహోన్నతమైన ఆదర్శవాదాన్ని కొనియాడుతూ, ఆయనకు 'భరత మాత గొప్ప పుత్రుడి'గా హృదయపూర్వక అంజలులు ఘటించారు. భారతదేశంలో పార్లమెంటరీ వ్యవస్థకు బలమైన పునాది వేసినందుకు ఎల్.కె. అద్వానీ తరచు నెహ్రూను ప్రశంసించేవారు. 2013లో ఆయన తన బ్లాగులో, ''నెహ్రూ లౌకికవాదం హైందవ పునాదులపై ఆధారపడి ఉంది'' అని విశ్లేషించారు.

అలాగే, తీవ్ర మనో వేదనతో నెహ్రూ అకాల మరణం చెందడానికి కారణం అయిన (1962 చైనా దురాక్రమణ యుద్ధంలో) భారత్ పరాజయం తర్వాత నెహ్రూ ఆర్ఎస్ఎస్, జనసంఘ్‌లను తిరిగి అంచనా వేయడం ప్రారంభించారనేందుకు కొన్ని ఆధారాలు ఉన్నాయి. తన మరణానికి కొద్ది వారాల ముందు జర్నలిస్టుల బృందంతో జరిపిన సంభాషణలో కమ్యూనిస్టు అనుకూల వార్తా పత్రిక అయిన 'ది పేట్రియాట్' ప్రతినిధి జనసంఘ్‌ను 'జాతీయ వ్యతిరేక పార్టీ' అనడంతోనే నెహ్రూ ఆ ప్రతినిధిని వారించారు. ''కాదు, జనసంఘ్ దేశభక్త పార్టీ'' అని బదులిచ్చారు.

దురదృష్టవశాత్తూ నెహ్రూ హిందుత్వాన్ని జనసంఘ్, కాంగ్రెస్ రెండూ మరిచిపోయాయి. బదులుగా అవి తమ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నిరంతరంగా ఆరున్నరొక్క రాగం తీస్తున్నాయి. ఏదేమైనప్పటికీ భారతీయ నాగరికతను యుగయుగాలుగా నిలబెట్టిన ప్రత్యేక లక్షణం 'సమన్వయాన్ని సాధించగల సామర్థ్యం', 'వ్యతిరేకతల్ని పరిష్కరించుకోవడం', 'ఒక కొత్త కలయిక' అని వారు గుర్తుంచుకోవాలి. రెండు ధ్రువాలుగా విడిపోతున్న నేటి ప్రమాదకర కాలానికి... జాతి ప్రయోజనాల కోసం 'సంవాదం' (సంభాషణ) ద్వారా 'సమన్వయం' సాధించిన నెహ్రూ ఆదర్శప్రాయులు.

వ్యాసకర్త మాజీ ప్రధాని వాజ్‌పేయి సహాయకులు
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆటవిక చర్య



ఇద్దరు ఇరానియన్ పురు షులను 'ఖురాన్‌ను, ప్రవక్తను అవమానించడం, మత భ్రష్టత్వం' నేరం మీద ఉరి తీశారు. ఇరాన్ అనేది చమురుతో కూడిన ఐసిస్. అందుకే ఆ ఆటవిక పాలనను పాశ్చాత్య దేశాలు ఇంకా చట్టబద్ధమైనదిగా అంగీకరిస్తున్నాయి. లేదంటే యూసఫ్ మెహ్రదాద్, సద్రోల్లా ఫజేలీ–జారే ఉరితీతను అన్ని ప్రజాస్వామిక దేశాల నాయకులు ఖండించాలి; తమ రాయబారులను వెనక్కి పిలవాలి.

– మాసిహ్ అలీనెజాద్, యాక్టివిస్ట్

అర్థంలేనిది



'ద కేరళ స్టోరీ' సినిమాను పశ్చిమ బెంగాల్ నిషేధిస్తోందని వార్త. ఇది పూర్తిగా మూర్ఖత్వం. నువ్వు ఒక సినిమా నచ్చలేదనొచ్చు, దాన్ని వ్యతిరేకిస్తూ ఇంకోటి తీయొచ్చు, కానీ ఒకసారి సెన్సార్ అయిన సినిమాను నిషేధించడం అనేది అర్థంలేనిది.

– తెహసీన్ పూనావాలా, రాజకీయ విశ్లేషకుడు

కఠిన వాస్తవం



స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాపులు, ఆఖరికి ఎలక్ట్రానిక్ కార్లలో ఉపయోగించే లిథియం బ్యాటరీల్లో కోబాల్ట్ ఉంటుంది. కాంగోలో ఈ కోబాల్ట్ తవ్వకానికి 40,000 పిల్లలను బానిసలుగా ఉపయోగిస్తున్నారు. భయంకరమైన పరిస్థితుల్లో వీళ్లు తమ జీవితాలను పణంగా పెడుతున్నారు. భూవనరులు దోపిడీకి గురవడం మరొకటి.

– జేమ్స్ మెల్‌విల్, కామెంటేటర్

కొద్దిసేపు నడిచినా...



భోంచేసిన తర్వాత కొన్ని నిమిషాలు నడిచినా మీ బ్లడ్ షుగర్ తగ్గుతుంది; టైప్ 2 డయాబెటీస్ వచ్చే ప్రమాదం కూడా తగ్గిపోతుంది. కొన్ని నిమిషాల తక్కువ తీవ్రతతో చేసే నెమ్మదైన నడక కూడా బ్లడ్ షుగర్ స్థాయుల్ని గణనీయంగా తగ్గిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

– వి. మోహన్, డయాబెటిక్ స్పెషలిస్ట్

ఇన్‌బాక్స్

దమ్మున్న సాహస క్రీడ

సాహస క్రీడల రారాజుగా వెలుగొందుతున్న 'వాటర్‌ఫాల్ రాప్లింగ్'పై రోజు రోజుకూ యువతలో మక్కువ పెరుగుతోంది. జలపాతాలపై విన్యాసం చేయడం అంటే ఆషామాషీ కాదు. ప్రపంచ వాటర్ ఫాల్ రాప్లింగ్‌కు బీజం పడింది తెలుగు రాష్ట్రాల్లోనే అంటే ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు. తొలిసారిగా 1994వ సంవత్సరంలో శ్రీశైలం కొండ కోనల్లో వాటర్‌ఫాల్ రాప్లింగ్ ఆవిర్భవించింది. అడ్వెంచర్ క్లబ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏసీఏపీ) వ్యవస్థాపకుడైన ఈ రచయిత తన బృందంతో శ్రీశైలం కొండల్లోని పాలధార, పంచధారకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న 110 అడుగుల జలపాతంపై మొదటగా రాప్లింగ్ చేశాడు.

ఎత్తైన కొండ పైనుండి నిటారుగా వేగంగా కిందకు దిగడాన్ని రాప్లింగ్ అంటారు. అదే ప్రక్రియ జలపాతాలపై చేస్తే వాటర్ ఫాల్ రాప్లింగ్ అంటారు. జలపాతాలన్నీ ర్యాప్లింగ్‌కు అనుకూలం కాదు. జలపాతాల నీటి ప్రవాహ వేగం, ఎత్తు, స్టార్టింగ్, ఎండింగ్ పాయింట్స్; ల్యాండింగ్, సేఫ్టీ... ఇలాంటి అంశాలన్నీ అనుభవజ్ఞులైన శిక్షకులు ముందుగా పరిశీలించి అనుకూలంగా ఉన్నదీ, లేనిదీ పరిశీలించిన తర్వాతే రాప్లింగ్‌కు శ్రీకారం చుడతారు.

ఈ అద్భుత సాహస క్రీడ గురించి 2010 వరకు ఈ రచయిత బృందం పెద్దగా ఆలోచించలేదు. విశాఖ మహానగరం పెందుర్తి ప్రాంతానికి చెందిన ప్రెస్ ఫొటోగ్రాఫర్ ఎస్ఆర్‌సీ మోహనరావుతో కలసి రచయిత బొర్రా గుహలకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న 450 అడుగుల ఎత్తైన కటిక జలపాతాన్ని అత్యంత వ్యయప్రయాసలతో చేరుకున్నారు. దీనిపై రాప్లింగ్ చేయాలంటే సుమారు ఆరు వందల అడుగుల తాళ్లు, ఇతర భద్రతా పరికరాలు అవసరమయ్యాయి. వాటిని సమకూర్చుకుని 2010 అక్టోబర్‌లో ఆరుగురు సభ్యులు గల బృందం కటిక జలపాతం నుంచి రాప్లింగ్ చేసి చరిత్ర సృష్టించింది. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి వాటర్ ఫాల్ రాప్లింగ్‌గా గుర్తింపు పొందింది. 'రికార్డు సెట్టర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్', 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్' కోసం రచయిత బృందం కటిక జలపాతంపైనే మరో మూడు సార్లు వాటర్ ఫాల్ రాప్లింగ్ చేసి అనేక రికార్డులను సృష్టించింది. ఆ తర్వాత ఈ రచయిత మరి కొందరితో కలిసి ప్రపంచ వాటర్ ఫాల్ రాప్లింగ్ ఆర్గనైజింగ్ కమిటి (డబ్ల్యూఆర్‌డబ్ల్యూసీఓసీ)ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఇది కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

– కె. రంగారావు, డబ్ల్యు.ఆర్.డబ్ల్యు.సి.ఒ.సి. వ్యవస్థాపకులు
(మే 11న వరల్డ్ వాటర్‌ఫాల్ రాప్లింగ్ దినోత్సవం)

ఆదర్శ వైద్యుల పరంపరలో...



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''డాక్టర్లుగా వైద్య శిఖామణులైన భారత మహిళా వైద్యులు అనేక మంది వైజ్ఞానిక శాస్త్ర పరిజ్ఞానానికి పటుత్వను, దిటవును అబ్బించడం ద్వారా, ఇంత వరకూ కేవలం మూఢ నమ్మకాల్లో పడి కొట్టుమిట్టాడుతూ ఉన్న స్త్రీలకు బతుకు మీద భరోసా కల్పించడానికి దోహదం చేశారు. అలాంటి వారిలో ప్లేగు వ్యాధి నిర్మూలనకు కృషి చేసిన రుక్మాబాయి, ఇబ్బందులలో ఉన్న గర్భవతులకు సుఖ ప్రసవాన్ని ప్రసాదించిన హైమవతి, ప్రత్యేక క్యాన్సర్ వార్డ్‌ను స్త్రీలకు కేటాయింప చేయడానికి నిరంతర కృషి సల్పి విజయం సాధించిన ముత్తులక్ష్మి చిరస్మరణీయులు. వీరంతా స్త్రీలను పట్టి పీడిస్తున్న అమాయకపు నీడల్ని వెంటాడుతూ విజయం సాధించుతూ వచ్చినవారు. 'కోవిడ్' వ్యాధి మహమ్మారి ప్రపంచాన్ని పీడిస్తున్న సమయంలో అనతి కాలంలోనే వ్యాధి నిరోధక వ్యాక్సిన్ల సృష్టికి కారణమైంది శాస్త్ర విజ్ఞానమే (సైన్స్)నని మరచిపోరాదు. మనం మహిళా వైద్యుల్ని గురించి మాట్లాడు కునేప్పుడు – వైజ్ఞానిక ప్రగతి కోసం, స్వేచ్ఛ కోసం సాగే వైజ్ఞానిక శాస్త్ర మహిళా శిఖామణుల పేర్లను సదా మనం గుర్తుంచుకోవలసిందే.''


– కవితారావు (కె.ఎల్. రావు కుమార్తె), 'లేడీ డాక్టర్స్' రచయిత

''జీవితంలో ప్రతి ఒక్కరు మరొకరి భుజాల మీద సవారీ చేసి బతక్కూడదు, ఎవరికి వారు తన సొంత కాళ్లపైనే ఆధారపడాలి.''

– డాక్టర్ ఆనందీబాయి జోషీ (1865–1887)

ఈ పైన వెల్లడించిన ఉద్దండులు నెలకొల్పిన సంప్రదాయ ఛాయల్లో ఎదిగివచ్చిన సుప్రసిద్ధ భారత వైద్యులలో ఒకరు డాక్టర్ రజనీ కూనమనేని. ఈమె వైద్య వృత్తి నిర్వహణలో ఎంతటి ఘనాపాటో, సామాజికులలో చైతన్య స్ఫూర్తికి దోహదం చేయడంలో కూడా అంతటివారు. పేదసాదల సముద్ధరణ కోసం, న్యాయం వైపు, సమానత్వం స్పృహ వైపు ప్రజలని దృష్టి మరల్చడం కోసం అనేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. 'భారత వైద్య సమితి' జాతీయ కార్యదర్శిగా ఉన్న డాక్టర్ రజని... 2000 నుంచి, సమాజాభ్యున్నతి కోసం జాతీయ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుల్లో ఒకరైన చంద్ర రాజేశ్వర్రావు పేరిట కొండాపూర్‌లో నెలకొల్పిన సుప్రసిద్ధ వృద్ధాశ్రమానికి ప్రధాన వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. జర్మనీ, సోవియెట్ యూనియన్‌లలో ఉన్నత విద్య అభ్యసించి ప్రజా సేవలో అఖండమైన ఖ్యాతి గడించిన డాక్టర్ రజనీకి పలు దక్షిణాది భాషలపైనా పట్టు ఉంది. 1975 దాకా పదేళ్ల పాటు జర్మనీలో వైద్యం నిర్వహించిన రజని... సుప్రసిద్ధ ఏంజెలా డేవిస్, పాల్ రాబ్సన్, దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన విన్నీ మండేలా వంటి వారితో కలిసి బెర్లిన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాలలో పాల్గొన్నారు. క్యూబా సందర్శించి ఫిడెల్ కాస్ట్రోని కలుసుకుని అక్కడి ప్రజారోగ్య పథకాలను గురించి తెలుసుకున్నారు.

రెండో మాట



ప్రసిద్ధ వైద్యురాలు డా॥ రజనీ కూనమనేని

కాగా, 'అందరికీ ఆరోగ్యం అందాలి' అన్న నినాదాన్ని ఏళ్లూపూళ్లూ గడిచిన ఇంత కాలానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పుడు ముందుకు నెడుతోంది. ఈ నినాదం ఆచరణలో క్యూబాలో సోషలిస్టు పాలన కాస్ట్రో నాయకత్వాన ఏర్పడిన నాటి నుంచీ కార్యరూపం దాల్చింది. అంతేకాదు 40 దేశాలకు డాక్టర్లను, వలంటీర్లను పంపి వైద్య సహాయం అందజేస్తోంది క్యూబా. అందుకే డాక్టర్ రజనీ అంటారు: 'అందరికీ ఆరోగ్యం' అన్న నినాదాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ముందుకు తీసుకు వచ్చింది కాని, 1978 లోనే 'ఆల్మా ఆటా' సభ ప్రకటన దీని గురించి నొక్కిచెప్పింది. ఇప్పుడు 30 ఏళ్ల తర్వాత మరలా ఈ నినాదం మన ముందుకు వచ్చింది. 'కరోనా' మహమ్మారి వ్యాప్తివల్ల కల్గిన విషాద ఘడియల్ని ప్రపంచ ప్రజలు అనుభవించిన తరువాతగానీ 'ప్రజలు, ప్రాథమిక ఆరోగ్య జాగ్రత్తలు' అన్న నినాదానికి విలువ రాలేదని డాక్టర్ రజని విమర్శ. ఇప్పుడుగాని 'కుటుంబ వైద్యం, కుటుంబ వైద్యుల' సదుపాయం గురించి పాలకులకు గుర్తు రాలేదని అన్నారు. అయితే ప్రస్తుతం ప్రతీ సామాజిక అంశం ప్రయివేట్ ఆస్తి, ప్రయివేట్ లాభాలు, ప్రయివేట్ ప్రయోజనాలతో ముడిపడి ఉన్నందున... దోపిడీ వ్యవస్థ నుంచి మన సమాజం, పాలనా వ్యవస్థలూ తేరుకోనంత కాలం; నిరంతర దోపిడీకి పాలకులే 'గేట్లు' ఎత్తి వేస్తున్నంత కాలం ప్రయోజనకరమైన ప్రాథమిక వైద్య సదుపాయాలన్నీ ప్రజా బాహుళ్యానికి అందజాలవని డాక్టర్ రజని నిశ్చితాభిప్రాయం!

వైద్య విధానాల నిర్వహణలో డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్‌కు ముందు... నర్సింగ్ వ్యవస్థ బలపడితే తప్ప, కేవల డాక్టర్ల వ్యవస్థ వల్ల సామాజికుల ఆరోగ్య భాగ్యం కుదుటపడబోదని చాటిచెప్పి పటిష్ఠమైన ప్రపంచ నర్సింగ్ వ్యవస్థకు ప్రాణం పోసిన ఫ్లారెన్స్ నైటింగేల్ చిరస్మరణీయురాలైంది. నైటింగేల్ పాఠాన్ని డాక్టర్ రజని వంటబట్టించుకుంది కాబట్టే నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి సదా ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాతిపదిక ఆధారంగానే ఆమె వ్యక్తిగత స్థాయిలోనూ, సీఆర్ ఫౌండేషన్ వైద్యశాఖ నిర్వహణలోనూ అకుంఠితమైన కృషి చేస్తున్నారు. వైద్య వృత్తి ధర్మంలో, ప్రజాసేవలో ఆనందీబాయి జోషీ, రుక్మాబాయ్ రౌత్, కాదంబినీ గంగూలీ, హైమవతీ సేన్, ముత్తులక్ష్మీరెడ్డి, మేరీ పూనెన్ లూకోజ్ వంటి తొలి భారత మహిళా వైద్యులు నెలకొల్పిన అనుపమానమైన సేవల ఒరవడిలోనే డాక్టర్ కూనమనేని రజని... ఆమెకు అంతేవాసిగా, సహజీవిగా అనుక్షణం అండదండగా నిలబడి నిత్య సేవలందించడంలో వెనుదీయని సుబ్బరామన్ సదా ధన్యులు. వేమన్న అననే అన్నాడు గదా: ''భూమిలోన పుణ్య పురుషులు లేకున్న/ జగములేల నిల్చు...''

abkprasad2006@yahoo.co.in

గౌరవనీయులు

ఎవరైతే గౌరవానికి అర్హులో వారిని విధిగా గౌరవించాలి. సమాజంలో ఎవరిని గౌరవించాలంటే, వృద్ధులను గౌరవించాలి. తొంభయి ఏళ్ళు పైబడ్డ వారిని తప్పక గౌరవించాలనీ, ప్రతి ఒక్కరూ వారికి అండగా ఉండాలనీ ప్రాచీన సంస్కృత శ్లోకాలు చెపుతున్నాయి. రథంలో ఎవరైనా వెళుతుంటే పక్కకి తప్పుకొని రథాన్ని వెళ్ళనివ్వాలి. ఇందులో ఉండే రాజులైనా, చక్రవర్తులైనా, నాయకులైనా గౌరవించాలి. సమాజంలో ధనవంతులను గౌరవించాలి. వారు తమ ధనంతో ఇతరులకు సహాయం చేసే అవకాశం కలిగివుంటారు. ప్రజాహిత కార్యక్రమాలను చేసేవారిని గౌరవించాలి. వారి వల్ల ఎందరికో మేలు కలుగుతుంది.

ప్రతివారు తమ బంధువులను గౌరవించాలి. బంధువుల అండదండలు అందరికీ అవసరం. స్త్రీలను తప్పక గౌరవించాలి. స్త్రీలకు గౌరవం ఉన్న చోట దేవతలు కొలువైవుంటారు. జ్ఞానవంతులను, జ్ఞానాన్ని సమాజానికి ఉపయోగించే వారిని గౌరవించాలి. గురువు గారి దగ్గర ఎక్కువ ఏళ్ళు విశేష సేవ చేసి విద్యావంతులైన వారిని గౌరవించాలి. గురు సేవ గొప్ప విషయం. మనం నడిచే దారిలో ఎవరైనా ఎదురు వస్తున్నప్పుడు వారికి దారినివ్వాలి. దారి ఇవ్వటమంటే వారిని గౌరవించటమే! వయోవృద్ధులు, బరువు మోస్తున్నవారు, రోగగ్రస్థులు, చిన్న పిల్లలు, స్త్రీలు, ఇటువంటి వారు దారిలో ఎదురైతే వారికి దారినిచ్చి ముందు వారిని వెళ్ళనివ్వాలి. ఇవి ఆధునిక కాలంలోని యువత వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.చవితి సా.5.32 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మూల రా.7.16 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.43 నుండి 7.14 వరకు, తిరిగి తె.4.19 నుండి 5.48 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.56 వరకు, తిరిగి రా.10.46 నుండి 11.33 వరకు, **అమృతఘడియలు:** ప.1.10 నుండి 2.40 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.17.

అర్జున్ (21) ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. గత కొద్ది రోజులుగా ఇంట్లో ఒంటరిగా ఉండటం తోపాటు తీవ్ర నిరాశ, ఆందోళనకు లోనవుతున్నాడు. ఇంట్లో ఎవరైనా తనతో మాట్లాడితే వారిని విసుక్కోవడం, కసిరికొట్టడం చేస్తున్నాడు. ఎక్కువ సమయం ఏదోక ఓటీటీలో వెబ్ సిరీస్, సినిమాలు చూస్తూ ఉండిపోతున్నాడు. దీంతో అర్జున్‌ను అతడి తండ్రి విజయవాడలోని మానసిక వైద్యుడి వద్దకు తీసుకుని వెళ్లాడు. వైద్యుడు లక్షణాలన్నీ అడిగి తెలుసుకుని రెండు, మూడు సిట్టింగ్‌ల అనంతరం అర్జున్.. 'బింజ్ వాచింగ్ అడిక్షన్'తో బాధపడుతున్నట్టు తెలిపారు.

'చదువుపై దృష్టి సారించలేకపోతున్నాను.. తొందరపాటు ఎక్కువగా ఉంటోంది.. ఒంటరిగా ఉండాలనిపిస్తోంది'.. అంటూ రమ్య అనే ఎంబీబీఎస్ విద్యార్థిని మానసిక వైద్యుడిని సంప్రదించింది. 'నేను అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) సమస్యతో బాధపడుతున్నాను. ఈ సమస్య ఉన్నవారికి ఇచ్చే మిథైల్ఫెనిడేట్ మందును నాకు ఇవ్వండి' అని డాక్టర్‌ను అడిగింది. తన సమస్యతోపాటు ఏ మందు ఇవ్వాలో కూడా చెప్పేస్తుండటంతో సందేహం వచ్చిన మానసిక వైద్యుడు కొంత లోతుగా ఆమెను పరిశీలించారు. ఈ క్రమంలో రమ్య.. ఏడీహెచ్‌డీ కంటెంట్‌తో వచ్చిన ఇంగ్లిష్ సినిమాలు, వెబ్ సిరీస్ ప్రభావంలో పడ్డట్టు వైద్యుడు గుర్తించారు.

ఇలా అర్జున్, రమ్యల తరహాలోనే ప్రస్తుతం కొందరు పిల్లలు, యువత, పెద్దలు.. బింజ్ వాచింగ్‌కు బానిసలై బాధపడుతున్నారు. ప్రస్తుత స్ట్రీమింగ్ యుగం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఒక్క క్లిక్‌తో ఓటీటీ వేదికగా వివిధ భాషా చిత్రాలను, వెబ్ సిరీస్‌లను చూసే అవకాశం ఉంది. దీనికి తోడు చౌకగా అన్‌లిమిటెడ్ డేటా లభిస్తుండటంతో కావాల్సినంత వినోదం లభిస్తోంది. ఈ క్రమంలో అతిగా సినిమాలు, వెబ్‌సిరీస్, షోలు చూసే బింజ్ వాచింగ్ అనేది ప్రస్తుతం సర్వసాధారణమైపోయింది. ఇలా పగలు, రాత్రి తేడా లేకుండా ఓటీటీలకు అతుక్కుపోవడం మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. – సాక్షి, అమరావతి

అలా చూస్తూ.. ఉంటే

అంతే సంగతి!!

గంటల తరబడి ఓటీటీలకే పరిమితమవుతున్న పిల్లలు, పెద్దలు

'బింజ్ వాచింగ్ అడిక్షన్'తో బాధపడుతున్నారంటున్న వైద్యులు



భారతీయులు రోజుకు నాలుగు గంటలకు పైనే బింజ్ వాచింగ్‌కు కేటాయిస్తున్నట్టు జనవరిలో అమెజాన్ ప్రైమ్ ప్రకటించింది. తమ వినియోగదారుల్లో 61 శాతం మంది ఒకే సిట్టింగ్‌లో షో, వెబ్ సిరీస్‌లోని ఆరు ఎపిసోడ్‌లను క్రమం తప్పకుండా చూస్తున్నారని గతేడాది మరో దిగ్గజ ఓటీటీ సంస్థ.. నెట్‌ఫ్లిక్స్ పేర్కొంది. ఇలా ఓటీటీల్లో దేన్నైనా చూడటం ప్రారంభిస్తే ఆపకుండా వరుసగా ఒక సినిమా నుంచి మరో సినిమా, ఒక వెబ్ సిరీస్ నుంచి మరో వెబ్ సిరీస్ చూసేస్తున్నారు. ఇది క్రమంగా అడిక్టివ్ బిహేవియర్ (వ్యసనం)గా మారుతోందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలు యాక్షన్ సీన్‌లు ఎక్కువగా ఉండే కొరియన్ వెబ్ సిరీస్, సినిమాలు చూడటానికి ఇష్టపడుతున్నారు. దీంతో వారు హింస వైపు ప్రేరేపితులయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బింజ్ ఈటింగ్ కూడా..

సాధారణంగా ఏదైనా సినిమా, షో చూసేటప్పుడు చిరుతిళ్లు తినడానికి ఎక్కువ మంది ఇష్టపడతారు. ఈ క్రమంలో బింజ్ వాచింగ్ చేసేవారు బింజ్ ఈటింగ్ (ఎంత తింటున్నారో తెలియకుండా) చేసి ఊబకాయం బారినపడుతున్నారు. ముఖ్యంగా పిల్లలు చిప్స్, లేస్, కుర్ కురే వంటి ప్యాక్డ్ ఫుడ్‌ను ఎక్కువగా తీసుకోవడంతో ఊబకాయంతోపాటు గ్యాస్ట్రిక్ సమస్యలను కూడా ఎదుర్కొంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

బింజ్ వాచింగ్‌తో సమస్యలు..

- ఒంటరిగా ఉండటం పెరుగుతుంది. అతిగా ఓటీటీల్లో వెబ్ సిరీస్‌లు, సినిమాలు చూస్తూ లౌకిక ప్రపంచం నుంచి దూరమవుతారు.. ఇతరులతో సంబంధాలు ఉండవు. ఫలితంగా కుటుంబం, స్నేహితుల నుంచి దూరమయ్యే ప్రమాదం ఉంది.
- వెబ్ సిరీస్‌లు, సినిమాలు చూసే క్రమంలో ఒకేసారి వాటిని పూర్తి చేయాలని అర్ధరాత్రి దాటిపోయినా నిద్రపోవడం లేదు. దీంతో నిద్రలేమి, చిరాకు, విసుగు వంటివి తలెత్తుతున్నాయి.
- మానసిక ఒత్తిడి, నిరాశ, ఆందోళన పెరుగుతున్నాయి. అతిగా స్క్రీన్‌ను చూడటం వల్ల కంటి చూపు సంబంధిత సమస్యలు కూడా వస్తున్నాయి.
- కొందరైతే వెబ్ సిరీసుల్లో లీనమైపోయి అందులో జరిగినట్టు తమ జీవితంలోనూ మార్పులు రావాలని ఊహించుకుంటూ సమస్యల బారినపడుతున్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి..



వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లకు బానిసలయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ వేసవిలో పిల్లల భవిష్యత్‌కు దోహదపడేలా ఏదైన ఒక ఔట్‌డోర్ గేమ్, ఏదైనా భాషలో వారికి శిక్షణ ఇప్పించాలి. ప్రస్తుతం బింజ్ వాచింగ్ సమస్య అన్ని వయసుల వారిలోనూ ఉంటోంది. గతేడాది 20 మంది వరకు ఎంబీబీఎస్ విద్యార్థులు ఈ సమస్యతో బాధపడుతూ మా వద్దకు వచ్చారు. ఏ అలవాటు మితిమీరినా ముప్పు తప్పదు.

– డాక్టర్ ఇండ్ల విశాల్ రెడ్డి, మానసిక వైద్యుడు, విజయవాడ

దివ్యాంగ విద్యార్థులకు సమ్మిళిత విద్య

- సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు
- ప్రత్యేక అవసరాలు గల 564 మంది పిల్లలకు ఉపకరణాలు పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 2025 నాటికి పూర్తిస్థాయిలో సమ్మిళిత విద్యను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో 564 మంది పిల్లలకు వివిధ ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష ద్వారా అలవెన్సులు, ఉపకరణాలు, ఫిజియోథెరపీ తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. వీరి ప్రగతికి స్వచ్ఛంద సంస్థలు కూడా సాయం అందించాలని కోరారు. ప్రత్యేక సర్వే ద్వారా రాష్ట్రంలో 92,326 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించామన్నారు. స్వయంగా చదువుకునే, రాయగల పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా బోధన చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల దృష్టి లోపం ఉన్న ఆరుగురు విద్యార్థినులు డిజిటల్ విధానంలో పది పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించారన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి మరింత ఎక్కువ మందికి శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థుల కోసం రూ.25 లక్షల విలువైన ఉపకరణాలు అందజేసినందుకు స్వర్ణ టోల్ వే ప్లాజా ప్రతినిధులు ఎం.హరిపాండురంగస్వామి, ఎం.జయప్రకాష్, సేఫ్టీ ఆఫీసర్ టి.శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో అధికారులు సీవీ రేణుక, జి.మహేశ్వరరావు, ఎన్కే అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం

- శ్రీవారి పోటు, యాగశాలను ప్రారంభించిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- జమ్మూలోని ఆలయానికి ప్రత్యేక భద్రత కల్పించనున్నట్లు వెల్లడి



కల్యాణోత్సవంలో వైవీ సుబ్బారెడ్డి దంపతులు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణోత్సవం, గరుడ వాహన సేవలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన శ్రీవారి పోటు, యాగశాల, ఆలయ స్టోర్ రూమ్‌లను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల తరహాలోనే ఢిల్లీలోని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. శ్రీవారి పోటు ద్వారా నిత్యం నైవేద్యాలు తయారుచేసి స్వామి వారికి సమర్పించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్‌లో నిర్మించిన శ్రీవారి దేవస్థానానికి ప్రత్యేక భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. అక్కడి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఆలయానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని రాష్ట్ర యంత్రాంగం టీటీడీకి సూచించిందని చెప్పారు. భద్రతకు సంబంధించిన సమీక్షతో పాటు ఆలయ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన కోసం మంగళవారం జమ్మూ వెళ్తున్నట్లు వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు జమ్మూకశ్మీర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. సుమారు 65 ఎకరాల స్థలంలో 2021లో నిర్మాణ పనులు ప్రారంభించి రూ.35 కోట్లతో ఆలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. జూన్ 3 నుంచి 8 వరకు స్వామి వారి ఆలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. జూన్ 8 నుంచి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్‌తో ఎంపీ సత్యవతి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎయిమ్స్, ఢిల్లీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో వైఎస్సార్ సీపీ ఎంపీ బి.వి.సత్యవతి భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా శ్రీనివాస్‌ను కలిసిన ఎంపీ సత్యవతి మంగళగిరి ఎయిమ్స్ విద్యార్థుల గురించి చర్చించారు. మంగళగిరి ఎయిమ్స్ విద్యార్థులకు ఢిల్లీ ఎయిమ్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చే అవకాశాలు పరిశీలించాలని కోరారు. విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ విద్యార్థులకు సహకరించడంపైనా ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్‌తో చర్చించినట్లు ఎంపీ సత్యవతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి డీఈఈ సెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (డీఈఈ సెట్)–2023కు మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని సెట్ కన్వీనర్ చంద్రకామేరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రభుత్వ డైట్‌లు, ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ట్రెయినింగ్ కాలేజీల్లో రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) కోర్సుల్లో అడ్మిషన్లు ఉంటాయని పేర్కొన్నారు. అదే సమయంలో అనుమతుల కోసం కళాశాలలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు https://apdeecet.apcfss.in, https://cse.ap.gov.in వెబ్‌సైట్లను సంప్రదించాలని తెలిపారు.

తెలంగాణ

వందేభారత్ ఢీకొని గేదె మృతి

మిర్యాలగూడ అర్బన్: వందేభారత్ రైలుకు ముప్పు తప్పింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న వందేభారత్ రైలు ఢీకొనడంతో గేదె మృతి చెందింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలో సోమవారం జరిగిన ఈ సంఘటనపై రైల్వే అధికారులు తెలిపిన వివరాలివి. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వందేభారత్ రైలు మిర్యాలగూడ సమీపంలోని టీక్యాతండా వద్దకు చేరుకోగానే పట్టాల పక్కనుంచి వెళ్తున్న గేదెను ఢీకొనడంతో.. అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ రైలును నిలిపి పరిశీలించారు. ఎలాంటి నష్టం కాలేదని గుర్తించిన అనంతరం రైలు కదిలింది. రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ఐ ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ఇలాంటి ప్రమాదాల్లో క్యాప్టర్ గార్డ్ (పట్టాలు తప్పకుండా నియంత్రించేది) విరిగిపోయే ప్రమాదం ఉందని, దాంతో రైలు పట్టాలు తప్పే అవకాశాలు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఉద్యోగులు

- రూ.10 వేలు లంచం కేసులో పట్టుబడ్డ ఏలూరు ఇన్‌చార్జి సబ్–రిజిస్ట్రార్
- రూ.15 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వీఆర్వో..
- అక్రమార్జన కేసులో వైద్య శాఖ జూనియర్ అసిస్టెంట్ ఇళ్లలో సోదాలు

సాక్షి, అమరావతి: లంచం డిమాండ్ చేస్తున్నారంటూ డయల్ 14400 కాల్ సెంటర్‌కు బాధితులు చేసిన ఫిర్యాదులతో ఏసీబీ రంగంలోకి దిగింది. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలోని ఏసీబీ అధికారుల బృందాలు ఈ దాడులు నిర్వహించాయి. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఏలూరు ఇన్‌చార్జి సబ్–రిజిస్ట్రార్ బళ్లారి జోగేశ్వరరావు ప్రైవేట్ అసిస్టెంట్ ఇనెల్లి క్రాంతికుమార్ ద్వారా రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.10 వేల లంచం తీసుకుంటున్న క్రాంతికుమార్‌ను అరెస్ట్ చేశారు. అతడిచ్చిన సమాచారంతో ఇన్‌చార్జి సబ్–రిజిస్ట్రార్ జోగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు.

రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన వీఆర్వో



నాగేశ్వరరావు

పల్నాడు జిల్లా వేల్పూరు గ్రామ పరిధిలోని తన 5.20 సెంట్ల వ్యవసాయ క్షేత్రానికి సంబంధించిన వివరాలను పాస్‌బుక్‌లో ఆన్‌లైన్ ద్వారా క్రమబద్ధీకరణ కోసం వేల్పూరు గ్రామ సచివాలయంలో ఓ రైతు నమోదు చేసుకున్నాడు. ఆ వివరాలను క్రమబద్ధీకరించేందుకు వీఆర్వో కొచ్చెర నాగేశ్వరరావు రూ.20 వేలు డిమాండ్ చేశాడు. మొదటి విడతగా రూ. 5 వేలు తీసుకున్న నాగేశ్వరరావు రెండవ విడత మరో రూ.15 వేలు డిమాండ్ చేయడంతో ఆ రైతు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో రైతు నుంచి రూ.15 వేలు తీసుకుంటుండగా వీఆర్వో నాగేశ్వరరావును అరెస్ట్ చేసి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో..



సత్యనారాయణ

కాకినాడ జీజీహెచ్‌లో వైద్య ఆరోగ్య శాఖ శానిటరీ విభాగం జూనియర్ అసిస్టెంట్ యేంటి సత్యనారాయణ ఆదాయానికి మించిన ఆస్తులు గడించాడు. అతనిపై అందిన సమాచారం మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులకు సోమవారం పలుచోట్ల సోదాలు నిర్వహించారు. అతని ఇల్లు, బంధువుల ఇళ్లపై ఏకకాలంలో ఏసీబీ బృందాలు దాడులు నిర్వహించాయి. ఈ సోదాల్లో అనేక ఆస్తులను గుర్తించారు. కాకినాడ ఇంద్రపాలెంలో మూడు ఎ+2 భవనాలు, ఐదు ఖాళీ స్థలాలు, కాకినాడ, కరప మండలాల్లోని గంగంపాలెం, అరట్లకట్ట గ్రామాల్లో 2.65 ఎకరాల భూమి, సుమారు 392.71 గ్రాముల బంగారు ఆభరణాలు, దాదాపు 860 గ్రాముల వెండి వస్తువులు, యాక్టివా స్కూటర్ గుర్తించారు. మొత్తం సత్యనారాయణతో పాటు అతని సోదరుడు ఇంట్లో ఇప్పటివరకు జరిపిన సోదాల్లో మొత్తం రూ.38,76,048 లక్షలతో పాటు బంగారం, విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు సోదాలను కొనసాగిస్తున్నారు.

విశాఖ టు బంగ్లా బోర్డర్

- 'సే నో డ్రగ్స్' నినాదంతో డిగ్రీ విద్యార్థి సైకిల్ యాత్ర ప్రారంభం
- 25 రోజులు... 1,800 కి.మీ. దూరం సాగనున్న యాత్ర



సాయిసంపత్ సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న డాక్టర్ జి.మధుకుమార్

సీతంపేట(విశాఖ ఉత్తర): డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలోని లంకపల్లి బుల్లయ్య కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న బి.సాయిసంపత్ 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో బంగ్లాదేశ్ సరిహద్దు వరకు సైకిల్ యాత్రను చేపట్టాడు. ఈ మేరకు సైకిల్ యాత్రను సోమవారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 25 రోజులపాటు ప్రముఖ పట్టణాల మీదుగా 1,800 కిలోమీటర్లు సాయిసంపత్ సైకిల్ యాత్ర కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి తెలిపారు. సాయిసంపత్ మాట్లాడుతూ డ్రగ్స్ మత్తులో పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువతకు అవగాహన కల్పించేందుకే తాను సైకిల్ యాత్ర చేపట్టానని చెప్పాడు. శ్రీకాకుళం, భువనేశ్వర్, కోల్‌కతా మీదుగా బంగ్లాదేశ్ సరిహద్దుకు చేరుకుంటానని తెలిపాడు. ఆ తర్వాత అక్కడి నుంచి సిక్కిం మీదుగా భూటాన్ సరిహద్దు వరకు, మళ్లీ సిక్కిం మీదుగా వెనక్కి వచ్చి నేపాల్ బోర్డర్‌కు చేరుకుంటానని వివరించాడు. రోజుకు 80 నుంచి 100 కిలోమీటర్లు ప్రయాణించాలనేది తన లక్ష్యమని, మార్గమధ్యంలో పెట్రోల్ బంకు లేదా పోలీస్ స్టేషన్‌లో విశ్రాంతి తీసుకుంటానని తెలిపాడు.

గతంలోనూ సైకిల్, బైక్ యాత్రలు

గత ఏడాది 'సేవ్ సాయిల్' పేరుతో విశాఖ నుంచి కాశ్మీర్ వరకు, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కన్యాకుమారి నుంచి విశాఖ వరకు బైక్ యాత్ర నిర్వహించానని సాయిసంపత్ చెప్పాడు. మొత్తం 55 రోజుల్లో 11,600 కిలో మీటర్లు బైక్ యాత్ర చేశానని వివరించాడు. అదేవిధంగా 2021లోనూ 'నో ప్లాస్టిక్' నినాదంతో విశాఖ నుంచి కన్యాకుమారి వరకు 23 రోజుల్లో 1,857 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశానని తెలిపారు. గత అనుభవాలతో ప్రస్తుత యాత్రను విజయవంతంగా పూర్తిచేస్తానని ఆయన ధీమా వ్యక్తంచేశాడు. సాయిసంపత్‌ను బుల్లయ్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

తెలంగాణ

శంషాబాద్‌లో రూ.41కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

రిమాండ్‌కు ప్రయాణికురాలు



శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ విమానాశ్రయంలో ఒక ప్రయాణికురాలి నుంచి భారీ మొత్తంలో హెరాయిన్‌ను డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి. మలావి నుంచి బయల్దేరి దోహా మీదుగా ఓ హైదరాబాద్ ప్రయాణికురాలు సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో దిగింది. ముందస్తు సమాచారం అందుకున్న డీఆర్ఐ అధికారులు సదరు ప్రయాణికురాలి సూట్‌కేసును పరిశీలించారు. అందులో గోధుమ రంగులో ఉన్న 5.9 కేజీల పొడిని పరీక్షించి హెరాయిన్‌గా గుర్తించారు. దాని విలువ రూ.41 కోట్లుగా అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు నిందితురాలిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తలసరి ఆదాయంలోను

ఏపీ పరుగులు

- రూ.2,07,771 తలసరి ఆదాయం ఘనవిజయమే
- వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: తలసరి ఆదాయంలోను ఏపీ పరుగులు తీస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (వైఎస్సార్‌సీపీ) నేత వేణుంబాక విజయసాయిరెడ్డి తెలిపారు. దక్షిణాది ఐదు రాష్ట్రాల్లో ఐటీ, ఔషధ పరిశ్రమల కేంద్రం హైదరాబాద్ అంతర్భాగంగా ఉన్న తెలంగాణ రూ.2,65,623 తలసరి ఆదాయంతో అగ్రభాగాన నిలవడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదని పేర్కొన్నారు. కానీ హైదరాబాద్ వంటి పారిశ్రామిక మహానగరం లేకున్నా ఆంధ్రప్రదేశ్ రూ.2,07,771 తలసరి ఆదాయం నమోదు చేసుకోవడం నిజంగా ఘనవిజయమేనని తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం తాడేపల్లిలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర సాంకేతిక, వైద్య విద్యాసంస్థలను ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో చాలా ఆలస్యంగా నెలకొల్పారని తెలిపారు. ప్రైవేటు రంగంలో భారీ పరిశ్రమలు, అత్యధిక జీతాలు చెల్లించే రంగాలు కూడా ఏపీలో ఇంకా చెప్పుకోదగ్గస్థాయికి ఎదగలేదని పేర్కొన్నారు. ఆంధ్ర ప్రాంతం ప్రధానంగా వ్యవసాయాధారిత ప్రాంతమని, రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఇతర టెక్నాలజీ కోర్సులు చదివిన విద్యార్థులు పీజీ చదువుల కోసం అమెరికా, కెనడా, ఐరోపా దేశాలు, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్లి స్థిరపడడం ఎక్కువని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏపీ రూ.2,07,771 తలసరి ఆదాయం సాధించడం నిజంగా ప్రశంసనీయమని తెలిపారు. ఐటీ, ఇతర టెక్నాలజీ రంగాలు, గట్టి పునాదులున్న ఫార్మారంగాల ద్వారా 21వ శతాబ్దపు నగరంగా రూపుదిద్దుకున్న గ్లోబల్ సిటీ హైదరాబాద్ అంతర్భాగం కావడం వల్ల తెలంగాణ దక్షిణాదిన తలసరి ఆదాయంలో అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల కిందట సొంత ప్రయాణం మళ్లీ ప్రారంభించిన ఏపీ తలసరి ఆదాయంలో మంచి ప్రగతి సాధించిందనే చెప్పవచ్చని తెలిపారు. తలసరి ఆదాయంలో జాతీయ సగటు అయిన రూ.1,50,007ను ఈ ఐదు దక్షిణాది రాష్ట్రాలు దాటి అందనంత ముందుకెళ్లడం ఈ ప్రాంతంలోని ఆర్థిక, సామాజిక, మౌలిక సదుపాయాల పునాదులకు అద్దంపడుతోందని పేర్కొన్నారు. ఈ ఐదు రాష్ట్రాల్లో కర్ణాటక, తెలంగాణ మధ్య ఆర్థికాభివృద్ధికి సంబంధించి గట్టిపోటీ ఉందని కూడా ఆర్బీఐ గణాంకాలు సూచిస్తున్నాయని తెలిపారు. మిగిలిన మూడు రాష్ట్రాలు ఈ రెండింటితో పోటీపడుతూ ముందుకు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు. మొత్తంమీద ఆంధ్రప్రదేశ్ సహా ఈ ఐదు దక్షిణాది రాష్ట్రాలు భారత ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజన్లుగా ఉపయోగపడుతున్నాయని ఆయన తెలిపారు.

రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్న బాబు అండ్ కో

- రాష్ట్ర ప్రగతిని చూసి ఓర్వలేకే ఇష్టానుసారం వార్తలు
- సీఎం వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రం పెట్టుబడుల హబ్‌గా మారింది
- రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం తెచ్చిన సీఎం జగన్
- సీఎం జగన్ ఇచ్చిన లక్షలాది ఉద్యోగాలు వారికి కన్పించడం లేదా?
- బాబుకు చేతికర్రలే ఆ రెండు పచ్చ పత్రికలు
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, అమరావతి: అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బ తీసేలా చంద్రబాబు అండ్ కో వ్యవహరిస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని, వస్తున్న పరిశ్రమలను చూసి ఎల్లో మీడియా తట్టుకోలేక పోతోందని, ఇష్టానుసారం వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. మంత్రి సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేపట్టిన తర్వాత రాష్ట్రం పెట్టుబడుల హబ్‌గా మారిందని చెప్పారు. 'ప్రైవేటు రంగంలో ఎంఎస్ఎంఈ సెక్టార్‌లోనే నాలుగేళ్లలో రూ.24 వేల కోట్ల పెట్టుబడులు వస్తే 12.60 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి. భారీ పరిశ్రమల్లో 85 వేల మందికి ఉపాధి లభించింది. దేశంలోని 11 ఇండస్ట్రియల్ కారిడార్లలో మూడు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. రాష్ట్రంలో కొత్తగా 4 పోర్టులు నిర్మిస్తున్నాం. వీటి ద్వారా వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయి. ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, పరిశ్రమల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 22న బందరు పోర్టుకు శంకుస్థాపన జరగబోతోంది. రామాయపట్నం పోర్టు పనులు 40 శాతం పూర్తి చేశాం. ఇక్కడికి డిసెంబర్‌లో మొదటి నౌక తేవాలన్నది సీఎం జగన్ నిర్ణయం. జిందాల్ కంపెనీ కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చురుగ్గా చేస్తోంది' అని మంత్రి వివరించారు. ఇవన్నీ ఎల్లో మీడియాకు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. 'సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం తీసుకొచ్చారు. 2 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు, మరో 3 లక్షలకు పైగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అవకాశాలు ఇచ్చింది సీఎం జగనే. ఇవన్నీ ఎవరికి వచ్చాయి? వేరే దేశంలో ఉన్న వారికి ఇచ్చారా అనేది రామోజీ సమాధానం చెప్పాలి' అని అన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు బాబుకు చేతికర్రలని వ్యాఖ్యానించారు. ఇక్కడే పుట్టి ఈ ప్రాంతంపైనే విషం కక్కుతారా అని మండిపడ్డారు. ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా టీడీపీకి 2019 ఫలితాలే రిపీట్ అవుతాయని, ప్రజలంతా సీఎం జగన్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని స్పష్టంచేశారు.

నాగబాబు మాటలతో ఏకీభవిస్తున్నా

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు విశాఖలో చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నట్లు మంత్రి చెప్పారు. చంద్రబాబు సలహాలు తప్ప ఎవ్వరి సలహాలు పవన్ తీసుకోరని, కాబట్టి ఎవ్వరి సలహాలు, సూచనలు పవన్‌కు అవసరం ఉండవని నాగబాబు చెప్పకనే చెప్పారన్నారు. వారిద్దరూ ఏపీలో ఉండకుండా హైదరాబాద్‌లో ఉంటూ ఎవ్వరు ఎవ్వరింటికి వెళ్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. నాగబాబు చెప్పినంత మాత్రాన జనసేన ఓటింగ్ శాతం అమాంతం పెరిగిపోదన్నారు. 2024 ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీ చేస్తేనే ఓటింగ్ 35 శాతం వచ్చిందా 3 శాతం వచ్చిందా అనేది తెలిసిపోతుందన్నారు.

క్లుప్తంగా

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు దంపతులు మృతి

సుక్మా: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు దంపతులు మృతి చెందారు. ఘటనా స్థలంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. రాజధాని రాయ్‌పూర్‌కు 400 కిలోమీటర్ల దూరంలోని బెజ్జి పోలీసు స్టేషన్ పరిధిలోని దంతేష్‌పురం గ్రామ సమీపంలోని అడవిలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందన్నారు. అడవిలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో గాలింపు చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. ఉదయం 5.30 గంటలకు మావోయిస్టులు తమపై కాల్పులు ప్రారంభించారని, తాము జరిపిన ఎదురు కాల్పుల్లో గొల్లపల్లి లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్(ఎల్‌ఓసీ) కమాండర్ మడకం ఎర్ర, ఆయన భార్య పొడియం భీమే మృతి చెందారని పేర్కొన్నారు. మడ్కం ఎర్రపై రూ.8 లక్షలు, భీమేపై రూ.3 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడించారు.

చైనాలో తొలి 'చాట్‌జీపీటీ' అరెస్టు

బీజింగ్: రైలు ప్రమాదానికి గురైందని, తొమ్మిది మంది చనిపోయారని తప్పుడు వార్తను చాట్‌జీపీటీలో సృష్టించి, ప్రచారంలోకి తీసుకొచ్చిన వ్యక్తిని చైనా పోలీసులు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. చైనాలో చాట్‌జీపీటీ దుర్వినియోగం కారణంగా జరిగిన తొలి అరెస్టు ఇదేనని పోలీసులు చెబుతున్నారు. వాయవ్య గాన్సు ప్రావిన్స్‌లో ఈ సంఘటన జరిగింది. నిందితుడు హాంగ్ అనే మారుపేరుతో చెలామణి అవుతున్నట్లు గుర్తించారు. అతడు సృష్టించిన తప్పుడు వార్త నిజమని భ్రమించి, కొన్ని పత్రికలు ప్రచురించడం గమనార్హం.

రాజస్తాన్‌లో ఇంటిపై కూలిన మిగ్.. ముగ్గురు మహిళలు మృతి

జైపూర్/న్యూఢిల్లీ: భారత వైమానిక దళం(ఐఏఎఫ్)కు చెందిన మిగ్–21 యుద్ధ విమానం ఇంటిపై కూలిన ఘటనలో ముగ్గురు మహిళలు మృతి చెందారు. పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. రాజస్తాన్‌లోని హనుమాన్‌గఢ్ జిల్లాలో సోమవారం ఉదయం 9.45 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. గంగానగర్ జిల్లా సూరత్‌గఢ్ వైమానిక దళ కేంద్రం నుంచి రోజువారీ శిక్షణలో భాగంగా మిగ్–21 విమానం బయలుదేరింది. హనుమాన్‌గఢ్ జిల్లాకు సమీపంలో ఉన్న సమయంలో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. అనుభవజ్ఞుడైన పైలట్ విమానాన్ని అదుపు చేసేందుకు విఫలయత్నం చేశారు. చివరికి పైలట్ ఎజెక్షన్ ద్వారా ప్రమాదం నుంచి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

మైకులు బంద్

కర్ణాటకలో ప్రచారానికి తెర • రేపు పోలింగ్, 13న ఫలితాలు



బెంగళూరు: కర్ణాటకలో మైకులు మూగబోయాయి. నెలకు పైగా జోరుగా కొనసాగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సోమవారంతో తెరపడింది. పార్టీలు, అభ్యర్థులు మంగళవారం కేవలం ఇంటింటి ప్రచారానికే పరిమితం కావాల్సి ఉంటుంది. కాంగ్రెస్ తరఫున రాహుల్, ప్రియాంక, పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తదితరులు నెల రోజులుగా ముమ్మరంగా ప్రచారంలో పాల్గొన్నారు. బసవరాజ్ బొమ్మై సారథ్యంలోని బీజేపీ సర్కారును 40 శాతం కమీషన్ల ప్రభుత్వంగా అభివర్ణిస్తూ అవినీతే ప్రధానాంశంగా ప్రజల్లోకి వెళ్లారు. ఇక బీజేపీ పూర్తిగా ప్రధాని మోదీపైనే ఆశలు పెట్టుకుంది. అమిత్ షా, నడ్డా వంటి అతిరథులు రంగంలోకి దిగినా ప్రధానంగా మోదీయే సుడిగాలి పర్యటనలు, వరుస సభలు, రోడ్‌షోలతో హోరెత్తించారు. ఎన్నికల షెడ్యూలుకు ముందు నుంచే కర్ణాటకలో పదేపదే పర్యటించిన ఆయన, 10 రోజుల్లో ఏకంగా 19 భారీ బహిరంగ సభలు, ఆరు రోడ్‌షోలతో రాష్ట్రమంతటా చుట్టేశారు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే స్థిరత్వం, అభివృద్ధి సాధ్యమంటూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. 40 శాతం కమీషన్ల సర్కారు విమర్శలకు విరుగుడుగా కాంగ్రెస్ 85 శాతం కమిషన్ల పార్టీ అంటూ ప్రతి దాడికి దిగారు.

ఇక ప్రచారం చివరి దశలో బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని బీజేపీ రెండు చేతులా అందిపుచ్చుకుంది. ఆ పార్టీని హిందూ వ్యతిరేకిగా చిత్రించేందుకు శాయశక్తులా ప్రయత్నించింది. బీజేపీ జాతీయ నేతలు మొత్తం 206 సభలు, 90 రోడ్‌షోలు, రాష్ట్ర నేతలు 231 బహిరంగ సభలు, 48 రోడ్ షోలు నిర్వహించారు. ఇక కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నేతలంతా కలిసి 99 బహిరంగ సభలు, 33 రోడ్‌షోలు జరిపారు. విషసర్పం, పనికిమాలిన కుమారుడు, విషకన్య తదితర వ్యక్తిగత విమర్శలు ఈసారి కాంగ్రెస్, బీజేపీ ప్రచారంలో హైలైట్‌గా నిలిచాయి. 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటకలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని కమలనాథులు, ఎలాగైనా గెలిచి విశ్వాసాన్ని ప్రోది చేసుకోవాలని కాంగ్రెస్ పట్టుదలగా ప్రయత్నించాయి. ఈసారి ఎలాగైనా పూర్తి మెజారిటీ సాధనే లక్ష్యంగా రెండు పార్టీలూ పరిశ్రమించాయి. జేడీ(ఎస్) నేతలు కూడా నిప్పులు చెరిగే ఎండల్లో చెమటలు కక్కారు. ఇప్పుడిక బుధవారం జరగబోయే కీలకమైన పోలింగ్ మీదే అందరి దృష్టీ నెలకొంది. అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చే ఫలితాలు 13వ తేదీన వెలువడనున్నాయి.

రూ.375 కోట్లు జప్తు

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో డబ్బు కట్టలు తెంచుకుని పారింది. మార్చి 29 నుంచి ఏకంగా రూ.375.6 కోట్ల మేరకు నగదు తదితరాలను స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ వెల్లడించింది. ఇందులో రూ.147 కోట్లు నగదు, రూ.84 కోట్ల విలువైన మద్యం, రూ.97 కోట్ల విలువైన బంగారం, వెండి, రూ.24 కోట్ల విలువైన కానుకలు, రూ.24 కోట్ల డ్రగ్స్ ఉన్నాయి. వీటికి సంబంధించి ఏకంగా 2,896 ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. మార్చి 29కి ముందు కూడా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలిస్తున్న రూ.58 కోట్ల విలువైన నగదు తదితరాలు దొరికాయి.

భారమంతా మోదీపైనే..



కర్ణాటక శాసనసభ ఎన్నికల సమరాంగణంలో ప్రచార పర్వం ముగిసింది. ఈ నెల 10న పోలింగ్ జరుగుతుంది. 13న ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. పార్టీ తరఫున ప్రచారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పూర్తిగా తన భుజస్కంధాలపై మోశారంటే ఈ ఎన్నికల్లో విజయం బీజేపీకి ఎంత అవసరమో అర్థం చేసుకోవచ్చు. సుదీర్ఘమైన రోడ్డు షోలు, బహిరంగ సభల్లో మోదీ పాల్గొన్నారు. రాష్ట్రమంతటా సుడిగాలి పర్యటనలు చేపట్టారు. బహుశా ఏ రాష్ట్రంలోనూ మోదీ ఈ స్థాయిలో ప్రచారం సాగించి ఉండకపోవచ్చు. పార్టీ అభ్యర్థులను కాదు, మోదీని చూసి బీజేపీకి ఓటు వేయాలన్నట్లుగా పరిస్థితి మారిపోవడం విశేషం. ఆయన ఒక్కరే పూర్తిగా తెరపైన కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

- బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారిన కర్ణాటక
- అంతా తానై వ్యవహరించిన ప్రధాని
- సర్వం ఆయన కనుసన్నల్లోనే..
- బీజేపీ గెలిస్తే మోదీ హవాకు తిరుగులేనట్లే!

1985 నుంచి కర్ణాటకలో అధికార పార్టీ వరుసగా రెండోసారి నెగ్గిన దాఖలాలు లేవు. ఆ ఆనవాయితీని బద్దలు కొట్టాలన్న లక్ష్యంతో నరేంద్ర మోదీ తీవ్రంగా శ్రమించారు. రాష్ట్రంలో బీజేపీకి అంతా తానై వ్యవహరించారు. అభ్యర్థుల ఎంపికను సైతం తన చేతుల్లోకి తీసుకున్నారు. చాలామంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు దిమ్మతిరిగే షాకిచ్చారు. కొందరు సీనియర్లు టికెట్ దక్కక అలకబూని, పార్టీని వీడి వెళ్లిపోయినా లెక్కచేయలేదు. మోదీ లెక్కల్లో వారు ఇమడలేదు మరి. ఢిల్లీలో ఉంటూ చక్రం తిప్పిన ప్రధాని ఏప్రిల్ 29 నుంచి స్వయంగా రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో అడుగుపెట్టి, ప్రచారాన్ని హోరెత్తించారు. దాదాపు రాష్ట్రం మొత్తం చుట్టేశారు. రాజధాని బెంగళూరుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మూడు రోడ్డుషోలలో పాల్గొన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వ ఆవశ్యకతను పదేపదే నొక్కిచెప్పారు. ప్రతిపక్ష కాంగ్రెస్ అనాలోచితంగా అందించిన బజరంగ్ దళ్‌పై నిషేధాస్త్రాన్ని చక్కగా అందిపుచ్చుకున్నారు. చాకచక్యాన్ని ప్రదర్శించారు. ఆ పార్టీని ఇరుకున పెట్టారు. ప్రచార సభల్లో జై బజరంగబలి అంటూ మోదీ చేసిన నినాదంతో జనం గొంతు కలిపారు. తద్వారా ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టేశారు. ఒకరకంగా చెప్పాలంటే కర్ణాటక ఎన్నికల ప్రచారంలో మోదీ ఎక్స్ ఫ్యాక్టర్‌గా మారారు.

క్యాడర్‌లో ఫుల్ జోష్

2018లో జరిగిన ఎన్నికల కంటే ఈసారి మోదీ ప్రచార ఉధృతి బాగా పెరిగింది. అక్కడక్కడ స్థానిక కన్నడ భాషలో మాట్లాడుతూ ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. బీజేపీని పూర్తి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటక దక్షిణాది జిల్లాల్లో హిందీ ప్రభావం తక్కువ. అక్కడ బహిరంగ సభల్లో మోదీ చేసిన హిందీ ప్రసంగాలను బీజేపీ నేతలు కన్నడంలోకి అనువదించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ అవినీతి, 40 శాతం కమిషన్లు, ధరల పెరుగుదల వంటి కీలక అంశాలు మోదీ చాతుర్యంతో పక్కకుపోయాయి. మతం కోణమే ప్రధాన ప్రచారాంశంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. మోదీ ఎదురుదాడి వల్ల కాంగ్రెస్ తన ప్రచార వ్యూహాలను మార్చుకోవాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష కాంగ్రెస్ స్వల్ప మెజార్టీతో గట్టెక్కవచ్చని తొలుత కొన్ని సర్వేల్లో తేలింది. దాంతో కొంత నిరాశలో మునిగిన బీజేపీ శ్రేణుల్లో మోదీ ప్రచారం నైతిక స్థైర్యాన్ని పెంచిందని అంటున్నారు. ప్రధానమంత్రి సభలకు లక్షలాది మంది తరలిరావడం తమలో నూతనోత్సాహాన్ని నింపిందని సాక్షాత్తూ బీజేపీ నాయకులే చెబుతున్నారు.

ప్రముఖులతో వ్యక్తిగత భేటీలు

కర్ణాటక కోస్తా తీరం, మల్నాడ్ ప్రాంతంలో బీజేపీకి గట్టి పట్టుంది. సహజంగానే అక్కడ మోదీ సభలు విజయవంతమయ్యాయి. విపక్ష జేడీ(ఎస్)కు కంచుకోటగా భావించే పాత మైసూర్‌లోనూ పాగా వేయడమే లక్ష్యంగా ఆ ప్రాంతంలో ప్రచారానికి ప్రధానమంత్రి ప్రాధాన్యం ఇచ్చారు. బీజేపీ ప్రభావం నామమాత్రమైన హసన్, రామనగర జిల్లాల్లో ఆయన ర్యాలీలకు జనం భారీగానే తరలివచ్చారు. వారం రోజుల ప్రచారంలో మోదీ దాదాపు 3,000 మందిని వ్యక్తిగతంగా కలిసి ముచ్చటించారు. వీరిలో వివిధ రంగాల నిపుణులు, ప్రముఖులు, పద్మా పురస్కారాల గ్రహీతలు, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు. 18 బహిరంగ సభలు, ర్యాలీల్లో ప్రధాని ప్రసంగించారు. బెంగళూరులో మూడు, మైసూర్, కలబుర్గి, తుమకూరులో ఒక్కొక్కటి చొప్పున రోడ్డు షోలలో పాలు పంచుకున్నారు.

జనాకర్షణ శక్తికి పరీక్ష

లోక్‌సభ, శాసనసభ ఎన్నికల మధ్య కర్ణాటక ఓటర్లు స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపుతున్నట్లు గణాంకాలను బట్టి తేటతెల్లమవుతోంది. 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మొత్తం స్థానాలు గెలుచుకుంది. ఆ మరుసటి ఏడాది 1985లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనతా పార్టీ ఘన విజయం సాధించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలోని 28 స్థానాలకు గాను బీజేపీ ఏకంగా 25 సీట్లు తన ఖాతాలో వేసుకుంది. ఈసారి ప్రధాని మోదీ వ్యక్తిగత జనాకర్షణ శక్తికి ఈ ఎన్నికలు పరీక్ష అనడంలో సందేహం లేదు. ఈ ఎన్నికల్లో బీజేపీ పూర్తి మెజార్టీతో గెలిచి, సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఆయన ప్రతిష్ట అమాంతం పెరిగిపోవడం ఖాయం.

దీక్ష చేస్తున్న రెజ్లర్లకు... రైతుల సంఘీభావం



రెజ్లర్లకు సంఘీభావం తెలిపేందుకు బారికేడ్లు దాటి దూసుకొస్తున్న రైతులు

న్యూఢిల్లీ: భారత రెజ్లర్ల సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చాలా రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న రెజ్లర్లకు రైతులు సోమవారం సంఘీభావం తెలిపారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఏప్రిల్ 23 నుంచి వాళ్లు ఆందోళన చేస్తుండటం తెలిసిందే. సోమవారం ఉదయం బంగ్లా సాహిబ్ గురుద్వారా నుంచి వందలాదిగా రైతులు కాలినడకన జంతర్‌మంతర్‌కు చేరుకున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లపైకి ఎక్కి, వాటిని పక్కకు లాగేసి విరగ్గొట్టారు. వేదిక వద్దకు చేరి రెజ్లర్లకు సంఘీభావం తెలిపారు. 'పోక్సో చట్టం కింద బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు ఆయన్ను ఇప్పటికీ అరెస్ట్ చేయలేదు. బీజేపీ నేతలు బ్రిజ్ భూషణ్‌కు అండగా ఉన్నారు. బాధిత రెజ్లర్ల తరఫున పోరాటం కొనసాగిస్తాం' అని రైతు సంఘం నేత ఒకరు చెప్పారు. ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. రెజ్లర్ల వద్దకు వెళ్లే హడావుడిలో రైతులు బారికేడ్లను ధ్వంసం చేశారన్నారు. ఇది మినహా మరే ఇతర అవాంఛనీయ ఘటనలు జరగలేదన్నారు. పోలీసులు అడ్డుపడ్డారంటూ సోషల్ మీడియాలో వస్తున్నవన్నీ అసత్యాలని తెలిపారు. శివసేన ఎంపీ ప్రియాంకా చతుర్వేది కూడా దీక్షా శిబిరం వద్దకు చేరుకుని మహిళా రెజ్లర్లకు సంఘీభావం తెలిపారు.

కాంగ్రెస్ గుర్తింపు రద్దు చేయాలి

సోనియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి: బీజేపీ

'సార్వభౌమత్వం' వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు

బెంగళూరు/న్యూఢిల్లీ: కర్ణాటక ఎన్నికల ప్రచారం ముగింపు వేళ ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ చేసిన ఏకైక ప్రసంగం వివాదాస్పదంగా మారింది. 'కర్ణాటక సార్వభౌమత్వం' అంటూ సోనియా చేసిన వ్యాఖ్యలపై బీజేపీ సోమవారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు సోనియాపై చర్యలు తీసుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని కోరింది. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ సారథ్యంలోని పార్టీ నేతల బృందం ఢిల్లీలో ఈసీకి ఈ మేరకు వినతిపత్రం సమర్పించింది. ''భారత సమాఖ్యలో కర్ణాటక అంతర్భాగం. అత్యంత ముఖ్యమైన సభ్య రాష్ట్రం. సోనియా వ్యాఖ్యలు అలాంటి రాష్ట్రాన్ని దేశం నుంచి విడదీయాలన్న పిలుపుతో సమానం. ఇది చాలా ప్రమాదకరమైనది. దీని పరిణామాలు దేశానికి చాలా చేటు చేస్తాయి'' అని పేర్కొంది. సోనియా వ్యాఖ్యలను సమర్థిస్తూ 'కర్ణాటక ప్రఖ్యాతికి, సార్వభౌమత్వానికి, సమగ్రతకు ముప్పు తలపెట్టేందుకు కాంగ్రెస్ ఎవరినీ అనుమతించబోదు. ఈ మేరకు ఆరున్నర కోట్ల కన్నడిగులకు సోనియాగాంధీ గట్టి సందేశమిచ్చారు' అంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన ట్వీట్‌ను కూడా జత చేసింది. ''సార్వభౌమ అంటే స్వతంత్ర దేశమని అర్థం. కర్ణాటక భారత్ నుంచి వేరని కాంగ్రెస్ నమ్ముతోంది. సోనియా వ్యాఖ్యలు, అందుకు ఆ పార్టీ సమర్థనే దీనికి నిదర్శనం. ఆమె వ్యాఖ్యలు దేశాన్ని, పౌరులను విభజిస్తాయి. రాష్ట్రాల మధ్య విభజన తెచ్చి సమాజంలో సామరస్యాన్ని దెబ్బ తీస్తాయి'' అని పేర్కొంది. అనంతరం బీజేపీ నేతలు తరుణ్ ఛుగ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనల మేరకు కాంగ్రెస్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బెంగళూరులో కూడా బీజేపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. సార్వభౌమత్వ వ్యాఖ్య చేసినందుకు సోనియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2019–23 మధ్య రాష్ట్రంలో అవినీతి రేట్లు అంటూ బీజేపీ ప్రభుత్వంపై ప్రచారం చేసినందుకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఖర్గేకు, బీజేపీకి ఈసీ నోటీసులు

బీజేపీ ఫిర్యాదుపై ఈసీ స్పందించింది. 'కర్ణాటక సార్వభౌమత్వం'పై కాంగ్రెస్ చేసిన ట్వీట్‌పై పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వివరణ కోరింది. ఆ ట్వీట్ సరిదిద్దుకోవాల్సిందిగా సూచిస్తూ ఆయనకు లేఖ రాసింది. కాంగ్రెస్ ప్రపంచంలోనే అత్యంత అవినీతిమయమైన పార్టీ అంటూ పత్రికల్లో ప్రకటనలిచ్చినందుకు బీజేపీకి కూడా ఈసీ నోటీసులిచ్చింది. మంగళవారం ఆ ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని ఆదేశించింది.

భూమిపుత్రుణ్ని: ఖర్గే

గుజరాతీలు మోదీకిచ్చిన ఫలితాన్ని నాకివ్వండి | **కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ అధ్యక్షుని విజ్ఞప్తి** | **బెదిరింపుల వెనక బీజేపీ పెద్దలున్నారని ఆరోపణ** | **తనను చంపినా తుది దాకా పోరాడతానని వ్యాఖ్యలు**

కలబురిగి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ కర్ణాటక ప్రజలనుద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. సోమవారం కలబురిగిలో బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ''నన్నెవరైనా చంపితే చంపొచ్చు గాక! తుదిశ్వాస దాకా పేదల కోసం, వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం పోరాడుతూనే ఉంటా'' అని స్పష్టం చేశారు. ''నేను కన్నడ భూమిపుత్రుణ్ని. అందుకు ఎంతగానో గర్వపడతా'' అన్నారు. ఖర్గేను, ఆయన భార్యాపిల్లలను చంపేందుకు బీజేపీ అభ్యర్థి మణికంఠ రాథోడ్ కుట్ర పన్నారని కాంగ్రెస్ ఆరోపించడం, అందుకు రుజువుగా ఆడియో రికార్డు విడుదల చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. అది కచ్చితంగా బీజేపీ అగ్ర నేతల మనసు లోంచి పుట్టుకొచ్చిన ఆలోచనే అయ్యుంటుందని ఆరోపించారు. వారి దన్ను లేనిదే ఎవరూ అలాంటి వ్యాఖ్యలు చేయరన్నారు. ''చిన్నతనంలోనే కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకుని ఒంటరిగా మిగిలాను. వాళ్లేమైనా చేసుకోవచ్చు. కానీ ఇలాంటి బెదిరింపులకు భయపడను. నన్ను కాపాడేందుకు అంబేడ్కర్ అందించిన రాజ్యాంగముంది. కర్ణాటక ప్రజలంతా నా వెనక ఉన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టాక దేశ ప్రజలంతా నా వెనకే ఉన్నారు. మన దేశంలో సగటు ఆయు ప్రమాణం 70 ఏళ్లే. నాకు 81 ఏళ్లు. అంటే ఇప్పటికే బోనస్ పీరియడ్‌లో ఉన్నా. మహా అయితే మరో ఎనిమిదేళ్లు బతుకుతానేమో. నన్నూ, నా కుటుంబాన్నీ తుడిచి పెట్టొచ్చు గాక. భయపడేది లేదు. నా స్థానంలో మరొకరు పుట్టుకొస్తారు'' అన్నారు. ''ప్రధాని మోదీ కూడా పదేపదే నా కుమారుని గురించి మాట్లాడుతున్నారు. అతనిది మోదీ స్థాయి కాదు. నా గురించి మాట్లాడితే అర్థం చేసుకోవచ్చు'' అన్నారు. ''తాను భూమిపుత్రున్నని గుజరాత్‌లో మోదీ చెప్పుకుంటారు. తన కోసం బీజేపీని గెలిపించాలని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను కోరారు. అలాగే కర్ణాటక భూమిపుత్రుడినైన నా కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరుతున్నా'' అన్నారు. తాను కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉండగా రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు సహకరించాలని కోరారు.



బెంగళూర్లో రాహుల్ బస్సు ప్రయాణం

బనశంకరి: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన సోమవారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ బెంగళూరులో హల్‌చల్ చేశారు. కన్నింగ్‌హాం రోడ్డులో కాఫీ డేలో కాసేపు గడిపారు. అక్కడ కాఫీ రుచి చూశాక దగ్గర్లోని లోకల్ బస్టాప్‌లో కాలేజీ విద్యార్థులు, వర్కింగ్ విమెన్‌తో మాటలు కలిపారు. స్టూడెంట్లతో సెల్ఫీ దిగారు. తర్వాత లోకల్ బస్సెక్కి ప్రయాణికురాళ్లతో మాట్లాడారు. లింగరాజపురంలో బస్సు దిగి బస్టాప్‌లో మహిళలతో మరోసారి ముచ్చటించారు. 'ధరల పెరుగుదల, ఇంటి పెద్ద అయిన ప్రతి మహిళకూ నెలకు రూ.2,000 ఇస్తామన్న కాంగ్రెస్ హామీ, ఉచిత బస్సు ప్రయాణం తదితరాలపై వారు నాతో లోతుగా చర్చించారు'' అని చెప్పుకొచ్చారు.

మణిపూర్ హింసపై సుప్రీంకోర్టు ఆందోళన

బాధితులకు చేయూతనివ్వాలంటూ ప్రభుత్వాలకు ఆదేశం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జాతుల మధ్య హింసాకాండలో ఆస్తి, ప్రాణనష్టం భారీగా సంభవించడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. హింసాత్మక ఘటనల బాధితులకు భద్రత, సాయం, పునరావాస చర్యలను వేగవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. మణిపూర్‌లోని మైతీ వర్గం వారికి ఎస్టీ హోదాపై దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. 'బాధితుల కోసం ఎన్ని సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు? వాటిల్లో ఎందరున్నారు? ఆహారం, వైద్యం, భద్రత అందించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు? సహాయక శిబిరాల నిర్వాహకులెవరు? నీడ కోల్పోయిన వారెవరు? వారిని తిరిగి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారా?' అంటూ ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న పలు చర్యలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి నివేదించారు. ''బాధితులు తలదాచుకుంటున్న ప్రార్థనాస్థలాలకు రక్షణ కల్పించాలి. సహాయక శిబిరాల్లో ఆహారం, రేషన్, వైద్యం వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి' అని ధర్మాసనం సూచించింది.

హైకోర్టులకు ఆ అధికారం లేదు

రిజర్వేషన్లు కల్పించే అధికారం హైకోర్టులకు లేదని ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. మణిపూర్ హైకోర్టులో మైతీలకు రిజర్వేషన్ల కోసం వాదించానంటూ ఒక లాయర్ ముందుకు రాగా.. రిజర్వేషన్లను సిఫారసు చేసే అధికారం హైకోర్టుకు లేదని తెలిపే రెండు రాజ్యాంగ ధర్మాసన తీర్పులను హైకోర్టుకు చూపించాలని ఆయన్ను కోరింది. రిజర్వేషన్లు కల్పించే అధికారాలు రాష్ట్రపతికే తప్ప హైకోర్టులకు లేవని మీరెన్నడూ హైకోర్టుకు తెలపలేదా అని ప్రశ్నించింది. మరోవైపు మణిపూర్ నుంచి జనం ఎలాగైనా బయటపడాలని తొందరపడుతున్నారు. ఇదే అవకాశంగా ఇండిగో, ఎయిర్‌ఏసియా వంటి సంస్థలు టికెట్ ధరలను పెంచేశాయి.



నారి సారించిన నారి

ఓ చారిటీ ప్రోగ్రాంలో బ్రిటన్ యువరాణి కేట్ విలువిద్యా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుండగా మురిపెంగా చూస్తున్న భర్త యువరాజు విలియం

బెయిల్ ఇప్పించి చంపేశాడు

బరేలీ: ప్రతీకారంతో రగిలే వ్యక్తి ఎంతకైనా తెగిస్తాడంటారు. ఉత్తరప్రదేశ్‌లోని ఖేరి జిల్లా మితౌలీ గ్రామంలో కాశీ కాశ్యప్(50) అనే వ్యక్తి అదే చేశాడు. తన కొడుకును చంపి జైల్లో ఉన్న వ్యక్తిని బెయిల్‌పై బయటకు తీసుకొచ్చి మరీ హత్య చేశాడు. కాశీ దంపతులకు జితేంద్ర(14) అనే కొడుకున్నాడు. 2020లో ఓ హత్య కేసులో కాశీ జైలుకెళ్లాడు. తర్వాత అతని భార్యకు సమీప బంధువైన శత్రుధన్ లాలా (47)తో అక్రమ సంబంధం ఏర్పడింది. వారిద్దరూ తమకు అడ్డుగా ఉన్న జితేంద్రను చంపేశారు. ఈ కేసులో ఇద్దరూ జైలుపాలయ్యారు. గతేడాది కాశీ జైలు నుంచి బయటికొచ్చాడు. కొడుకును పొట్టనపెట్టుకున్న లాలాపై ప్రతీకారంతో రగిలిపోయాడు. సొంత ఖర్చుతో లాయర్‌ను ఏర్పాటు చేసి మరీ లాలాను బెయిల్‌పై బయటకు తీసుకొచ్చాడు. శుక్రవారం రాత్రి అతన్ని తుపాకీతో కాల్చి చంపాడు. పోలీసులు కాశీని అదుపులోకి తీసుకున్నారు.



స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో త్వరలో వేలంవేయనున్న 'ఉషోదయ కెంపు' పొదిగిన ఉంగరం ఇది. మధ్యలో కెంపు, ఇరువైపుల వజ్రం పొదిగిన 25.59 కేరట్ల బరువైన ఈ ఉంగరం వేలంపాటలో రూ.165 కోట్లు పలకొచ్చని క్రిస్టీస్ వేలం సంస్థ అంచనా.

ఆనంద్ మోహన్ ముందస్తు విడుదలపై.. బిహార్, కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో మూడు దశాబ్దాల క్రితం హత్యకు గురైన తెలుగు ఐఏఎస్ అధికారి కృష్ణయ్య హత్య కేసులో బిహార్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో దోషిగా జీవిత ఖైదు అనుభవిస్తున్న మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌ను విడుదల చేయడంపై కృష్ణయ్య భార్య ఉమ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి ధర్మాసనం విచారించింది. ఉమ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ బిహార్ ప్రభుత్వం ప్రిజన్ మాన్యువల్ 2012 చట్టాన్ని సవరించి ఏప్రిల్ 10, 2023న అమలులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ప్రభుత్వ విధానానికి విరుద్ధంగా చేసిన ఈ సవరణ చాలా దురదృష్టకరమని తెలిపారు. చట్ట సవరణ వల్ల కృష్ణయ్య హత్య కేసు నిందితుడు ఆనందమోహన్ విడుదలయ్యారని తెలిపారు. చట్ట సవరణ ద్వారా 14, 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవించిన 27 మంది ఖైదీలను బిహార్ ప్రభుత్వం విడుదల చేసిందని లూత్రా వివరించారు. స్పందించిన ధర్మాసనం బిహార్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఆనంద్‌మోహన్ ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు పేర్కొంది. కేసులో మాజీ ఐఏఎస్ అధికారి కేజే అల్ఫోన్స్ దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను ధర్మాసనం అనుమతించింది.

అమృత్‌సర్‌లో 30 గంటల్లో రెండు పేలుళ్లు

అమృత్‌సర్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రఖ్యాత స్వర్ణదేవాలయం వీధిలో 30 గంటల వ్యవధిలోనే రెండు పేలుళ్లు సంభవించాయి. సోమవారం ఉదయం 6.15 గంటల సమయంలో దుకాణాలు, ఆహార స్టాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్న ప్రాంతంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఘటనలో ఒకరు గాయపడ్డారు. వెంటనే ఫోరెన్సిక్ నిపుణులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. డిటోనేటర్ వంటివేవీ లభ్యంకాలేదని, పేలుడు పదార్థాన్ని ఒక కంటెయినర్‌లో పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఘటన అనంతరం ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. భద్రతా బలగాలు మార్చ్ ఫాస్ట్ చేపట్టాయి. ఈనెల 6వ తేదీన సంభవించిన బాంబు పేలుడుతో ఒకరు గాయపడ్డారు. చుట్టుపక్కల భవనాల అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటనలపై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు.

డ్రోన్ అవార్డుల ప్రదానం

కొరుక్కుపేట: గరుడ ఎరోస్పేస్ ఆధ్వర్యంలో చెన్నై వేదికగా బ్రాండ్ నేషనల్ డ్రోన్ అవార్డ్స్ – 2023 పేరిట 16 కేటగిరీల్లో ప్రత్యేక అవార్డులను సోమవారం ప్రదానం చేశారు. ఇందులో ఐపీఎల్ జట్టు చెన్నై సూపర్ కింగ్స్ క్రికెటర్లు శివందుబే, దీపక్ చాహర్, దేవన్‌కాన్వేకు డ్రోన్ అవార్డులను గరుడ ఎరోస్పేస్ సీఈఓ అగ్నీశ్వర్ జయప్రకాశ్ అందజేశారు. ఇందులో పలు సంస్థల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.


డ్రోన్ అవార్డులతో చెన్నై సూపర్‌కింగ్స్ క్రికెటర్లు

న్యూస్‌రీల్

కావేరి ఆస్పత్రి కొత్త బ్రాంచ్ ప్రారంభం


కోవిలంబాక్కంలో కావేరి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: నగరంలో నాణ్యమైన వైద్యసేవలందిస్తున్న కావేరి ఆసుపత్రుల గ్రూపు నిర్వాహకులు కోవిలంబాక్కంలోని సోమవారం ఉదయం కొత్త హాస్పిటల్‌కు శ్రీకారం చుట్టారు. ఈ ఆసుపత్రిని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. 250 పడకల సదుపాయంతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఈ ఆసుపత్రి మెరుగైన సేవలందిస్తుందని కావేరి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ చంద్రకమార్ తెలిపారు. కేథ్యాబ్, 3–టెస్లా ఎంఆర్ఎస్ఐ, 128 స్లైస్ సీటీ తదితర స్కానింగ్ పరికరాలు కూడా ఈ ఆసుపత్రిలో ఉన్నాయని చెప్పారు. ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవ వేడుకల్లో మంత్రి దామో అనర్బరసన్, కావేరి ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎస్ మణివన్నన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో కొత్తగా మరో 366 టాయిలెట్ల ఏర్పాటు

తిరువొత్తియూరు: చెన్నై కార్పొరేషన్ పరిధిలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రజల సౌకర్యార్థం 954 పబ్లిక్ టాయిలెట్లు ఉన్నాయి. ఈ టాయిలెట్లను ప్రజలు ఎలాంటి రుసుము లేకుండానే ఉపయోగిస్తున్నారు. అలాగే ప్రజలకు ఆరోగ్యకరమైన విధంగా ఏర్పాటు చేయడానికి పబ్లిక్ టాయిలెట్లను మెరుగుపరిచారు. ఈ క్రమంలో చెన్నై కార్పొరేషన్‌లోని 15 మండలాల పరిధిలో కొత్తగా 366 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యింది. అలాగే మరో 100 చోట్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

అన్నానగర్: బైక్‌పై విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మధుకరైలో చోటుచేసుకుంది. వివరాలు.. కృష్ణగిరి జిల్లా అవధానపట్టి శివాజీ నగర్‌కు చెందిన గాంధీ కుమారుడు ఆదిత్య (18), అదే ప్రాంతానికి చెందిన ముఖేశ్వరన్ (19) కోయంబత్తూరు సమీపంలోని ఒత్తక్కాల్ మండపంలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో ఆదిత్య, ముఖేశ్వరన్ ఆదివారం రాత్రి బైక్‌లో బయటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎల్అండ్‌టీ బైపాస్ రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదిత్య, ముఖేశ్వరన్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న మధుకరై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లస్–2లో బాలికల హవా!

ఈ ఏడాది ప్లస్–2 పరీక్షల్లోనూ బాలికలు సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా 94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో విరుదు నగర్ జిల్లా తొలి స్థానాన్ని దక్కించుకుంది. దిండుగల్‌కు చెందిన నందిని అనే విద్యార్థిని 600లకు గాను 600 మార్కులను సాధించి రికార్డు సృష్టించింది. ఇక తమిళం సబ్జెక్టులో ఇద్దరు విద్యార్థినులు వందకు వంద మార్కులు సాధించడం విశేషం.

- రాష్ట్రవ్యాప్తంగా 94 శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణత
- విరుదునగర్‌కు తొలి స్థానం
- 600కు 600 మార్కులతో ఓ విద్యార్థిని రికార్డు
- తమిళంలో ఇద్దరికి వందకు వంద


ప్లస్–2 ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్


విద్యార్థినుల విజయోత్సాహం

సాక్షి, చెన్నై : రాష్ట్రంతో పాటు పుదుచ్చేరిలో ప్లస్–2 పబ్లిక్ పరీక్షలు మార్చి 13 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పరీక్షల ఫలితాలను సోమవారం అన్నా శత జయంతి స్మారక గ్రంథాలయం ఆడిటోరియంలో విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ విడుదల చేశారు. ఇందులో 94.03 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించారు. 8,03,385 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 7,55,451 మంది పాసయ్యారు. ఇందులో 4,21,013 మంది విద్యార్థునులు పరీక్షలు రాయగా 4,05,753 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థినుల్లో 96.38 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే 3,82,379 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 3,49,697 మంది ఉతీర్ణుతులయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 91.45గా ఉంది. మొత్తంగా విద్యార్థుల కంటే, విద్యార్థినుల ఉత్తీర్ణత 4.93 శాతం అధికంగా ఉండడం గమనార్హం.

2,767 పాఠశాలల్లో వంద శాతం..

2,767 పాఠశాలకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 326 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇక పలు సబ్జెక్టుల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా అధికంగానే ఉంది. ఉత్తీర్ణతలో 97.85 శాతంతో విరుదు నగర్ తొలిస్థానంలోనూ, 97.79 శాతంతో తిరుప్పూర్ రెండో స్థానంలోనూ, 97.59 శాతంతో పెరంబలూరు మూడో స్థానంలో నిలిచాయి. ఇక కోయంబత్తూరు కారాగారంలోని ఖైదీలు 12 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

నేటి నుంచి పునఃమూల్యాంకనానికి దరఖాస్తుల స్వీకరణ

ప్లస్–2లో రీటోటలింగ్, రీ వాల్యుయేషన్ తదితర ప్రక్రియలకు విద్యార్థులు మంగళవారం నుంచి ఈనెల 13 తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని మంత్రి అన్బిల్ మహేశ్ తెలిపారు. అలాగే 10,11 తరగతుల ఫలితాలను ఈనెల 19వ తేదీన ఒకే రోజున విడుదల చేయనున్నామని ప్రకటించారు. కాగా పరీక్ష సమయంలో కడలూరుకు చెందిన విద్యార్థిని తండ్రి జ్ఞాన వేల్ మరణించిన విషయం తెలిసిందే. తీవ్ర శోకంతో పరీక్ష రాసిన గిరిజ అనే బాలిక 479 మార్కులు సాధించి ఉత్తీర్ణురాలైంది. దిండుగల్‌కు చెందిన శరవణకుమార్, భాను ప్రియల కుమార్తె నందిని 600లకు 600 మార్కులు సాధించి రికార్డు సృష్టించింది. ఈ బాలికే తొలి స్థానంలో నిలిచింది. ఇక, తమిళ మాధ్యమంలో నందినితో పాటుగా అరక్కోణానికి చెందిన లక్షయ శ్రీ వందకు వంద మార్కులు దక్కించుకుంది. నామక్కల్ పళ్లి పాలయానికి చెందిన హిజ్రా శ్రీయ 337 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది.

విద్యార్థి బలవన్మరణం..

పరీక్షల్లో తప్పిన ఓ విద్యార్థి సోమవారం బలన్మరణానికి పాల్పడ్డాడు. చెన్నై శివారులోని ఆవడి గోవర్ధన గిరికి చెందిన కనకరాజ్ కుమారుడు దేవా(17) పరీక్షస్సో తమిళం, కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. తీవ్ర మనస్తాపానికి లోనైన దేవా ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫెయిల్ అయినందుకు బాధపడొద్దని, మరోసారి పరీక్ష రాయవచ్చని తండ్రి కనకరాజ్ సూచించినా, దేవా ఆత్మహత్యకు పాల్పడడం ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది.

ఫలితాలకు భయపడి..

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా తండ్రాంబట్టు తాలుకా నారాయణకుప్పం గ్రామానికి చెందిన రాజామణి కూలీ కార్మికుడు. కొన్ని నెలల క్రితం ఇతని భార్య మృతి చెందింది. ఇతని కుమారుడు హరి(18)తండ్రాంబట్టు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల ప్లస్–2 పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచి ఉన్నాడు. సోమవారం ఉదయం ఫలితాలు విడుదల అయ్యాయి. అయితే పరీక్షలు సక్రమంగా రాయలేదని మనో వేదనతో ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి ఇంటిలోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి వచ్చిన తండ్రి రాజామణి కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యాడు. విషయం తెలుసుకున్న తండ్రాంబట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లస్–2 ఫలితాల్లో రాణిపేట జిల్లా లాస్ట్

వేలూరు: వేలూరు జిల్లాలో 7,248 మంది బాలురు, 8,098 మంది బాలికలు సహా మొత్తం 15,346 మంది విద్యార్థులు ప్లస్–2 పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో మొత్తం 13,689 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. దీంతో వేలూరు జిల్లాలో 89.2 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వేలూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు మొత్తం ఆరుగురు కూడా ఈ పరీక్షలు రాశారు. వీరిలో ముగ్గురు ఉత్తీర్ణ సాధించారు. అలాగే తిరువణ్ణామలై జిల్లాలో 27,865 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 25,022 మంది ఉత్తీర్ణత సాధించడంతో 89.8 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక రాణిపేట జిల్లాలో మొత్తం 116 పాఠశాలల నుంచి మొత్తం 13,314 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 11,622 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఆ జిల్లాలో 87.3 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే తిరుపత్తూరు జిల్లాలో 91.13 శాతం మంది పాస్ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతాన్ని చూస్తే రాణిపేట జిల్లా ఆఖరి స్థానంలో నిలిచింది. తిరువణ్ణామలై జిల్లా 35వ స్థానంలో నిలవగా తిరుపత్తూరు జిల్లా 29వ స్థానంలో నిలిచింది.


సెల్‌లో ఫలితాలను చూసుకుంటూ..


ఉత్తీర్ణత సాధించిన ఆనందంలో..


విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకురాలు

ఆక్టోపస్ విభాగం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- రూ.57 కోట్ల నిధుల కేటాయింపు
- 383 మంది సిబ్బంది నియామకం



సాక్షి, చెన్నై: రాష్ట్రంలో తీవ్రవాద నిరోధక దళం (ఆక్టోపస్) ఏర్పాటు పనులను అధికారులు వేగవంతం చేశారు. ఇందుకోసం రూ. 57 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ విభాగం కోసం 383 మంది సిబ్బందిని నియమించారు. వివరాలు.. ఇటీవల కాలంలో రాష్ట్రంలో తీవ్రవాదులు, నిషేధిత సంస్థలకు చెందిన మద్దతు దారుల కార్యకలాపాలు చాప కింద నీరులా విస్తృతం అవుతున్న విషయం తెలిసిందే. జాతీయ దర్యాప్తు సంస్థ పసిగట్టే వరకు ఈ సానుభూతి పరులను రాష్ట్ర పోలీసులు గుర్తించ లేని పరిస్థితి. తరచూ రాష్ట్రంలోని పలు నగరాలలో ఎన్ఐఏ(జాతీయ దర్యాప్తు సంస్థ) దాడులు చేయడం, అనుమానితులను పట్టుకెళ్లడం తరచూ జరుగుతోంది. అదే సమయంలో గత ఏడాది కోయంబత్తూరులో కారు పేలుడు ఘటన, మంగళూరులో ఆటోలో ప్రెషర్ కుక్కర్ బాంబు పేలుడు ఘటనల విచారణ మొత్తం తమిళనాడు చుట్టే తిరుగుతోంది. దీంతో రాష్ట్రంలో తీవ్రవాదుల కార్యకాలాలపై నిఘా ఉంచడం, ఎప్పటికప్పుడు పోలీసులను అప్రమత్తం చేయడమే కాదు, సంఘ విద్రోహ శక్తులను అణగ దొక్కే విధంగా ప్రత్యేక విభాగం ఏర్పాటుకు సీఎం స్టాలిన్ నిర్ణయించించారు. గత నెల అసెంబ్లీ వేదికగా ఈ మేరకు ప్రకటన కూడా చేశారు.

ఇతర రాష్ట్రాల తరహాలో..

అనేక రాష్ట్రాల్లో అక్టోపస్, తండర్‌బోల్ట్ తదితర పేర్లతో ఆయా ప్రభుత్వాలు తీవ్ర వాదులపై గురి పెట్టే విధంగా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశాయి. ఇదే తరహాలో తమిళనాడులో తీవ్ర వాద నిరోధక, వ్యతిరేక విభాగం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పనుల కోసం రూ. 57.51 కోట్లను కేటాయించారు. ఇందులో ఇంటెలిజెన్స్ విభాగంతో పాటు పలు కేసుల్లో కీలక పాత్రలు పోషించిన పోలీసు అధికారులు, సిబ్బంది 383 మందిని ఎంపిక చేసి నియమించేందుకు సిద్ధమయ్యారు. ప్రధానంగా చెన్నై, మదురై, కోయంబత్తూరు నగరాలపై తొలుత ప్రత్యేక దృష్టి పెట్టేవిధంగా ఈ విభాగం ఏర్పాటు కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ సరిహద్దు జిల్లాలపై కూడా ఈ విభాగం దృష్టిపెట్టడమే కాకుండా, ఇతర రాష్ట్రాల్లో ఏవిధంగా పనితీరు ఉన్నదో, వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను సమగ్రంగా అధ్యయనం చేసి మరీ రాష్ట్రంలో ఈ విభాగం ఏర్పాటు కాబోతోంది. ఇదిలా ఉండగా.. చెన్నైలో గత కొద్ది రోజులుగా మళ్లీ రౌడీలు రెచ్చి పోతున్న విషయం తెలిసిందే. వీరిని ఉక్కుపాదంతో అణచి వేసే విధంగా పోలీసుల కమిషనర్ శంకర్‌జివ్వాల్ ఆదేశించారు. రౌడీల వేట సోమవారం నుంచి ముమ్మరం కానుందని వెల్లడించారు.

కమలం వైపు చూపు..?

- ఓపీఎస్ కుమారుడు రవీంద్రనాథ్ సరికొత్త వ్యూహం


రవీంద్రనాథ్

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం తనయుడు, ఎంపీ రవీంద్రనాథ్ కొత్తవ్యూహాలకు పదును పెట్టారు. సొంత నియోజకవర్గం నుంచి ఈసారి ఆయన కమలం (తామర) చిహ్నంతో పోటీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. వివరాలు.. అన్నాడీఎంకేను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో పళణి స్వామి పూర్తిగా తన గుప్పెట్లోకి తెచ్చుకున్న విషయం తెలిసిందే. అయితే ఎలాగైనా న్యాయ పోరాటం ద్వారా ఆ పార్టీని తన వశం చేసుకునే వ్యూహాలకు సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం యత్నిస్తున్నారు. అయితే అన్నాడీఎంకే తన గుప్పెట్లోకి చేరేనా అన్న కలవరంలో పన్నీరు సెల్వం ఉన్నట్టు సమాచారం. అదే సమయంలో ఆయన వారసుడు, ఎంపీ పి. రవీంద్రనాథ్ కొత్త వ్యూహాలకు పదును పెట్టారు. అన్నాడీఎంకే నుంచి తనకు అవకాశం దక్కేది అనుమానం కావడంతో ఈసారి కాషాయం కండువాతో కాకుండా, కమలం చిహ్నంతో ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో డీఎంకే కూటమి రాష్ట్రంలో 38 స్థానాలు కైవసం చేసుకోగా, వ్యక్తిగత చరిష్మా, పార్టీ బలంతో అన్నాడీఎంకే తరపున రవీంద్రనాథ్ మాత్రమే పార్లమెంట్ మెట్లు ఎక్కారు. తాజాగా తన కుటుంబ వ్యక్తిగత చరిష్మతో మళ్లీ గెలవవచ్చు అనే ధీమాతో ఆయన ఉన్నా, చిహ్నం ఎక్కడ ఇరకాటంలో పెడుతుందో అనే బెంగ తప్పడం లేదటా...! అందుకే ఈ సారి ఆయన కమలం చిహ్నంతో పోటీ చేసి తేని లోక్‌సభ నియోజకవర్గంలో తమ బలాన్ని చాటే ప్రయత్నంలో ఉన్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. అదే సమయంలో తనకు తామర చిహ్నంలో పోటీ చేసే అవకాశం కల్పించిన పక్షంలో దక్షిణ తమిళనాడులోని తన సామాజిక వర్గం ఓటు బ్యాంక్ బీజేపీ అభ్యర్థులకు అనుకూలంగా మారుస్తామనే విషయాన్ని ఢిల్లీలో తను సన్నిహితంగా ఉన్న కేంద్రం పెద్దల దృష్టికి రవీంద్రనాథ్ తీసుకెళ్లినట్టు సమాచారం. అందుకే ప్రస్తుతం బీజేపీ తన సీట్ల సంఖ్యను 13కు పెంచినట్లు చర్చ జరుగుతోంది. ఇప్పటికే 11 నియోజకవర్గాలపై గురి పెట్టి బీజేపీ విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తాజాగా రవీంద్రనాథ్ కోసం తేని సీటు, పుదయ నిధి కట్చి నేత ఏసీ షణ్ముగం కోసం వేలూరు సీటును ప్రస్తుతం బీజేపీ తెర మీదకు తెచ్చినట్లు సంకేతాలు వెలువడ్డాయి. అన్నాడీఎంకే నుంచి ఈ 13 సీట్లను రాబట్టుకునే వ్యూహాలకు పదును పెట్టే విధంగా బీజేపీ ఢిల్లీ నేతలు ముందుకెళ్తున్నట్లు సమాచారం.

ఓపీఎస్‌తో టీటీవీ భేటీ

- తమిళ రాజకీయాల్లో కొత్త చర్చ


టీటీవీ దినకరన్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పన్నీరు సెల్వం

సాక్షి, చెన్నై: తమిళ రాజకీయాల్లో, అన్నాడీఎంకే కేడర్‌లో సోమవారం రాత్రి కొత్త చర్చ తెరలేచింది. అన్నాడీఎంకేలో ఇదివరకు వేరువేరు శిబిరాలుగా ఉన్న కీలక నేతలిద్దరూ ఏకమయ్యారు. అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్‌తో అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అన్నాడీఎంకేను కైవసం చేసుకునే విషయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళని స్వామిని ఢీకొడుతూ వచ్చిన పన్నీరు సెల్వం కొత్తవ్యూహాలకు పదును పెట్టారు. ఈ మేరకు అన్నాడీఎంకే నుంచి గతంలో చీలి కొత్తగా పుట్టుకొట్టిన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగంతో చేతులు కలపడం తమిళ రాజకీయాల్లోనే ఆసక్తికర పరిణామంగా మారింది. ఓపీఎస్‌తో పాటు ఆ శిబిరం సీనియర్ నేత బన్‌రుట్టి రామచంద్రన్ సోమవారం రాత్రి చెన్నైలోని టీటీవీ దినకరన్ నివాసానికి వెళ్లారు. ఈ ఇద్దరు నేతలు పరస్పరం చేతులు కలిపారు. తమ లక్ష్యం అన్నాడీఎంకేను కైవసం చేసుకోవడమే అని ప్రకటించారు. ఈ ఇద్దరు నేతల కలయికతో ఓపీఎస్ శిబిరంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఇక వీరిద్దరూ చిన్నమ్మ శశికళతో కలిసి పార్టీని కైవసం చేసుకుంటారని, భవిష్యత్‌లో తమకు తిరుగుండదని వారు భావిస్తున్నారు.

ఆధ్యాత్మికతతోనే.. దైవానుగ్రహం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్


బంగారుగుడిలోని యాగ పూజల్లో తెలంగాణ గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్

వేలూరు: భక్తితో ఆరాదిస్తే ప్రతి ఒక్కరూ దైవ సన్నిధికి చేరుకోవచ్చునని తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్ అన్నారు. వేలూరు శ్రీపురంలోని శ్రీ నారాయణి పీఠం బంగారుగుడి 31వ వార్షికోత్సవ కార్యక్రమం పీఠాధిపతి శక్తి అమ్మ అధ్యక్షతన సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా 10,008 మంది మహిళా భక్తులు కళశ నీటిని ఊరేగింపుగా తీసుకొచ్చి నారాయణి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం పీఠంలో ఏర్పాటు చేసిన యాగ పూజల్లో శక్తిఅమ్మ కలుసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ యాగ పూజల్లో తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్ తమిళసై సౌందర్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏటా బంగారుగుడి వార్షికోత్సవంలో శక్తి అమ్మ ఆశీస్సులు అందుకుంటాన్నానని తెలిపారు. భక్తి లేకుంటే జీవితం లేదని భక్తిని, తమిళాన్ని వేరు చేసి చూడలేమన్నారు. ఇటీవల కాలంలో తమిళులకు, భక్తికి సంబంధం లేదంటూ పలువురు ఇష్టారాజ్యంగా వ్యాఖ్యానిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఇంత వరకు తమకు దీపావళి, వినాయక చవితి శుభాకాంక్షలు కూడా తెలియజేయలేదన్నారు. ప్రతిఒక్కరూ కలిసికట్టుగా భక్తి కోసం పాటు పడాలన్నారు. సకాలంలో టీకాలు, దైవ ఆశీస్సులు వల్లే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవిస్తున్నామన్నారు. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో డీఎంకే నాయకులు గవర్నర్‌ను పలుమార్లు కలిసి వినతిపత్రం అందజేశారని, ప్రస్తుతం అధికారంలోకి రాగానే గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వం విషయంలో జోక్యం చేసుకోకూడదని తెలపడం సరికాదన్నారు. కార్యక్రమంలో నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజీ, బంగారు గుడి డైరెక్టర్ సురేష్‌కుమార్, మేనేజర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త జాబితా రెడీ?

- మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కసరత్తు ముమ్మరం
- నలుగురు కొత్త ముఖాలకు చోటు

సాక్షి, చెన్నై: రాష్ట్ర కేబినెట్‌లో మార్పులకు వేళైంది. సీఎం స్టాలిన్ తన మంత్రి వర్గంలో మార్పులకు సంబంధించిన తాజా జాబితాను సిద్ధం చేసినట్లు సచివాలయంలో చర్చ జోరందుకుంది. నలుగురు మంత్రులకు ఉద్వాసన పలికి, వారి స్థానంలో కొత్త ముఖాలకు అవకాశం కల్పించబోతున్నట్లు తెలుస్తోంది. వివరాలు.. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయ్యింది. ఆదివారం మూడో వసంతంలోకి అడుగు పెట్టింది. గత కొంత కాలంగా పలువురు మంత్రుల పనితీరుపై సీఎం స్టాలిన్ అసంతృప్తితో ఉన్నట్లు ఇప్పటికే సంకేతాలు వెలువడ్డాయి. వీరిలో కొందరిక ఉద్వాసన పలకడం, మరికొందరికి శాఖల్లో మార్పులు చేసే విధంగా కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం మార్పుల జాబితా సిద్ధమైనట్లు తెలిసింది. బుధవారం ఈ జాబితా బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ జాబితాలో ఆర్థిక మంత్రి పళణి వేల్ త్యాగరాజన్, అటవీ శాఖ మంత్రి రామచంద్రన్‌తో పాటు మరో ఇద్దరు మంత్రుల పేర్లు గల్లంతయ్యే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది.

రాత్రుల్లోనూ విమాన సేవలు

- ట్రైల్ రన్ సక్సెస్
- జూన్ మొదటి వారం నుంచి అందుబాటులోకి..


చెన్నై ఎయిర్‌పోర్టులోని కొత్త టెర్మినల్

సాక్షి, చెన్నై: కొత్త టెర్మినల్‌లో రాత్రి సమయాల్లోనూ విమాన సేవలకు అధికారులు సిద్ధమయ్యారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు జరిగిన ట్రైల్ రన్ విజయవంతమైంది. వివరాలు.. చెన్నై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్దుతున్న విషయం తెలిసిందే. గత నెల 8వ తేదీన కంబైన్డ్ టెర్మినల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. అదే నెల 25వ తేదీ నుంచి ఈ టెర్మినల్ ద్వారా అంతర్జాతీయ విమాన సేవలకు శ్రీకారం చుట్టారు. తొలి విమానం బంగ్లా దేశ్ నుంచి ఇక్కడకు వచ్చి మళ్లీ తిరుగు ప్రయాణమైంది. ప్రయాణికుల తనిఖీలకు వంద, కస్టమ్స్, ఇమిగ్రేషన్ తదితర తనిఖీల కోసం మరో 108 కౌంటర్లు ఇక్కడ ఏర్పాటు చేశారు. కన్వేయర్ బెల్ట్‌లు, ఎక్సలేటర్లు, వాక్ లేటర్లు తదితర హంగులతో బ్రహ్మాండంగా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. విమానాలు ఆగేందుకు, ప్రయాణికుల టాక్సీ సేవలు అంటూ మరెన్నో ఏర్పాట్లు భారీ స్థాయిలో చేశారు. ఈనెల 3వతేదీ నుంచి ట్రైల్ రన్‌గా సింగపూర్, కువైట్ తదితర దేశాల విమానాలు ఈ టెర్మినల్ దావరా టేకాఫ్, ల్యాండింగ్ చేశాయి. అలాగే చిన్న రకం విమానాలు ఎయిర్ బస్, బోయింగ్ తదితర విమమానాలు టేకాఫ్ తీసుకున్నాయి.

ప్రయోగాత్మకంగా..

ఈ టెర్మినల్ ద్వారా ప్రయోగాత్మకంగా ఉదయం వేళల్లో మాత్రం విమాన సేవలు జరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం రాత్రుల్లో సైతం విమాన సేవలకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువ జాము వరకు ప్రయోగాత్మకంగా ఈ టెర్మినల్ నుంచి విమానాల టేకాఫ్ తీసుకున్నాయి. ఎలంక, కువైట్, ఇథియోపియా దేశాలకు విమానాలు టేకాఫ్ అయ్యాయి. ఈ వారం మొత్తం రాత్రులలో ట్రైల్ రన్ నిర్వహించనున్నారు. అనంతరం జూన్ మొదటివారం నుంచి ఈ కొత్త టెర్మినల్‌ను పూర్తి స్థాయిలో ప్రయాణికుల ఉపయోగంలోకి తీసుకు రానుందని విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.

చెన్నై మంగళవారం, 9, మే, 2023 సాక్షి

క్లుప్తంగా

వాలాజలో బాణసంచా పేలి ఇద్దరికి తీవ్ర గాయాలు



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

వేలూరు: రాణిపేట జిల్లా వాలాజ సమీపంలో కీల్ పుదుపేట గ్రామానికి చెందిన సురేష్ టపాకాయల గోడౌన్ నడుపుతున్నాడు. ఆదివారం సాయంత్రం వాలాజలోని టీచర్స్ కాలనీలోని టపాకాయల గోడౌన్‌ని సురేష్, ఇతని సోదరుడు రాజంద్రన్ శుభ్రం చేస్తున్నారు. ఆ సమయంలో ఉన్న ఫలంగా టపాకాయలు పేలడంతో గోడౌన్ పైకప్పు పూర్తిగా ధ్వంసమై ఇద్దరిపై పడింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి.. తీవ్ర గాయాలైన సురేష్, రాజంద్రన్‌ను వాలాజ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఎడపాడకి వెండివేల్ అందజేత



వెండివేల్‌ను అందజేస్తున్న మాజీ ఎంపీ హరి

తిరుత్తణి: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి హోదాలో తొలిసారిగా తిరుమలకు రోడ్డు మార్గంలో వెళ్లిన ఎడపాడి పళనిస్వామికి తిరుత్తణిలో మాజీ ఎంపీ హరి సోమవారం వెండివేల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి మహిళ మృతి

తిరువొత్తియూరు: చెన్నై ఆవిడి సమీపంలో మిద్దె పైకి వెళ్లి కొబ్బరి మట్టను లాగుతున్న సమయంలో అదుపుతప్పి కింద పడి మహిళ మృతి చెందింది. ఆవిడి కామరాజ నగర్ ముత్తు కుమారన్ వీధికి చెందిన ఆనందన్ భార్య భువనేశ్వరి (35). ఈమె ఇంటికి ఆనుకుని ఓ కొబ్బరి చెట్టు ఉంది. ఆ చెట్టు నుంచి ఓ మట్ట ఎండిపోయిన స్థితిలో వేలాడుతూ ఉండడంతో భువనేశ్వరి మిద్దెపైకి వెళ్లి ఆ మట్టను లాగేందుకు యత్నించింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ ఆమె మిద్దెపై నుంచి కింద పడింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతి

తిరుత్తణి: పట్టణంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతి భూపతి అన్నారు. సోమవారం తిరుత్తణి మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై సభ్యులు చర్చించారు. పట్టణంలో చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తిరుత్తణి అభివృద్ధి అందరి సహకారం అవసరమన్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. కమిషనర్ రాయజయం ఆదాయ ఖర్చులకు సంబంధించిన వివరాలను చదివి వినిపించారు. అనంతరం అభివృద్ధి పనులపై చర్చ జరిగింది. ప్రధానంగా అరక్కోణం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న బస్టాండ్‌కు కలైంజ్ఞర్ పేరు పెట్టాలని డీఎంకే సభ్యులు కోరారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను యూనియన్ స్థాయి నుంచి మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ సామిరాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

4,500 మందికి ఉద్యోగ నియామకాలు



సమావేశంలో పాల్గొన్న విమల్ ఆర్.బాబు

సాక్షి చెన్నై: ప్రతిభను కలిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా విధంగా 4,500 ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్టు నిబావ్ సంస్థ వ్యవస్థాపక సీఈవో విమల్ ఆర్ బాబు తెలిపారు. ఈ మేరకు నగరంలో ఏర్పాటైన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని లిఫ్ట్ తయారీ కార్యకలాపాల విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా నిబావ్ హోమ్ లిఫ్ట్స్ సంస్థ చెన్నైలో నాల్గవ తయారీ సౌకర్యాన్ని ప్రారంభించిందని తెలిపారు. కొత్తగా రెండు కొత్త తరహా నిబావ్ ఎలివేటర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి భారతదేశంతోపాటు విదేశాలలో 4500 మంది కొత్త ఉద్యోగులను నియమిస్తున్నట్లు వెల్లడించారు.

సత్తా చాటిన కేసరి మహోన్నత పాఠశాల



టాపర్‌ను సత్కరిస్తున్న హెచ్ఎం నాగుల గోపాలయ్య

కొరుక్కుపేట: ప్లస్–2 పరీక్షల ఫలితాల్లో చెన్నై టి. నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాల విద్యార్థులు ఈసారి కూడా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా పాఠశాల పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించడం చాలా సంతోషకరమన్నారు. ఈసారి ప్లస్–2లో వివేక్ విశ్వకర్మ – 579 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచినట్లు వివరించారు.

ఊరా ఆంజనేయులకు ఆత్మీయ వీడ్కోలు



ఆంజనేయులు దంపతులను సత్కరిస్తున్న ఎస్‌కేపీడీ పాలకమండలి సభ్యులు

కొరుక్కుపేట: శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) పాలక మండలి సభ్యునిగా పదేళ్ల పదవీకాలం పూర్తయినందున ఊరా ఆంజనేయులకు వీడ్కోలు సమావేశం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు దేసు లక్ష్మీనారాయణ, నాళం శ్రీకాంత్, డాక్టర్ విజయకుమార్, ఊటుకూరు శరత్‌కుమార్, ఎస్ఎల్ సుదర్శనంలతో పాటు మాజీ సభ్యులు పబ్బిశెట్టి శ్రీరాములు, పీఎన్‌పీజే గుప్తా, మన్నారు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఊరా ఆంజనేయులు సేవలను కొనియాడారు. ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఊరా మాట్లాడుతూ.. అందరి ఆదరాభిమానంతో అమ్మవారికి సేవ చేసే భాగ్యం తనకు దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. తనపై ప్రేమాభిమానాలు చూపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎస్‌కేపీడీ కళాశాల ప్రిన్సిపల్ మోహనశ్రీ, బాలుర మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో బంగారం, వెండి నగలు చోరీ

- ఉత్తరాది యువకుడి అరెస్ట్

తిరువొత్తియూరు: తిరుపూర్ జిల్లాలోని ఆలయంలో బంగారం, వెండి నగలను చోరీ చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు..తిరుపూర్ నల్లూరు సెవందమ్మ పాలయంలో శ్రీ మహాకాళి అమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఆదివారం పూజారి రాగా.. తలుపులు తెరిచి ఉన్నాయి. వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. అమ్మవారి విగ్రహానికి అలంకరించిన బంగారు నగలు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తిం నల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించిన పోలీసులు కోల్‌కత్తాకు చెందిన రోణ (20) అనే యువకుడిని అరెస్టు చేశారు. చోరీ చేసిన నగలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్

వేలూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాట్పాడిలోని జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లును అందజేశారు. అలాగే తిరువలం పీహెచ్‌సీ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సంఘం నిర్వాహకుడు జీన్ హెంఢ్రీ డోనాండిన్ జయంతి వేడుకలు, ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ జోన్ చైర్మన్ పుష్పలత వన్నియరాజ, రెడ్‌క్రాస్ సంఘం కార్యదర్శి సేనా జనార్దనన్, ఉపాధ్యక్షులు పారివల్లల్, శ్రీనివాసన్, కోశాధికారి పయణి పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూపాలని వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించడానికి వచ్చిన ఎస్టీలు

తిరువళ్లూరు: తమకు 14 ఏళ్ల క్రితమే ఇంటి పట్టాలను కేటాయించినా.. ఇంత వరకు స్థలాలను సర్వే చేయించలేదని ఎస్టీలకు సోమవారం ఉదయం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతి పత్రం సమర్పించారు. తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలుకా యానంబాక్కం గ్రామంలో సుమారు వంద ఎస్టీ కుటుంబాలు ఉంటున్నాయి. వీరికి ప్రభుత్వం 14 ఏళ్ల క్రితం ఇంటి పట్టాలను కేటాయించింది. అయితే ఇంత వరకు స్థలాలను గుర్తించి అర్హులకు ఇవ్వలేదు. ఇదే విషయంపై పలుమార్లు ఉన్నత అధికారులకు వినతి పత్రం సమర్పించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఎస్టీలు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అలాగే స్వయం ఉపాధి సంఘాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్యను పరిష్కరించడంతో పాటు స్వయం ఉపాధి సంఘాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

డ్రైవర్ల ఆందోళన

తిరువళ్లూరు: న్యాయమైన ఐదు డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆందోళన నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాచలపతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురుగన్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మురుగన్ మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం కేటాయించిన వాహనాల స్థానంలో కొత్త వాహనాలను మంజూరు చేయాలని కోరారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. డ్రైవర్‌లకు విద్యార్హత ఆధారంగా పదోన్నత కల్పించాలని కోరారు. ఈ ఆందోళనలో సంఘం నేతలు పన్నీరుతో పాటు పలువురు పాల్గొన్నారు. తమ డిమాండ్‌లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే 15న కలెక్టర్ కార్యాలయం, 25న రాష్ట్ర సచివాలయం ముట్టడిస్తామన్నారు.



ధర్నా చేస్తున్న డ్రైవర్లు

కోలీవుడ్ టాక్స్



సమంత

అపార్థాలే అంతటికీ కారణం

తమిళ సినిమా: పెళ్లి చేసుకున్న సెలబ్రిటీ జంట విడిపోయారంటే ఆ విషయం అంతటితో ఆగదు. చిలువలు పలువలతో మీడియాలో ప్రచారం జరుగుతూనే ఉంటుంది. అది ఆ జంటను మానసిక క్షోభకు గురిచేస్తూనే ఉంటుంది. నటుడు నాగచైతన్య, సమంతల పరిస్థితి ఇదే. వీరిద్దరికి ఎవరి స్థాయి వారికి ఉంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట కొద్ది కాలానికే మనస్పర్థల కారణంగా విడిపోయిన సంగతి తెలిసిందే. దీంతో వీరిపై రకరకాల ప్రచారం జరిగింది. కొన్ని విధాల ప్రచారం వీరి మనసులను గాయపరిచింది కూడా. అయినప్పటికీ నాగచైతన్య గానీ, సమంత గానీ ఒకరిని ఒకరు తప్పు పట్టుకునేలా మాట్లాడకపోవడం వారి సంస్కారానికి నిదర్శనం అనే చెప్పాలి. తాజాగా నటుడు నాగచైతన్య సమంత విడిపోవడం గురించి ప్రచారం మరోసారి తెరపైకి వచ్చింది. నాగచైతన్య తెలుగు, తమిళ భాషల్లో కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కస్టడీ. కృతిశెట్టి నాయకిగా నటించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 12వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. కాగా ఈ చిత్ర ప్రచారంలో భాగంగా నాగచైతన్య ఇటీవల చెన్నైకి వచ్చారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో సమంత గురించి ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు నాగచైతన్య తాను సమంతతో గడిపిన జీవితాన్ని గౌరవిస్తానన్నారు. సమంత చాలా మంచి యువతీ అని, మంచి మనసు కలిగిన వ్యక్తి అనీ, ఆమె ఎప్పుడూ సంతోషంగా ఉండాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులే తమ మధ్య సమస్యకు ఆరంభమని, ఆ తరువాత అవి కొంచెం కొంచెం పెద్దవై తాము విడిపోయే పరిస్థితి వచ్చిందని చెప్పారు. తాము విడిపోయినా ఒకరిపై ఒకరికి గౌరవం ఉందని నాగచైతన్య అన్నారు. కాగా ఆయన వ్యాఖ్యలపై నటి సమంత స్పందిస్తూ మనమంతా ఒకటేనని, కేవలం అపార్థాలు, అహంకారం, భయం వంటివే మనల్ని దూరం చేస్తాయని తన ట్విట్టర్లో పేర్కొన్నారు. దీంతో అభిమానులు నాగచైతన్య, సమంత మళ్లీ కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.

విజయ్‌ను డైరెక్ట్ చేయనున్న భారతీరాజా

తమిళ సినిమా: వైవిధ్యభరిత కథాచిత్రాలకు చిరునామా దర్శకుడు తంగర్‌బచ్చన్. ఈయన తాజాగా తలకెక్కిస్తున్న చిత్రం కరుమేఘంగళ్ కలైగింద్రన. పావు మీడియా పతాకంపై దురై వీరశక్తి నిర్మిస్తున్న ఈ చిత్రంలో దర్శకుడు భారతిరాజా ప్రధాన పాత్రను పోషించారు. దర్శకుడు గౌతమ్ మీనన్, ఎస్ఏ. చంద్రశేఖర్, ఆర్వీ ఉదయ్ కుమార్, యోగిబాబు, నటి అతిథి బాలన్ తదితరులు మిక్కీ పాత్రలు పోషించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్ర ఆర్య ఆశ్రమం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం చెన్నైలోని కలైవానర్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ సినిమాను ప్రేమిస్తే అది మనల్ని ఏదో విధంగా ప్రేమిస్తూనే ఉంటుందన్నారు. అందుకు ఉదాహరణ తాను మొదట్లో దర్శకుడిగా, ఆ తర్వాత నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా, అదే వరసలో నటుడుగా కొనసాగడమేనన్నారు. తాను దర్శకత్వం వహించడం వల్లే విజయ్ కమర్షియల్ హీరోగా ఎదిగారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పుడు తంగర బచ్చన్ తనను, భారతిరాజాను స్నేహితులుగా ఈ చిత్రంలో నటింపజేయడం గొప్ప విషమని ఎస్సే చంద్రశేఖర్ పేర్కొన్నారు.

కరుమేఘంగళ్ కలైగింద్రన చిత్ర ఆడియో వేడుకలో యూనిట్ సభ్యులు





షారుఖ్ ఖాన్‌తో నయనతార

నయనతార.. ఓ స్వీటీ

తమిళ సినిమా: నయనతార అందమైన నటి. ఈ మాట అన్నది ఎవరో కాదు బాలీవుడ్ బాద్షా షారుక్ ఖాన్. పఠాన్ చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్లను కొల్లగొట్టిన ఈయన తాజాగా జవాన్ చిత్రంతో తెరపైకి రావడానికి ముస్తాబ్ అవుతున్నారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ నిర్మించిన ఈ చిత్రంలో నయనతార నాయికగా నటించగా నటుడు విజయ్ సేతుపతి తదితరులు ముఖ్యపాత్ర పోషించారు. కోలీవుడ్ యువ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా షారుక్ ఖాన్ జవాన్ చిత్ర విడుదల తేదీని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఆయన ఆన్‌లైన్ ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా అభిమానుల ప్రశ్నలకు బదులిస్తూ జవాన్ పక్కా కమర్షియల్ అంచాలతో కూడిన యాక్షన్ కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. నటి నయనతారతో కలిసి ఈ చిత్రంలో నటించడం చాలా సంతోషమని పేర్కొన్నారు. ఆమె చాలా అందగత్తె అనీ, స్వీటీ అని పేర్కొన్నారు. నటుడు విజయశాంతి చాలా ప్రతిభావంతుడని, చాలా ఒదిగి ఉండే నటుడు అనీ, ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను అని అన్నారు. నటుడు అఖిల్ గురించి చెప్పాలంటే ఆయన తనను రెండు విధాలుగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. అట్లీ సంగీత దర్శకుడు కలిసి తనను ఈ చిత్రంలోని పాటల్లో కొన్ని పదాలను పాడించారని చెప్పారు.



ప్రియుడితో నటి ప్రియా భవానీ శంకర్

ప్రియుడితో ఆట పాట

తమిళ సినిమా: బుల్లితెర నుంచి వెండితెరకు పరిచయమైన నటి ప్రియా భవానీ శంకర్. తొలి చిత్రం మేయాదమాన్ విజయం తర్వాత ఈమెకు వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ప్రస్తుతం బిజీ హీరోయిన్లలో ప్రియ భవానీ శంకర్ ఒకరు. ఇటీవల ఈమె జయం రవి సరసన నటించిన అఖిలన్, శింబుతో జతకట్టిన పత్తుతల, లారెన్స్‌తో రొమాన్స్ చేసిన రుద్రన్ చిత్రాలు వరుసగా తెరపైకి రావడం విశేషం. వీటిలో రుద్రన్ చిత్రంలో లారెన్స్‌తో రొమాంటిక్ సన్నివేశాలు అందాలను ఆరబోసిందనే చెప్పాలి. కాగా నిజ జీవితంలోనూ తన ప్రియుడితో అలాంటి రొమాన్స్‌నే చేయడం గమనార్హం. డబ్బు ఎక్కువగా వస్తుందని సినీ రంగ ప్రవేశం చేశానని బహిరంగంగా చెప్పిన నటి ప్రియా భవానీ శంకర్ తాను నటిగా పరిచయం అయ్యి 10 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచే ప్రేమ కలాపాలు నడుపుతోంది. రాజవేల్ అనే వ్యక్తిని ప్రేమిస్తున్న ఈ భామ అతనితో సన్నిహితంగా ఉన్న ఫొటోలను తరచూ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తూ వార్తల్లో ఉంటోంది. అదేవిధంగా తాజాగా తన ప్రియుడు రాజవేల్‌తో సరసాలు సాగిస్తున్న ఒక వీడియోను ప్రియా భవాని శంకర్ సామాజిక మాధ్యమాలకు విడుదల చేసింది. ఆ వీడియోలు ఆమె ప్రియుడితో ముద్దు మురిపాలతో, పాటు ఇతర స్నేహితులతో కలిసి ఆట, పాట, విందు, వినోదం అంటూ ఫుల్ ఎంజాయ్ చేసింది. ఆ వీడియో ఇప్పుడు సామాజి మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. సాధారణంగా టాప్‌లో ఉన్న హీరోయిన్లు తమ ఇమేజ్‌కు భంగం కలుగుతుందనే భయంతో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంచుతుంటారు. అయితే ప్రియ భవానీ శంకర్ మాత్రం ఇమేజ్, భయం జాన్తానై అంటూ ప్రియుడితో సరసాలు ఆడేస్తోంది. ఈమె తక్కువ కాలంలోనే బోలెడంత ఆస్తులను కూడబెట్టిందనే ప్రచారం జరుగుతోంది.

ఏఆర్ రెహమాన్ సంగీతంలో వడివేలు పాట



ఏఆర్ రెహమాన్‌తో వడివేలు, దర్శకుడు మారి సెల్వరాజ్ తదితరులు

తమిళ సినిమా: నటుడు ఉదయనిధి స్టాలిన్, నటి కీర్తి సురేష్ జంటగా నటించిన చిత్రం మామన్నన్. రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి పరియేరుమ్ పెరుమాళ్, కర్ణన్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన మారి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్న ఇందులో నటుడు ఫాహత్ ఫాజిల్, వడివేలు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. చిత్రాన్ని జూన్ నెలలో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కాగా ఇప్పటివరకు హాస్య పాత్రలో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించిన వడివేలు మామన్నన్ చిత్రంలో ఉదయనిధి స్టాలిన్‌కు తండ్రిగా సీరియస్ పాత్రలో నటించడం విశేషం. కాగా ఉదయనిధి స్టాలిన్, వడివేలు కలిసున్న ఫొటోతో కూడిన చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఇటీవల విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చిందని చిత్ర వర్గాలు పేర్కొన్నారు. కాకపోతే ఈ చిత్రం కోసం ఏఆర్ రెహమాన్ బాణీలు కట్టిన ఒక పాటను నటుడు వడివేలుతో పాడించినట్లు సమాచారం. ఈ పాట రికార్డింగ్ సమయంలో వడివేలు, చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ తదితరులు ఏఆర్ రెహమాన్‌తో కూర్చుని ఉన్న ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంది. అదేవిధంగా ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా రాజకీయాల్లో బిజీగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ కథానాయకుడిగా నటించిన చివరి చిత్రం కావడంతో మామన్నన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

క్లుప్తంగా

మత్తు పదార్థాలు విక్రయించిన ఇద్దరి అరెస్టు

• 1.5 కిలోలు స్వాధీనం

తిరువొత్తియూరు: అన్నాసాలైలో ఆదివారం రాత్రి ప్రత్యేక బృందం పోలీసులు గస్తీ చేస్తున్నారు. ఆ సమయంలో మత్తు పౌడర్‌ను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల మత్తు పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. చెన్నై అన్నాసాలైలో ఒక థియేటర్ వద్ద ఆదివారం రాత్రి రాయపురం సహాయ కమిషనర్ లక్ష్మనన్ గస్తీలో ఉన్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని ముఠా మేత్తాబెటమిన్ అనే మత్తు పౌడర్‌ను విక్రయిస్తున్నట్లు ప్రత్యేక బృందం పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో ప్రత్యేక బృందం పోలీసులు తనిఖీ చేపట్టారు. థియేటర్ వద్ద అనుమానాస్పదంగా నిలబడి ఉన్న ఇద్దరిని పోలీసులు విచారణ చేశారు. వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో వారి వద్ద తనిఖీ చేయగా 1.5 కిలోల మత్తు పొడి లభ్యమైంది. స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. రాయపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేశారు. కడలూరు జిల్లా నల్లతూరుకు చెందిన కుమారవేలు (38), శివగంగ జిల్లాకు చెందిన కాసిం (45) అని తెలిసింది. దీనిపై రాయపురం పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

కారు-లారీ ఢీ.. బ్యాంకు మేనేజర్ మృతి

అన్నానగర్: ముందు వెళుతున్న లారీని కారు ఢీకొనడంతో బ్యాంకు మేనేజర్ మృతిచెందాడు. వివరాలు.. చెన్నై కీల్పాక్కానికి చెందిన నీలేష్ బాబు (45) చెన్నై రాయపేటలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య అపూర్వ (33). ఆదివారం ఇద్దరూ కారులో చెన్నై నుంచి తిరుపత్తూరు జిల్లా ఎలగిరామలైకి వెళ్లారు. కారును నీలేష్ బాబు స్నేహితుడు హరీష్ (23) నడుపుతున్నాడు. మధ్యాహ్నం తిరుపత్తూరు జిల్లా అంబూరు సమీపంలోనే ఉన్న మాదనూరు ఫ్లైఓవర్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. నీలేష్‌బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. హరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న నీలేష్ భార్య అపూర్వ స్వల్ప గాయాలతో బయటపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అంబూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన హరీష్‌ను గుడియాతం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,876 మంది స్వామివారిని దర్శించుకోగా.. 30,695 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

10 నుంచి కల్యాణ వెంకన్న వార్షిక వసంతోత్సవాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక వసంతోత్సవాలు 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 11వ తేదీ సాయంత్రం స్వర్ణ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అలాగే స్వామి, అమ్మవార్ల ఉత్సవలకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ, వీధి ఉత్సవం నిర్వహిస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి, శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులను వేంచేపుగా తీసుకొచ్చి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను సమర్పించి స్వామివారి దివ్యానుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్థం అని అర్చకులు తెలిపారు.

స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి సోమవారం రాత్రి స్వర్ణ రథంపై మాడ వీధులలో విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా ఆలయ కల్యాణ వేదికలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని విశేషంగా అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ బంగారు రథంలో కొలువుదీర్చారు. పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం మాడవీధుల్లో కనులపండువగా ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

శాస్త్రోక్తంగా వ్రతం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించారు. పౌర్ణమి తర్వాత నాలుగో రోజున వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులను కల్యాణ వేదికలో కొలువుదీర్చారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ గణపతి వ్రతం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతం ఆచరించారు.

భాషాశాస్త్ర ప్రజ్ఞాశాలి ఆచార్య కృష్ణమూర్తి



అంబ్రూణిని సత్కరిస్తున్న డాక్టర్ విస్తాలి శంకర రావు తదితరులు



పుస్తకావిష్కరణలో తమ్మినేని బాబు తదితరులు

కొరుక్కుపేట: 'సాహిత్యకారుల జీవనచిత్రాలు'లో భాగంగా సోమవారం భాషాశాస్త్ర ప్రజ్ఞాశాలి ఆచార్య జి.వి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ ఆధ్వర్యంలో సాహితీవేత్తల జయంతి ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని ఆశాఖ విభాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హైమావతి మాట్లాడుతూ కృష్ణమూర్తి జీవిత భాగస్వామిగా వారితో గల అనుబంధం మాటల్లో చెప్పలేనని అన్నారు. మొదటి నుంచి ఆయన మనుషులందరినీ ఒకటిగానే చూసేవారని, ఎటువంటి తారతమ్యం ఉండేది కాదని గుర్తు చేసుకున్నారు. రాజధాని కళాశాల, తెలుగుశాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ మామిడి మురళి ఉపన్యాసకులుగా పాల్గొని భాషాశాస్త్రంలో వారి ప్రతిభను తెలియజేశారు. ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఒక వ్యక్తి తన ఉద్యోగ బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వహించి పదవీవిరమణ పొందడం ఎంతో గొప్ప విషయమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భారతి మహిళా కళాశాల, తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు, డాక్టర్ నిర్మలా పళనివేలు మాట్లాడుతూ అంబ్రూణి ఎంతో సహృదయత కలిగిన వ్యక్తి అని వ్యాఖ్యానించారు. అనంతరం ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన సాహితీ విన్యాసాలు పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా రచయితలు డా. ఎల్.బి. శంకరరావు, డా. అత్తోట అంబ్రూణిలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబు పుస్తకాన్ని ఆవిష్కరించి తెలుగుశాఖ నిర్వాహకులను అభినందించారు. తొలి ప్రతిని డా. కాసల నాగభూషణం అందుకున్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

అన్నానగర్: ఆవడిలో విద్యుత్ షాక్‌తో పదో తరగతి విద్యార్థి మృతిచెందాడు. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. చెన్నై ఆవడి పాలవేడు ఆంజనేయర్ కోవిల్ వీధికి చెందిన గుణశేఖరన్, లక్ష్మి దంపతులకు కుమార్తె అభినయ (15), కుమారుడు గోపి (17) ఉన్నారు. పాలవేడు ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాడు. ఆదివారం గుణశేఖరన్ తన భార్య, కుమార్తెతో కలిసి మాధవరంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో గోపి, అతని అమ్మమ్మ మురుగమ్మ మాత్రమే ఉన్నారు. గోపి ఇంటి బయట ఉన్న బాత్‌రూమ్‌కి రాత్రి వెళ్లినప్పుడు గోడపై ఉన్న విద్యుత్ వైరుపై చేయి వేయడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కిందపడడంతో తల వెనుక భాగంలో బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం అయ్యింది. మనవడు బాత్రూమ్ నుంచి రాకపోవడంతో మురుగమ్మ అక్కడికి వెళ్లి చూసింది. రక్తపు మడుగులో పడి ఉన్న గోపిని ఇరుగుపొరుగు వారి సహాయంతో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై ముత్తాపుదుప్పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోచంపల్లెలో విషాదం

• బావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

అన్నానగర్: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఈ విషాదకర ఘటన కృష్ణగిరి జిల్లా బోచంపల్లెలో సోమవారం జరిగింది. మహదేవ కొల్లల్లి పూలంకుట్టై గ్రామానికి చెందిన మాదప్పన్ చెన్నైలోని ఓ బేకరీలో మాస్టర్ గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య చంద్రిక. వీరికి కూతురు శ్రీనిక (5), కుమారుడు అనిరుధ్ (3) ఉన్నారు. ఇదిలా ఉండగా చంద్రిక తన కూతురు, కుమారుడితో కలిసి పూలంగుట్టై, కోలాళ్లలో నివసిస్తోంది. ఆదివారం సాయంత్రం శ్రీనిక, అనిరుధ్ తమ ఇంటి సమీపంలోని వ్యవసాయ భూమిలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో అనూహ్యంగా అక్కడున్న బావిలో పడిపోయారు. చాలా సమయం వరకు ఎవరూ ఆ దారిలో వెళ్లకపోవడంతో బావిలో మునిగి చనిపోయిన విషయం ఎవరికీ తెలియలేదు. ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారులు ఇంటికి రాకపోవడంతో చంద్రిక ఆందోళనకు గురై చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించింది. బావిలో ఇద్దరి మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరైంది. సమాచారం అందుకున్న పోచంపల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని శ్రీనిక, అనిరుధ్ మృతదేహాలను వెలికి తీశారు. బోచంపల్లి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రారంభం

ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన డెస్కెథ్లోను చెన్నైలోని టి.నగర్‌లో ఏర్పాటు చేశారు. దీనిని ప్రముఖులు డాక్టర్ శ్యామ్‌పాల్, యాదార్థ జ్యోతిధర్, కెదామోథర్ తదతరులు పాల్గొని రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు.
– సాక్షి చెన్నై

ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరికి కత్తిపోట్లు

• ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
• నెడువరంబాక్కం గ్రామంలో ఉద్రిక్తత



మృతుడు లక్ష్మణన్

తిరువళ్లూరు: గ్రామంలోని యువకులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు దిగడం.. ఒక వర్గానికి మద్దతుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన పంచాయతీ ఉపాధ్యక్షుడు, అతడి సోదరుడు కత్తిపోటుకు గురయ్యారు. వీరిలో పంచాయతీ ఉపాధ్యక్షుడు సోదరుడు లక్ష్మణన్ మృతి చెందగా, ఉపాధ్యక్షుడు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా చోళవరం సమీపంలోని నెడువరంబాక్కం గ్రామానికి చెందిన లక్ష్మణన్(30) ఓ ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్నాడు. ఇతని సోదరుడు ఇళంగోవన్ పంచాయతీ ఉపాధ్యాక్షుడిగా ఉన్నారు. ఇద్దరికి వివాహమై వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో నెడువరంబాక్కం గ్రామంలోని యువకులు రెండు గ్రూపులుగా విడిపోయి ఆదివారం ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో కొందరు యువకులు గాయపడ్డారు. దీంతో గాయపడిన యువకులకు మద్దతుగా పంచాయతీ ఉపాధ్యక్షుడు ఇళంగోవన్, అతడి సోదరుడు లక్ష్మణన్ చోళవరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి ఒకే వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. గ్రామానికి సమీపంలో వస్తుండగా వీరిని అడ్డగించిన గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా కత్తులతో దాడి చేసి పరారయ్యారు. దాడిలో లక్ష్మణన్ అక్కడికక్కడే మృతి చెందగా.. ఉపాధ్యక్షుడు ఇళంగోవన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. విషయం తెలుసుకున్న చోళవరం పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మణన్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇళంగోవన్‌ను చికిత్స నిమిత్తం చెన్నై వైద్యశాలకు తరలించారు. కాగా యువకుడి హత్యతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు –ఇద్దరి మృతి

అన్నానగర్: నాగర్ కోయిల్‌లో సోమవారం బైక్‌ను బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్‌లోని వడసెరి కృష్ణం కోవిల్ పోలీస్‌స్టేషన్ రోడ్డుకు చెందిన ముత్తయ్య కుమారుడు మురుగన్ (47) పెయింటర్. ఇతని స్నేహితుడు విఘ్నేష్ (31) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ నాగర్‌కోయిల్‌లోని కృష్ణం కోవిల్‌లోని వినగర్ స్ట్రీట్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం వేటూర్నిమడంలోని బంధువు వద్దకు వెళ్లేందుకు మురుగన్ బైకుపై బయలుదేరాడు. అతనితో పాటు విఘ్నేష్ కూడా వెళ్లాడు. వెట్టుర్నిమడం ప్రాంతానికి రాగానే ఎదురుగా తిరువనంతపురం వైపు వస్తున్న ప్రభుత్వ బస్సు ఢీకొంది. మురుగన్, విఘ్నేష్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న నాగర్‌కోయిల్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆచారిపాళ్యం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధిపత్య పోరు.. క్రికెట్ బ్యాట్‌తో దాడి

అన్నానగర్: రౌడీ వర్గాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఆధిపత్య పోరులో ఒకరు హత్యకు గురయ్యారు. అతని స్నేహితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురి కోసం గాలిస్తున్నారు. చెన్నై తురైపాక్కం కన్నగి నగర్ ప్రాంతానికి చెందిన నిత్య (34)పై పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసులు ఉన్నాయి. అదే ప్రాంతానికి చెందిన వీరమరుదు (34)పై కూడా సెమ్మంజేరి పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. ఇరువర్గాల మధ్య కొంత కాలంగా ఆధిపత్య పోరు జరుగుతోంది. ఈ క్రమంలో వీరమరుదు, అతని స్నేహితులు వసంత్, దినేష్, అభి, మట్టుమణి, గుణ పాత కక్షలతో నిత్యని చంపాలని ప్లాన్ చేశారు. ఆదివారం రాత్రి వీరమరుదు నిత్యను మద్యం తాగమని ఆహ్వానించాడు. ఆ తర్వాత ఇందిరాగాంధీ నుంచి కారపాక్కం వెళ్లే క్రాస్ స్ట్రీట్‌లో ఉన్న గల్లీ మైదానంలో ఆదివారం రాత్రి నిత్య, వీరమరుదు, ఇతని స్నేహితులు తాగిన మత్తులో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆవేశానికి లోనైన వీరమరుదు, అతని స్నేహితులు నిత్య క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసి కొడవలితో నరికి చంపారు. సమాచారం అందుకున్న కణ్ణగి నగర్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి వీరమరుదును అరెస్టు చేశారు. ఐదుగురు కోసం గాలిస్తున్నారు.

అమ్మవారి సేవలో సినీనటి గౌతమి



అమ్మవారిని దర్శించుకున్న సినీ నటి గౌతమి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సినీ నటి గౌతమి సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కోయంబేడు మార్కెట్లో పార్కు ఏర్పాటుకు చర్యలు

తిరువొత్తియూరు: చెన్నై కోయంబేడు మార్కెట్లో 7 ఎకరాల విస్తీర్ణంలో విశాలవంతమైన పార్కును ఏర్పాటు చేసేందుకు చెన్నై కార్పొరేషన్ కమిటీ నిర్ణయించింది. కోయంబేడు మార్కెట్ 21 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ సుమారు 4 వేల దుకాణాలు, కూరగాయలు, పండ్లు, పూల మార్కెట్లు ఉన్నాయి. ఈ మార్కెట్‌ను ఆధునికీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ నెలలో రూ. 20 కోట్లు కేటాయించింది. దీంతో దీనిపై ఒక సలహా కమిటీని ఏర్పాటు చేసి.. వారు ఇచ్చే సూచనల మేరకు కోయంబేడు మార్కెట్ ప్రాంగణంలో సౌకర్యాలు కల్పించేందుకు నిర్ణయించింది. డ్రైనేజీ కాలువలు, విద్యుత్ దీపాలు ఇలా పనులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో కోయంబేడు పూల మార్కెట్ ప్రాంగణంలో 7 ఎకరాల విస్తీర్ణంలో బ్రహ్మాండమైన పార్కు నిర్మించేందుకు అభివృద్ధి కమిటీ నిర్ణయించింది. ఫుట్‌పాత్, వాకింగ్ పాత్, జాగింగ్, చిన్నారులు ఆడుకోవడానికి స్థలం, దివ్యాంగులకు సౌకర్యంగా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. అలాగే కోయంబేడు మార్కెట్ ప్రాంగణంలో కార్మికుల సౌకర్యం కోసం ఆస్పత్రి నిర్మించేందుకు సీఎండీఏ అధికారులు నిర్ణయించారు.

హత్య కేసులో భర్త, అత్తమామ అరెస్టు

అన్నానగర్: గర్భిణిని హత్య చేసిన కేసులో ఆమె భర్త, అత్తమామలను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాలు.. మదురై జిల్లా తిరుమంగళానికి చెందిన సతీష్ కుమార్ (31) డ్రైవర్. తేని జిల్లా కడమల కుండూకు చెందిన నర్సు రమ్య(25)ను ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అనంతరం వేళాచ్చేరి మునియంతిపురంలోని కురింజినగర్‌లో కాపురం పెట్టారు. ఈ క్రమంలో రమ్య గర్భం దాల్చింది. అయితే సతీష్‌కుమార్, రమ్య మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. రమ్య ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంతో బంధువులు ఆమెకు నచ్చజెప్పి తిరిగి ఇంటికి పంపించారు. శనివారం సతీష్ కుమార్ మరోసారి రమ్యతో గొడవపడ్డాడు. ఆగ్రహంతో నిర్మాణ పనులకు ఉపయోగించే దుంగతో కొట్టాడు. రమ్య తీవ్ర రక్తస్రావంతో మృతిచెందింది. తిరుపరంగున్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సతీష్‌కుమార్ తల్లిదండ్రులు రమ్యతో బంధాన్ని తెంచుకోవాలని ఒత్తిడి చేశారని.. ఈ క్రమంలోనే ఆమెపై దాడి జరిగిందని తెలిసింది. ఆదివారం రాత్రి రమ్య మృతదేహాన్ని మదురై ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లేందుకు ఆమె తల్లిదండ్రులు నిరాకరించారు. సతీష్‌కుమార్ (31), అతని తండ్రి సెల్వం (55), తల్లి పంచవర్ణంను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు.

గరుడ సేవకు గొడుగుల సమర్పణ



గరుడ సేవకు గొడుగులను స్వీకరిస్తున్న డిప్యూటీ ఈఓ నాగరత్నం

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి గరుడ సేవకు చెన్నైలోని తిరునింద్రయూర్‌కు చెందిన శ్రీమద్ రామానుజం కైంకర్య ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం 2 గొడుగులు సమర్పించారు. ఈ గొడుగులను టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్నం స్వీకరించి గరుడ సేవకు వినియోగించారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లోనూ గరుడ సేవకు ఈ ట్రస్ట్ ఏటా గొడుగులు సమర్పించడం ఆనవాయితీ. కార్యక్రమంలో టీటీడీ ఏఈఓ మోహన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

భర్తపై కోపంతో రెండో భార్య ఆత్మహత్య

అన్నానగర్: తన భర్త మొదటి భార్యతో కలిసి వేరే రాష్ట్రానికి వెళ్లడంతో రెండున్నర ఏళ్ల బిడ్డను విడిచి పెట్టి మహిళ ఆత్మహత్య చేసుకుంది. కోయంబత్తూరు సమీపంలోని గణపతి వీధికి చెందిన రఘుపతి (38) వ్యాపారి. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోయంబత్తూరుకు చెందిన దివ్యభారతి(31)ని రఘుపతి 2వ వివాహం చేసుకున్నాడు. వీరికి రెండున్నర ఏళ్ల కుమార్తె ఉంది. ఆ ప్రాంతంలోని లక్ష్మీపురంలో దివ్యభారతి తన బిడ్డతో కలిసి నివసిస్తోంది. రఘుపతి కొద్ది రోజులు భార్య ఇంట్లోనూ, కొన్ని రోజులు దివ్యభారతి ఇంట్లోనూ ఉండేవాడు. రఘుపతికి అప్పటికే పెళ్లయిందని, భార్య, పిల్లలు ఉన్నారని దివ్యభారతికి తెలిసినా.. మొదటి భార్య ఇంటికి వెళ్లవద్దని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో వీరి మధ్య తరచూ కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రఘుపతి తన మొదటి భార్య, పిల్లలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దివ్యభారతి తన మొదటి భార్య పిల్లలతో కలిసి ఆంధ్రాకు వెళ్లొద్దని చెప్పి గొడవకు దిగినట్లు సమాచారం. అయితే అతను తన మొదటి భార్య, పిల్లలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌కి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న దివ్యభారతి భర్తను ఎక్కడున్నావని ప్రశ్నించింది. తనతో వీడియో కాల్ మాట్లాడాలని.. లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. అయితే రఘుపతి వీడియో కాల్ చేయలేదని తెలుస్తోంది. దీంతో మనస్తాపం చెందిన దివ్యభారతి సోమవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంకే నేత కరుణానిధి

డీఎంకేతోనే రాష్ట్రాభివృద్ధి

పళ్లిపట్టు: డీఎంకే రెండేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతోందని ఆ పార్టీ నేత కరుణానిధి అన్నారు. పళ్లిపట్టు సౌత్ యూనియన్ డీఎంకే ఆధ్వర్యంలో దిగువ నెడిగల్లులో రెండేళ్ల పాలనకు సంబంధించి బహిరంగ సభ ఆదివారం సాయంత్రం జరిగింది. మండల కార్యదర్శి జి.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ ప్రధాన వక్త కరుణానిధి ప్రసంగించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నాయకత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రజలు డీఎంకేకు అండగా నిలవాలని కోరారు. పార్టీ నాయకులు గోవిందస్వామి, భారతి, గోపి, అన్బు, దేవరాజ్, పంచాయతీ సర్పంచ్‌లు కుమార్, రాజ పాల్గొన్నారు.

చార్జింగ్ పెట్టి ఫోన్ మాట్లాడుతుండగా..

తిరువొత్తియూరు: చార్జింగ్‌లో పెట్టి ఫోన్ మాట్లాడుతున్న వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతిచెందిన ఘటన చెన్నై చాకలిపేటలో చోటుచేసుకుంది. కెనాల్ వీధికి చెందిన కామరాజు (22) అద్దె ఇంటిలో ఒంటరిగా ఉంటూ మూల కొత్తంలో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సెల్‌ఫోన్‌ను చార్జింగ్‌లో పెట్టి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నాడు. హఠాత్తుగా సెల్ పేలడంతో కామరాజు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీని గురించి సమాచారం అందుకున్న చాకలిపేట పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గరుత్మంతునిపై శ్రీహరి కటాక్షం

• ఉదయం మోహినీ అవతారంలో అభయమిచ్చిన శ్రీనివాసుడు
• శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
• నాగలాపురంలో వేడుకగా వేదనారాయణుని బ్రహ్మోత్సవాలు





నాగలాపురంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణునికి స్నపన తిరుమంజనం, గరుడ వాహనంపై విహరిస్తున్న లోకనాయకుడైన శ్రీ వేదనారాయణ స్వామి

పిచ్చాటూరు: వైకుంఠనాథునికి అత్యంత ప్రీతిమంతమైన గరుత్మంతునిపై లోకనాయకుడైన శ్రీ వేదనారాయణ స్వామి విహరిస్తూ సోమవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన వాహన సేవ అయిన గరుడ సేవ అత్యంత వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామి నాగలాపురం తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటి నమ్మకం. గరుడ వాహన సేవను పురస్కరించుకొని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భజన బృందం కోలాటాలు తిరువీధుల్లో స్వామివారి ముందు సాగుతూ భక్తులను అలరింపజేసింది. చివరిగా స్వామివారి నిజాలయానికి వేంచేసి ఏకాంత సేవ నిర్వహించారు.

మోహినీ అవతారంలో శ్రీనివాసుడి అభయం

సోమవారం ఉదయం మోహినీ అవతారంలో శ్రీనివాసుడు ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. నిత్యకైంకర్యాలనంతరం వాహన మండపంలో శ్రీవారిని అర్చకులు మోహినీ అవతారంలో అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు స్వామివారికి కర్పూర, పూర్ణకుంభ హారతులు సమర్పించారు. మాయా జగత్తు నుంచి బయటపడేయటమే మోహినీ రూపం పరమార్థం అని భక్తులు విశ్వసిస్తారు.

శోభాయమానంగా ఊంజల్ సేవ

ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఉత్సవమూర్తులకు మహామండపంలో ఆశీనులు చేసి వేద పండితులు శ్రీసూక్తం, భూసూక్తం, పురుషసూక్తం, నీలసూక్తం, నారాయణసూక్తాలను పఠిస్తుండగా అర్చక స్వాములు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం 7 గంటలకు మత్స్య అవతారుడైన శ్రీ వేదనారాయణుని విశేష అలంకరణలు చేసి రాములవారి మండలంలోని ఊయలపై ఆసీనులు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీవారి ఊంజల్ అత్యంత వైభవంగా నిర్వహించారు.

నేడు హనుమంత, గజ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం హనుమంత వాహన సేవ, రాత్రి గజ వాహన సేవ నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 7 గంటలకు ఊంజల్ సేవ జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా...

ఓఆర్‌ఆర్ లీజు విధానాలను బయటపెట్టాలి : తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) లీజు విధానాలను ప్రభుత్వం బయటపెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకుంటామని, ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఓఆర్‌ఆర్ తదితరాలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టకూడదని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. లీజు వ్యవహారంపై విమర్శలు వస్తున్నందున ఒప్పంద వివరాలను ప్రజల ముందుంచాలని తమ్మినేని డిమాండ్ చేశారు. రాష్ట్ర కేబినెట్‌లో ఆరు నెలల క్రితమే లీజు నిర్ణయం జరిగినా ప్రభుత్వం గోప్యంగా ఉంచిందని విమర్శించారు. లీజులో నిబంధనలేమీ పాటించలేదని, వేల కోట్లు దోపిడీ జరిగిందని ఆయన ఆరోపించారు.

బీజేపీకి తోకపార్టీలా బీఎస్‌పీ: గువ్వల



సాక్షి, హైదరాబాద్: దేశ రాజకీయాల్లో ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి శకం ముగిసిందని, ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులకు భయపడి బీఎస్పీని బీజేపీకి తోక పార్టీలా మార్చారని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు విమర్శించారు. బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీని పల్లెత్తు మాట కూడా విమర్శించని మాయావతి సీఎం కేసీఆర్‌పై మాత్రం అర్థరహిత విమర్శలు చేశారన్నారు. కొండంత నమ్మకంతో గురుకుల సొసైటీ కార్యదర్శిగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఆరేళ్లు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించినా పదవిని దుర్వినియోగం చేశారని బాలరాజు ఆరోపించారు. స్వేరో సంస్థ పేరిట సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని ఇప్పుడు రాజకీయాలకు వాడుకుంటున్నారని విమర్శించారు.

యుగ పురుషుడు ఎన్టీఆర్..: బాలకృష్ణ



సాక్షి, హైదరాబాద్: ఎన్టీఆర్.. తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటిన మహనీయుడని సినీ నటుడు, ఏపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం.అరవింద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం మినీ మహానాడు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాలకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణలో టీడీపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ చూపిన బాటలో తెలంగాణ టీడీపీ ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలోని 96 నియోజకవర్గాల్లో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం జరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ కీలకపాత్ర పోషించనుందని తెలిపారు.

జాబ్ క్యాలెండర్ ఏది?

మంత్రి కేటీఆర్‌పై షర్మిల ట్వీట్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు విడుదల చేయడం లేదో చెప్పాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. దేశంలో ఎంప్లాయ్‌మెంట్ పాలసీ తీసుకురావాలన్న మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై ఆమె ట్విట్టర్‌లో స్పందించారు. గ్రూప్–1 పరీక్షలు రాయొద్దని, ప్రత్యేక తెలంగాణలో రాసుకుందామని యువతను పెడదోవ పట్టించిందెవరని ఆమె ప్రశ్నించారు. తొమ్మిదేళ్లుగా ఒక్క గ్రూప్–1 ఉద్యోగం ఇవ్వడం చేతకాలేదని విమర్శించారు. కొలువులు ఇవ్వకుండా వందలాది మంది నిరుద్యోగుల ఉసురు తీసిన ఘనత కేసీఆర్‌ది కాదా? అని నిలదీశారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అని యువతను వంచించారని దుయ్యబట్టారు. కనీసం ఆత్మహత్య చేసుకున్న ఒక్క కుటుంబాన్నయినా పరామర్శించింది లేదని పేర్కొన్నారు. యువతను బలిపశువులను చేసింది కేసీఆర్ ఐతే, అదే యువత ఉద్యోగ ఆకాంక్షలను పాతరేసింది కేటీఆర్ అని విమర్శించారు.

నాలుగో శ్రేణి పౌరులుగా బీసీలు



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ బీసీలను అణగదొక్కడంతో తెలంగాణలో నాలుగో శ్రేణి పౌరులుగా మారారని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మండిపడ్డారు. ఉమ్మడి ఏపీలో బీసీలు రెండో శ్రేణి పౌరులుగా ఉంటే.. కేసీఆర్ పాలనలో నాలుగో శ్రేణి పౌరులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న నాగోలు శుభం కన్వెన్షన్ హాలులో 'తెలంగాణ బీజేపీ ఓబీసీ సమ్మేళనం'నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఓబీసీ సమ్మేళనం పోస్టర్‌ను విడుదల చేశారు.

యువతకు ఉపాధి... అమరులకు ఆదరణ

సరూర్‌నగర్ సభలో 'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్' ప్రకటించిన కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరుద్యోగ యువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మహిళలు, అమరవీరుల కుటుంబాలు, గల్ఫ్ కార్మికులను ఆకట్టుకునేలా కాంగ్రెస్ పార్టీ 'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్'ను ప్రకటించింది. మొత్తం ఐదు అంశాలతో కూడిన 17 హామీలను ప్రకటించింది. సోమవారం సరూర్‌నగర్‌లో జరిగిన సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ సమక్షంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ డిక్లరేషన్ వివరాలను వెల్లడించారు. ఆ అంశాలివీ..



'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్' పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రియాంకా గాంధీ, మాణిక్ రావ్ ఠాక్రే రేవంత్‌రెడ్డి తదితరులు

1 అమరవీరులు, ఉద్యమకారుల త్యాగాలకు గుర్తింపు

- తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన యువతీ, యువకులకు ఉద్యమ అమరవీరులుగా గుర్తింపు. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు కుటుంబానికి నెలకు రూ.25 వేల పింఛన్.
- ఉద్యమంలో పాల్గొన్నవారిపై నమోదైన కేసుల ఎత్తివేత. జూన్ 2న వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు.

2 పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ.
- తొలి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ.
- ఏటా జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ కేలండర్ ప్రకటన. ఉద్యోగ పరీక్షలు నిర్వహించి సెప్టెంబర్ 17న నియామక పత్రాల అందజేత.
- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే వరకు ప్రతి నెలా రూ.4,000 నిరుద్యోగ భృతి చెల్లింపు.
- ప్రత్యేక చట్టం ద్వారా టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చేసి యూపీఎస్సీ తరహాలో నియామకాలు.

3 నిరుద్యోగ నిర్మూలన

- తెలంగాణను నిరుద్యోగ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు 'సెంట్రలైజ్డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్' ఏర్పాటు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీ ఏర్పాటు. ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా శిక్షణ.
- ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రైవేట్ కంపెనీల్లో తెలంగాణ యువతకు 75% రిజర్వేషన్లు.
- విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, కమిషన్ల తరహాలో యూత్ కమిషన్ ఏర్పాటు. ఆ కమిషన్ ద్వారా రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణ సదుపాయం.
- ప్రత్యేక గల్ఫ్ విభాగం ఏర్పాటుతో గల్ఫ్ ఏజెంట్ల నియంత్రణ. గల్ఫ్ దేశాల్లో మెరుగైన ఉపాధి కల్పనతోపాటు కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు.

4 ఫీజు రీయింబర్స్‌మెంట్

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు. రూ.4 వేల కోట్ల బకాయిల చెల్లింపు.
- పాలమూరు, తెలంగాణ, మహాత్మాగాంధీ, శాతవాహన వర్సిటీలను ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలుగా మార్చడంతోపాటు.. ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్‌లలో నూతన ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీల ఏర్పాటు.
- బాసరలో ట్రిపుల్‌ఐటీ తరహాలో మరో నాలుగు ట్రిపుల్ ఐటీల ఏర్పాటు.
- అమెరికాలోని ఐఎంజీ తరహాలో అన్ని వసతులతో కూడిన ప్రపంచస్థాయి క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం.
- పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల కోసం వరంగల్, హైదరాబాద్‌లలో రెండు ప్రత్యేక విద్యాలయాలు. 6వ తరగతి నుంచి పట్టభద్రుల య్యేంత వరకు నాణ్యమైన విద్య.

5 యువ మహిళా సాధికారత

- మహిళా సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలు, పథకాలు
- 18 ఏళ్లు పైబడిన చదువుకునే యువతులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్లు.

జాగీర్దార్ల పాలన

బీఆర్‌ఎస్ నేతలు రాష్ట్రం తమ జాగీర్ అనుకుంటున్నారు



'యువ సంఘర్షణ సభ'లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఫైర్

- ప్రజల కలలను బీఆర్‌ఎస్ ఛిద్రం చేసింది.. రుణమాఫీ లేదు.. నిరుద్యోగ భృతి లేదు
- ఉద్యమాన్ని ఎవరో ఒక్కరే నడపలేదు.. అన్ని వర్గాలు పోరాడాయి
- ప్రజల ఆకాంక్షలను గమనించే సోనియా తెలంగాణ ఇచ్చారు
- ఇందిరమ్మతో పోలుస్తుంటే నాపై బాధ్యత మరింత పెరుగుతోంది
- హైదరాబాద్ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉంటాం.. హామీలు నెరవేర్చకుంటే దించేయండి
- దేశంలో మతం, జాతి పేరిట రాజకీయాలు జరుగుతున్నాయి

> మీరంతా నన్ను నయా ఇందిరమ్మ అంటున్నారు. ఆమెతో పోలుస్తుంటే నాపై బాధ్యత పెరుగుతోంది. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన నేను మోసపూరిత వాగ్దానాలు ఇవ్వలేను. అబద్ధాలు చెప్పను. దేశంలో రాజకీయాలను చూస్తుంటే బాధ కలుగుతోంది. మతం, జాతి పేరుతో భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. అధికారం కోసం ఏం చేసేందుకైనా వెనుకాడడం లేదు.

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రజాస్వామిక పాలన లేదని, నియంతృత్వం కొనసాగుతోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ విమర్శించారు. టీఆర్‌ఎస్ నేతలు ఈ రాష్ట్రం తమ జాగీర్ అనుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల పోరాటాలను అర్థం చేసుకుని తెలంగాణ ఇచ్చారని.. కానీ ప్రజల కలలను, ఆకాంక్షలను బీఆర్‌ఎస్ ఛిద్రం చేసిందని ఆరోపించారు. దేశంలో మతం, జాతి పేరిట రెచ్చగొట్టి అధికారం దక్కించుకునే రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. ఈ అనైతిక రాజకీయాల నుంచి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ 'యువ సంఘర్షణ సభ'లో ప్రియాంక గాంధీ మాట్లాడారు. ప్రసంగం ఆమె మాటల్లోనే..

''తెలంగాణ ఒక లక్ష్యం కోసం ఏర్పాటైంది. ఈ గడ్డపై ఉన్న ప్రేమతో తెలంగాణను తల్లితో సమానంగా చూస్తారు. రాష్ట్ర ఏర్పాటు కోసం శ్రీకాంతా చారి సహా ఎందరో ప్రాణత్యాగాలు చేశారు. తెలంగాణ ఏర్పాటైతే ఉద్యోగాలు వస్తాయని, నీళ్లు వస్తాయని, పంటలకు మద్దతు ధర లభిస్తుందని, కడుపు నిండా అన్నం తింటామని ఆశించారు. ఈ ఉద్యమాన్ని ఎవరూ ముందుండి నడిపించలేదు. అన్నివర్గాల ప్రజల పోరాటమే తెలంగాణను తెచ్చింది.

బలిదానాల విలువ మాకు తెలుసు

అమరవీరులు మహోన్నత ఆశయంతో ప్రాణాలను త్యాగం చేస్తారు. వారి బలిదానం విలువ ఏమిటో మా కుటుంబానికి, నాకు తెలుసు. నా నానమ్మ ఇందిరాగాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. అందుకే అమరవీరుల త్యాగం వృధా కావొద్దని మా కుటుంబం కోరుకుంటుంది. ఇక్కడి యువత మనసును అర్థం చేసుకుని సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజున అధికారం కోసమో, రాజకీయం కోసమో ఆలోచిస్తే.. ఈ నిర్ణయం తీసుకునేవారు కాదు.

అధికారంలో ఉన్న వారికే అన్నీ..

అమరుల ఆశయాలు, సోనియాగాంధీ ఆలోచనల మేరకు రాష్ట్రంలో పాలన జరగడం లేదు. నిధులు, ఉద్యోగాలు అన్నీ అధికారంలో ఉన్న వారికి, వారి తాబేదార్లకే అందుతున్నాయి. బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలన చేస్తోంది. ఈ రాష్ట్రం వాళ్ల జాగీర్ అని, వారు నయా జాగీర్దార్లని అనుకుంటున్నారు. తెలంగాణ యువత బలిదానాలు చేసింది ఇందుకు కాదు. వారి హక్కుల సాధన కోసం చేశారు.

ఒక్క హామీని నెరవేర్చలేదు..

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు బీఆర్‌ఎస్ ఎన్నో కల్లిబొల్లి మాటలు చెప్పింది. రైతులకు రుణమాఫీ చేస్తామన్నది. కానీ ఇప్పుడు ఒక్కో రైతు నెత్తిపై రెండున్నర లక్షల రుణం ఉంది. 2014 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కుటుంబానికో ఉద్యోగం అన్నారు. ఇవ్వలేదు. నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తామన్నారు. ఇవ్వలేదు. ఖాళీగా ఉన్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయలేదు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. యూనివర్సిటీల్లో ఉద్యోగ నియామకాల్లేవు.

నిర్ణయం తీసుకునే బాధ్యత మీదే..

కొన్నినెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఎవరు వస్తే ఏం చేస్తారో ఆలోచించుకోవాలి. మేం 'హైదరాబాద్ డిక్లరేషన్'కు కట్టుబడి ఉంటాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చకపోతే మమ్మల్ని దింపేయండి. ఈ దేశాన్ని అనైతిక రాజకీయాల నుంచి కాపాడుకోవాలంటే మీరు చైతన్యవంతులు కావాల్సిందే. అప్పుడప్పుడు ఇక్కడికి వస్తా. మీతో మాట్లాడుతా. తెలంగాణ నంబర్ వన్ కావాలన్నదే నా ఆకాంక్ష..'' అంటూ ప్రియాంక తన ప్రసంగాన్ని ముగించారు.

కేసీఆర్ పాలనలో అన్యాయమే..: రేవంత్

యువత భవితే కాంగ్రెస్ నినాదమని, అమరుల ఆశయ సాధన కాంగ్రెస్ విధానమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆకాంక్షలు నెరవేరక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ''మన రాష్ట్రం- మన కొలువులు నినాదంతో యువతీ యువకులు లాఠీ దెబ్బలు తిన్నారు. ప్రాణాలు అర్పించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.7 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని 2014లో అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ చెప్పారు. 2020లో బిశ్వాల్ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నట్టు తేలింది. అంటే ఉద్యోగాలను భర్తీ చేయనట్టే కదా. కేసీఆర్ పాలనలో యువతకు న్యాయం జరగదు. అందుకే నిరుద్యోగులకు అండగా ఉండేందుకు ప్రియాంకా గాంధీ వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. హైదరాబాద్ డిక్లరేషన్‌లోని హామీలన్నీ తప్పకుండా నెరవేరుస్తాం'' అని చెప్పారు.

మరో పోరాటానికి సిద్ధమవుదాం: భట్టి

''మన నిధులు, మన నియామకాలు, మన ఆత్మ గౌరవం కోసం దశాబ్దాలపాటు పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగాలు లేక నిరాశ, నిస్పృహలతో లక్షల మంది నిరుద్యోగ యువత అల్లాడిపోతున్నారు. ఉద్యోగాలు రాక తీవ్ర మానసిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు'' అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు రాక విలవిల్లాడుతున్న యువతకు భరోసా ఇవ్వడం కోసమే కాంగ్రెస్ నిరుద్యోగ సభ చేపట్టిందని భట్టి తెలిపారు. సమస్త విద్యార్థి లోకం, నిరుద్యోగ యువత పిడికిలి బిగించి మరోసారి పోరాటానికి సిద్ధమవుదామని.. మన ఆశలు, ఆశయాలు, గుర్తించి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తో చేయి కలుపుదామని పిలుపునిచ్చారు.

దక్షిణాది, ఉత్తరాదంటూ వర్గీకరణ తగదు

ఢిల్లీ మద్యం విధానం కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: భారతదేశంలో దక్షిణాది, ఉత్తరాది అంటూ వర్గీకరణ ఎవరూ చేయకూడదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. దేశంలో అన్ని ప్రాంతాల ప్రజల సెంటిమెంట్లు గౌరవిస్తామని తెలిపింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో 'ద సౌత్ గ్రూప్, 'ద సౌత్ లాబీ'అనడం రాజ్యాంగ విరుద్ధమని, సదరు భాష వినియోగించరాదని దర్యాప్తు సంస్థల్ని ఆదేశించాలంటూ బీఆర్‌ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. కార్తీక్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు సంస్థలు వినియోగిస్తున్న సదరు భాష ఐక్య భారతదేశంలో చీలికలకు దారితీసేలా ఉందన్నారు. నిందితులను ప్రాంతీయంగా కాకుండా ఏ నిందితుడు, బీ నిందితుడు అని సంబోధించాలని పేర్కొన్నారు. దీనికి అంగీకరిస్తున్నామన్న జస్టిస్ ఖన్నా.. దేశంలో ఎవరూ ఉత్తరాది, దక్షిణాది అని వర్గీకరించడం తగదని పేర్కొన్నారు. ఐదు దక్షిణాది రాష్ట్రాల జీడీపీ భాగస్వామ్యం గణనీయమని ఓ కాన్ఫరెన్స్‌లో తన దృష్టికి వచ్చిందని ప్రస్తావించారు. పిటిషన్ ప్రతులు రిప్రజెంటేషన్ రూపంలో దర్యాప్తు సంస్థలకు అందజేయాలని, దర్యాప్తు సంస్థల చర్యల అనంతరం అవసరమైతే కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ పిటిషనర్‌కు ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.



శంకుస్థాపన సందర్భంగా యాగ పూర్ణాహుతి సమర్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

మత మౌఢ్యమే సమస్య

- ఏ మతం కూడా హింసను బోధించడం లేదు: కేసీఆర్
- మధ్యలో వచ్చినవారే చిచ్చుపెడుతున్నారు
- హైదరాబాద్ శివార్లలోని నార్సింగిలో హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌కు భూమిపూజ
- ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం తరపున రూ.25 కోట్లు విరాళం
- ఈ మౌఢ్యాన్ని తరిమేందుకు హరేకృష్ణ మూవ్‌మెంట్ పనిచేయాలని విజ్ఞప్తి

మణికొండ (హైదరాబాద్): మందిరాలు, మసీదులు, చర్చిలు ఏవైనా, ఏమతం వారికైనా సాంత్వన చేకూరుస్తాయని.. శాంతిని నెలకొల్పుతాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఇలాంటి వాటిని వీలైనంతగా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పరమాత్మను అనేక రూపాలలో ఆరాధించడం మానవజాతి తొలినాళ్ల నుంచీ ఉందని పేర్కొన్నారు. ఆలయాలు సామాజిక కేంద్రాలని (కమ్యూనిటీ సెంటర్లు), అన్ని మతాలు శాంతినే ప్రబోధిస్తాయని చెప్పారు. మతం సార్వజనితమని.. కానీ మత మౌఢ్యం మనిషితో అమానుషమైన పనులు చేయిస్తుందన్నారు. ప్రపంచంలో ఏ మతం హింసను బోధించలేదని.. మధ్యలో వచ్చినవారే దీనిని జతచేసి చిచ్చుపెడుతున్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ శివార్లలోని నార్సింగిలో హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ రూ.200 కోట్లతో 400 అడుగుల ఎత్తున నిర్మిస్తున్న శ్రీరాధాకృష్ణ, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల సముదాయం, హెరిటేజ్ టవర్ నిర్మాణానికి సీఎం కేసీఆర్ సోమవారం శంకుస్థాపన చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదుల విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

రాష్ట్రంలో ఆధ్యాత్మికత పెంపొందిస్తున్నాం

''హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో మానవ జీవితాల్లో వేగం పెరుగుతోంది. ఎన్నో సమస్యలు, రోగాలను జనం ఎదుర్కొంటున్నారు. అలాంటి వారికి ఆలయాల్లో సాగే భజనలు, కీర్తనలు స్వాంతన చేకూర్చే ఔషధాలుగా పనిచేస్తాయి. ఈ క్రమంలోనే అత్యద్భుతంగా నిర్మించిన యాదగిరిగుట్ట ఆలయానికి సర్వత్రా అభినందనలు వస్తున్నాయి. ఆధ్యాత్మికత పెంపొందించేందుకు వేములవాడ, కొండగట్టు, కాళేశ్వరం ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం''అని కేసీఆర్ తెలిపారు.

రాష్ట్రానికే గర్వకారణంగా నిలుస్తుంది

హరేకృష్ణ హెరిటేజ్ టవర్ రాష్ట్రానికే గర్వకారణంగా నిలుస్తుందని.. సాంస్కృతిక పర్యాటక అభివృద్ధికి తోడ్పడుతుందని హరేకృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్ మధు పండిత దాస అన్నారు. తరాలు మారినా తరగని మన అద్భుత సంస్కృతిని ఆస్వాదిస్తూనే.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి.సబితారెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నవీన్‌రావు, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, జైపాల్‌యాదవ్, హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్య గౌరదాస, శ్రీకృష్ణ గోసేవ మండలి కార్యదర్శి సురేశ్‌కుమార్ అగర్వాల్, పలువురు నేతలు, దాతలు పాల్గొన్నారు.

'హరేకృష్ణ' సహకారం గొప్పది

హరేకృష్ణ మూవ్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని సీఎం కేసీఆర్ శ్లాఘించారు. అక్షయపాత్ర, అన్నపూర్ణ పథకం వంటివాటి ద్వారా లక్షలాది మంది ఆకలి తీరుస్తోందన్నారు. ఒక్క ఫిర్యాదు లేకుండా ఒక్కరోజు ఆగకుండా నిర్విరామంగా చేస్తున్న కృషి వారి అంకితభావానికి నిదర్శనమన్నారు. కరోనా వంటి ఉపద్రవాలు వచ్చిన సమయంలో కూడా ముందుకొచ్చి సేవామూర్తులుగా నిలిచారన్నారు. నార్సింగిలో చేపట్టిన ఆలయాన్ని త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఆధ్యాత్మికంగా, సామాజికంగా సేవ అందించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. మతమౌఢ్యాన్ని తరిమికొట్టేందుకు హరేకృష్ణ మూవ్‌మెంట్ వంటి సంస్థలు కృషి చేయాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆలయ నిర్మాణానికి రూ.25 కోట్ల విరాళం ఇస్తున్నట్టు సీఎం ప్రకటించారు.

ఉపరితల ఆవర్తనంతో వాయుగుండం

సాక్షి, హైదరాబాద్: ఆగ్నేయ బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లోని దక్షిణ అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది క్రమంగా బలపడి మంగళవారం వాయుగుండంగా అదే ప్రదేశంలో కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. బుధవారానికి తుపానుగా బలపడి ఉత్తర వాయువ్య దిశగా పయనించనుంది. దీంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు రాష్ట్రంలో మంగళవారం నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని, కొన్నిచోట్ల 40 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదు కానున్నట్లు వివరించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత అదిలాబాద్‌లో 39.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత దుండిగల్‌లో 23.1 డిగ్రీలు నమోదైంది.

ఏపీ, తెలంగాణలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.4	26.8
ఆదిలాబాద్	39.8	25.2
రామగుండం	39.2	26.0
నల్లగొండ	39.0	25.7
ఖమ్మం	38.6	27.8
నిజామాబాద్	38.4	26.2
మహబూబ్‌నగర్	38.0	24.0
భద్రాచలం	38.0	26.0
విజయవాడ	38.0	28.0
మెదక్	37.6	24.0
హనుమకొండ	37.5	26.0
శ్రీకాకుళం	37.0	25.0
హైదరాబాద్	36.3	26.0
హకీంపేట్	34.0	26.0

ముగిసిన తెయూ రిజిస్ట్రార్ వివాదం

- రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ యాదగిరి
- ఓయూలో విధుల్లో చేరిన నిర్మలాదేవి

తెయూ (డిచ్‌పల్లి): రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. రిజిస్ట్రార్‌గా ఎం.యాదగిరి సోమవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత నెల 19న జరిగిన సమావేశంలో పాలక మండలి వర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరిని నియమించింది. ఈసీ నిర్ణయాన్ని కాదని వైస్‌చాన్స్‌లర్ రవీందర్ గుప్తా ఓయూ ఇంజనీరింగ్ విభాగం ఈసీఈ హెడ్ ప్రొఫెసర్ నిర్మలాదేవిని ఈ నెల 3న ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. అదేరోజు సాయంత్రం నిర్మలాదేవి రిలీవింగ్ ఉత్తర్వులను ఓయూ అధికారులు రద్దు చేశారు. వీసీ రవీందర్ గుప్తా తనను ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా నియమించారని, మూడు నెలల్లో ఈసీ ఆమోదంతో తాను రిజిస్ట్రార్‌గా కొనసాగుతానని శనివారం నిర్మలాదేవి ప్రకటించారు. తన అనుమతి లేకుండా పాలక మండలి సమావేశానికి హాజరైన ఈసీ ఇంటర్నల్ సభ్యులు ముగ్గురికి వీసీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే.. నిర్మలాదేవి అనూహ్యంగా సోమవారం తిరిగి ఓయూలో విధుల్లో చేరారు. కాగా, వీసీ రవీందర్ మీద వచ్చిన అక్రమాలపై విచారణ గురించి ఈ నెల 12న జరగనున్న ఈసీ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఈసీ నిర్ణయం మేరకే రిజిస్ట్రార్‌గా..

యూనివర్సిటీ పాలకమండలి తీసుకున్న నిర్ణయం మేరకే తెయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు ఎం.యాదగిరి తెలిపారు. పాలక మండలి నిర్ణయాలకు అనుగుణంగా, అందరి సహకారంతో యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

నేడే ఇంటర్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న ఇంటర్మీడియట్ ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. రాష్ట్ర ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి లాంఛనంగా విడుదలల చేస్తారు. అనంతరం https:// tsbie. cgg. gov. in, http:// results. cgg. gov.in వెబ్‌సైట్లలో విద్యార్థులు ఫలితాలను చూసుకోవచ్చు. రాష్ట్రంలో మార్చి 15 నుంచి ఏప్రిల్ 5 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగాయి. మొత్తంగా 9.47 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గతేడాది ఫలితాలు జూన్‌లో విడుదల కాగా.. ఈ ఏడాది ఒక నెల ముందుగానే విడుదలకు ఏర్పాట్లు చేశారు. ఈ ఫలితాల క్రోడీకరణ ప్రక్రియ, ట్రయల్స్‌ను పూర్తిచేసిన అధికారులు.. సోమవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డికి నివేదిక సమర్పించారు. దానిని పరిశీలించిన మంత్రి మంగళవారం ఫలితాలను విడుదల చేసేందుకు అనుమతినిచ్చారు.


అమెరికాలో ప్రదర్శించనున్న పూల కుండీతో మణికంఠ, లక్ష్మీదేవి, వినయ్‌కుమార్

టీచర్ @ ఎకో స్మార్ట్ కుండీ

లక్ష్మీదేవికి పాఠాలూ ప్రయోగాలే ఊపిరి.
క్లాసులో పాఠంతోపాటు ప్రయోగమూ చేయిస్తారు.
మొక్క కోసం నేలకు హాని తలపెడితే ఎలా?
అందుకే నేలకు మేలు చేసే పూల కుండీ చేశారు.
ఆ.. ఎకో స్మార్ట్ పూల కుండీ...
అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శితం కానుంది.

'టీచర్ ఉద్యోగం ఒక వరం. దేవుడిచ్చిన ఈ అవకాశానికి నూటికి నూరు పాళ్ల న్యాయం చేయాలనేది నా ఆశయం' అన్నారు కొల్లాటి లక్ష్మీదేవి. ఆమె పుట్టింది, పెరిగింది మచిలీపట్నంలో. ఎమ్మెస్సీ, బీఈడీ చేసి 1995లో డీఎస్సీ సెలక్షన్‌లో ఉద్యోగం తెచ్చుకున్నారు. తొలి పోస్టింగ్ కృష్ణాజిల్లా, సుల్తానగరంలో. అప్పటి నుంచి మొదలైందామె విజ్ఞాన దానయజ్ఞం. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశాల్లో ఉన్న విషయాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించడంతో మొదలైందా యజ్ఞం. పదేళ్ల తర్వాత పెడన మండలం చెన్నూరు ఈస్ట్‌లో మరో స్కూల్‌కి హెడ్‌మాస్టర్‌గా బదిలీ. ఆ సంతోషం ఆ స్కూల్‌కి వెళ్లే వరకే. పదిహేనుమంది పిల్లలున్న స్కూల్ అది. అలాగే వదిలేస్తే ఇద్దరు టీచర్ల స్కూల్‌లో ఒక పోస్ట్ రద్దయ్యే పరిస్థితి. ఇంటింటికీ వెళ్లి 'మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించండి. మంచి విద్యనందిస్తాం. మా మీద నమ్మకం ఉంచండి' అని నచ్చచెప్పి ఎన్‌రోల్‌మెంట్ 45కి పెంచారు. సైన్స్ ప్రాజెక్టులు చేయించడం ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహాన్ని కలిగిస్తూ పాఠశాల పిల్లలను అయస్కాంతంలా ఆకర్షించేటట్లు చేశారు. ఆ తర్వాత చెన్నూరు జిల్లా పరిషత్ స్కూల్‌కి వచ్చినప్పటి నుంచి పెద్ద తరగతులకు పాఠం చెప్పే అవకాశం రావడంతో మరింత విస్తృతంగా ప్రయోగాలు మొదలుపెట్టారు. వందకు పైగా ప్రయోగాలు చేసిన ఆమె ప్రయోగాల్లో ఎకో ఫ్రెండ్లీ పూల కుండీ ప్రయోగం అంతర్జాతీయ స్థాయికి చేరింది. ఈ నెల 13 నుంచి 18 వరకు ఆమె విద్యార్థులు మణికంఠ, వినయ కుమార్‌లు యూఎస్‌లోని టెక్సాస్ రాష్ట్రం, డల్లాస్ నగరంలో జరిగే ఐఎస్ఈఎఫ్ ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌లో 'స్మార్ట్ సొల్యూషన్ ఫర్ ఎకో పొల్యూషన్' పేరుతో ఈ ప్రయోగాన్ని ప్రదర్శించనున్నారు. తన ప్రయోగాల పరంపరను సాక్షితో పంచుకున్నారు లక్ష్మీదేవి.

> 'స్మార్ట్ సొల్యూషన్ ఫర్ ఎకో పొల్యూషన్' పేరుతో మేము తయారు చేసిన ఎకో ఫ్రెండ్లీ పూల కుండీని డల్లాస్‌లో జరిగే ఐఎస్ఈఎఫ్ ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఫెయిర్‌లో ప్రదర్శిస్తారు. ఆ కార్యక్రమంలో వంద దేశాలు పాల్గొంటాయి. ప్రదర్శనలో 1800 ప్రాజెక్టులు ఉంటాయి. ఈ కార్యక్రమాన్ని బ్రాడ్‌కామ్ అనే మల్టీనేషనల్ కంపెనీ నిర్వహిస్తోంది.

ఫ్లోరైడ్ జవాబు దొరికింది!

నేను గర్వంగా చెప్పుకోదగిన ప్రయోగాల్లో ఫ్లోరైడ్ నీటిని శుద్ధి చేసే కుండ కూడా ముఖ్యమైనదే. మట్టిలో తులసి, మునగ ఆకులు కలిపి చేశాను. ఫ్లోరైడ్ 3.5 పీపీఎమ్ ఉన్న నీటిలో అడవుల్లో దొరికే చిల్లగింజలను వేసి హార్డ్‌నెస్ తగ్గించిన తరవాత ఆ నీటిని నేను చేసిన కుండలో పోసి ఆరు గంటల తర్వాత టెస్ట్ చేస్తే పీపీఎమ్ 1.5 వచ్చింది. ఈ కుండలో శుద్ధి అయిన నీటి పీహెచ్ సాధారణ స్థాయుల్లో ఉండడమే కాదు నీటిలో ఉండాల్సిన కంపోజిషన్స్ అన్నీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ ప్రయోగాన్ని మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేటివ్ అండ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన స్మార్ట్ ఇండియన్ హాకథాన్‌లో ప్రదర్శించాం. 'ద ఇనిషియేటివ్ రీసెర్చ్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిమ్ (ఐరిస్)' నిర్వహించిన పోటీలో ప్రదర్శించినప్పుడు నా స్టూడెంట్ సీహెచ్. తరుణ్‌బాబు'కి 'యంగ్ ఇన్నోవేటర్ అవార్డు'. 45 వేల క్యాష్ ప్రైజ్ వచ్చింది. ఫిఫ్త్ యాన్యువల్ ఇంటర్నేషనల్ ఇన్నోహెల్త్ ప్రోగ్రామ్ ఢిల్లీ ట్రిపుల్ ఐటీ– ఇన్నో క్యూరియో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఫైనల్స్‌కి వచ్చి ఆరు బెస్ట్ ప్రాజెక్టుల్లో రెండవ స్థానం.

- కొల్లాటి లక్ష్మీదేవి, బయలాజికల్ సైన్స్ అసిస్టెంట్, జీజీకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెడన, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఎంత నేర్పిస్తే అంత నేర్చుకుంటారు!

పిల్లల మెదడు కొత్త విషయాలను తెలుసుకోవడానికి సిద్ధంగా ఉంటుంది. వాళ్లకు మనం మనసు పెట్టి నేర్పిస్తే వాళ్లు అంతే చురుగ్గా నేర్చుకుంటారు. ప్రయోగాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. పాఠాలను ప్రయోగాత్మకంగా వివరించడానికి స్లయిడ్‌లు, స్టెమ్, లీఫ్, ఫ్లవర్‌ల భాగాలు నిలువుకోత, అడ్డకోతల నుంచి శరీర అవయవాల పనితీరును వివరించడానికి వధశాలల నుంచి మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులను సేకరించేదాన్ని. ఒక సైన్స్ ఫేర్‌లో సులువైన పద్ధతిలో పుట్టగొడుగుల పెంపకాన్ని నిరూపించాం. కానీ మా స్కూల్‌కి గణితం విభాగంలో ఒక అవార్డ్ ప్రకటించడంతో అదే స్కూల్‌కి రెండో అవార్డు ఇవ్వకూడదని చెప్పి అప్రిషియేషన్ ఇచ్చారు. నాచుతో సేద్యం ప్రయోగం రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. కోవిడ్ సమయంలో ఎక్కువ ఖాళీ సమయం వచ్చింది. మా ఇంటి ఎదురుగా సంతలో అమ్మే మొక్కలు, నర్సరీల వాళ్లు వాడే పాలిథిన్ కవర్ల మీద దృష్టి పడింది. వాటికి ప్రత్యామ్నాయం కోసం ప్రయోగాలు మొదలుపెట్టాను. వేరుశనగపొట్టు, వేపాకు, కొబ్బరి పీచు, మెంతుల మిశ్రమంతో కుండీ తయారీ విజయవంతమైంది. ఎండకు, వానకు తట్టుకుని నిలవడంలో కష్టమవడంతో కలంకారీలో ఉపయోగించే సహజ రంగులను వేయడంతో సమస్య పరిష్కారమైంది. ఇక అవి మట్టిలో కలిసిపోవడం గురించినదే అసలు ప్రశ్న. నెలరోజుల్లో డీ కంపోజ్ అవుతోంది. ఈ కుండీ మట్టిలో కలిసిన తరవాత మట్టికి పోషణనిస్తోందా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోవడమూ అవసరమే. ఎన్‌పీకే చాలా తక్కువగా ఉన్న మట్టిలో వేసి, కలిసిపోయిన తర్వాత మట్టిని మళ్లీ టెస్ట్‌కి పంపిస్తే ఎన్‌పీకే గణనీయంగా పెరిగినట్లు రిపోర్ట్ వచ్చింది. అంతే కాదు నీటిని నిలుపుకునే శక్తి పెరిగింది, వేపలోని యాంటీ మైక్రోబియల్ స్వభావం వల్ల తెగుళ్ల నివారణ సాధ్యమైంది. ఫైటో కెమికల్స్ ఉన్నాయని ల్యాబ్‌టెస్ట్‌లో నిర్ధారణ అయింది. నేషనల్ చైల్డ్ సైన్స్ కాంగ్రెస్ పెట్టిన సైన్స్ ఫేర్‌లలో మండలం, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయులు దాటి జాతీయ స్థాయిలో కూడా ప్రదర్శించాం. మెరిటోరియస్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి 'బెస్ట్ గైడ్ టీచర్' అవార్డు అందుకున్నాను. ఈ ప్రయోగాన్ని అంతర్జాతీయ వేదిక మీద ప్రదర్శించడానికి పెడన నుంచి ఈరోజు బయలుదేరుతున్నాం. ఢిల్లీలో కార్యక్రమాలు పూర్తి చేసుకుని 12వ తేదీన అమెరికా విమానం ఎక్కుతారు మా పిల్లలు'' అని సంతోషంగా చెప్పారు లక్ష్మీదేవి.

– వాకా మంజులారెడ్డి

అక్షరాల్లోని రచనలను రంగస్థలం మీదికి తీసుకురావడం తేలిక కాదు.
ఎందుకంటే, రచన చదివేటప్పుడు పాఠకుల మదిలో ఎన్నో రంగస్థలాలు ఆవిష్కారం అవుతాయి.
తమ ఊహలకు, రంగస్థలానికి చెలిమి ఏర్పడాలి.
ఈ విషయంలో నాటక సమాజం 'థియేటర్ నిషా' విజయం సాధించింది.
స్త్రీ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎన్నో రచనలు చేసింది ప్రసిద్ధ హిందీ రచయిత్రి గౌర్ పంత్ (శివానీ)
ఇది ఆమె శతజయంతి సంవత్సరం. దీన్ని దృష్టిలో పెట్టుకొని
పంత్ కథలను నాటకంగా మలిచి ప్రదర్శిస్తోంది థియేటర్ నిషా...

రంగస్థలం

ఏడు ప్రపంచాలు


శివానీ (గౌర్‌పంత్)


'బిన్ను' నాటకంలో...



గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జన్మించింది గౌర్ పంత్. పన్నెండు సంవత్సరాల వయసులో పంత్ తొలి కథ ఒక పిల్లల పత్రికలో ప్రచురితమైంది. టాగూర్ 'శాంతినికేతన్'లో చదువుకోవడం తనలోని సృజనను మెరుగుపెట్టుకోవడానికి కారణం అయింది.

శివానీ కలం పేరుతో రాసిన 'మై ముర్గా హూ' కథకు ఎంతో పేరు వచ్చింది.

'లాల్ హవేలి' పేరుతో తొలి నవల రాసింది.

ఆ తరువాత ఎన్నో కథలు, నవలలు రాసింది. అయితే ఆమె ఏది రాసినా స్త్రీ జీవితమే కేంద్రంగా ఉండేది. ఆ స్త్రీ తన కాల్పనిక ఊహాలోకం నుంచి దిగివచ్చిన స్త్రీ కాదు. తనకు పరిచయం ఉన్న స్త్రీలు, తాను చూసిన స్త్రీలు... ఇలా ఎందరో జీవితాల నుంచి ఎన్నో అద్భుతమైన పాత్రలు సృష్టించింది శివానీ.

భర్త నుంచి హింసకు గురైన స్త్రీలు, అత్యాచార బాధితులు, కుటుంబ హింస బాధితులు, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నవారు... ఎంతోమంది బాధితులు ఆమె రచనల్లో కనిపిస్తారు. శివానీ కూతురు ఐరా పాండే తల్లి రాసిన కొన్ని కథలను 'అపరాధి: ఉమెన్ వితౌట్ మెన్' పేరుతో ఇంగ్లీష్‌లోకి తీసుకువచ్చింది. దీనికి రెండవ భాగం కూడా వచ్చింది.

'అపరాధి' రెండవ భాగంలోని కథలను థియేటర్ నిషా 'బిన్ను' పేరుతో నాటకీకరించింది. ఇందులో బిన్ను, నసీమ్, మిసెస్ ఘోష్, లలిత, పాగలియా, మధుబెన్‌తో పాటు ఒక తల్లి పాత్ర కూడా ఉంటుంది. ఏడుగురి జీవితాలు ఏడు ప్రపంచాలై కనిపిస్తాయి.

బిన్ను నుంచి నసీమ్ వరకు ఎవరూ ఊహల్లో పుట్టిన పాత్రలు కాదు. నిజజీవితంలోని మహిళలు. వారి జీవితాలను శివానీ దగ్గరి నుంచి చూసింది.

ఒక్కో పాత్రకు ఒక్కో ప్రత్యేకత, శైలి, పోరాటరూపం ఉంటాయి.

'ఏడు పాత్రలను కలిపి నాటకానికి బిన్ను అని ఎందుకు పేరు పెట్టారు?' అని అడిగితే ప్లే డైరెక్టర్ బాలక్రిష్ణన్ ఇచ్చిన సమాధానం ఇది... 'శివానీ రచనల్లో నాకు బాగా నచ్చిన పాత్ర బిన్ను. అందుకే ఆ పేరు పెట్టాను. బిన్ను ఎక్కడా, ఎవరికీ తలవంచదు. పురుషులను సవాలు చేస్తుంది. అడ్డంకుల ముళ్లచెట్లను నరికేస్తూ ముందుకు వెళుతుంది. ఆమె స్వరంలో ధిక్కారం, వ్యక్తిత్వంలో ఆత్మగౌరవం కనిపిస్తాయి'

కేరళ నాటకోత్సవాలలో భాగంగా థియేటర్ నిషా ప్రదర్శించిన 'బిన్ను' నాటకానికి అద్భుతమైన స్పందన లభించింది.

ప్రేక్షకుల్లో శివానీ రచనలతో ఎప్పటి నుంచో పరిచయం ఉన్నవారితోపాటు ఎంతమాత్రం పరిచయం లేని వారు కూడా ఉన్నారు. అయితే అందరికీ నాటకం నచ్చింది.

'శివానీ రచనల గురించి తెలియని ఈ తరానికి బిన్ను నాటకం చూస్తే రచయిత్రి దృక్పథం ఏమిటో అర్థమవుతుంది. శతజయంతి సంవత్సరంలో శివానీకి ఒక ఘనమైన నివాళిగా ఈ నాటకాన్ని చెప్పుకోవచ్చు' అంటుంది సీమా అనే ప్రేక్షకురాలు.

సాగుబడి

భరణి కార్తె: మే 10 వరకు
కృత్తిక కార్తె: మే 11నుంచి

పురుగుల వల్ల దిగుబడి నష్టం 40%

- మనం తినే ఆహారంలో 80%, పీల్చే ప్రాణవాయువులో 98% మొక్కలే మనకు ఇస్తున్నాయి.
- **ఆర్థిక ప్రయోజనాలు:** వ్యవసాయోత్పత్తుల వాణిజ్యం విలువ 1,70,000 కోట్ల డాలర్లు. ఇది గత పదేళ్లలో మూడు రెట్లు పెరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ముఖ్యంగా పెరుగుదల ఎక్కువగా ఉంది.
- **ఆహార అవసరం పెరుగుతోంది:** పెరిగే జనాభా అవసరాల కోసం 2050 నాటికి వ్యవసాయోత్పత్తి 60% పెరగాలని ఐరాసకు చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ(ఎఫ్.ఎ.ఓ.) అంచనా.
- **చీడపీడలు సృష్టించే విధ్వంసం:** చీడపీడలు ప్రపంచవ్యాప్తంగా ఆహార పంటల దిగుబడిని 40% మేరకు నష్టపరుస్తున్నాయి. ఎఫ్.ఎ.ఓ. అంచనా ప్రకారం.. చీడపీడల వల్ల జరుగుతున్న వ్యవసాయోత్పత్తుల వ్యాపార నష్టం ఏడాదికి 22,000 కోట్ల డాలర్లు.
- **భూతాపం దెబ్బ:** వాతావరణ మార్పుల ప్రభావం వల్ల పంట దిగుబడులు తగ్గిపోతున్నాయి. అంతేకాదు, ఆహారోత్పత్తుల పోషక విలువలు సైతం క్షీణిస్తున్నాయి.
- **పురుగుల్లో మిత్ర పురుగులు వేరు :** పంటలు, మొక్కలకు నష్టం కలిగించే శత్రు పురుగులతో పాటు మేలు చేసే మిత్ర పురుగులూ ప్రకృతిలో ఉన్నాయి. పంటలు, మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే మిత్ర పురుగుల సంతతి పుష్కలంగా ఉండాలి. పంటల్లో పరపరాగ సంపర్కం, శత్రు పురుగుల నియంత్రణ, భూసారం, పోషకాల పునర్వినియోగం వంటి పనుల్లో మిత్ర పురుగుల పాత్ర కీలకం. దురదృష్టవశాత్తూ.. వీటి సంఖ్య గత 25–30 ఏళ్లలో ఏకంగా 80% తగ్గిపోయింది. పొలంలో ఒకే పంట వెయ్యటం, రసాయనాల వాడకం, భూతాపోన్నతి పుణ్యమే ఇది.


అక్షింతల పురుగు


క్రైసోపెర్ల

- **వేడి కొద్దీ పురుగు:** ఉష్ణోగ్రతలు పెరుగుతున్నకొద్దీ పంటలను ఆశించే పురుగుల సంఖ్య, తీవ్రత పెరుగుతోంది. అంతకు ముందు ఎరుగని ప్రాంతాలకు చీడపీడలు వ్యాపిస్తున్నాయి. పురుగుల జీవన చక్రాల్లో మార్పులొస్తున్నాయి. కొత్త ప్రాంతాల్లో చీడపీడలు వృద్ధి చెందడానికి అనువైన పరిస్థితులు నెలకొంటున్నాయి.
- వాతావరణ మార్పుల వల్ల పర్యావరణం అస్తవ్యస్తంగా మారిపోయింది. అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షాలు, కుంభవృష్టి, వడగళ్లు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల మధ్య దూరం, తీవ్రమైన వడగాడ్పులు.. వంటి అపసవ్యతలకు వాతావరణ మార్పులే కారణం.
- విత్తనాలు, మొక్కలను ఒక దేశం నుంచి మరో దేశానికి నిబంధనలకు విరుద్ధమైన వాణిజ్యం లేదా విదేశీ ప్రయాణికులు విత్తనాలు, మొక్కలను వెంట తేవటం వల్ల కొత్త చీడపీడలు సరికొత్త ప్రాంతాలకు వ్యాపిస్తూ పంటలకు, ఆర్థిక వ్యవస్థకు నష్టదాయకంగా పరిణమిస్తున్నాయి.
- ఇతర దేశాల నుంచి తరలి వచ్చే కొత్త పురుగుల వల్ల జీవ వైవిధ్యం నశిస్తోంది.

12న అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం

ప్రకృతి సేద్యంలో గణనీయంగా తగ్గుతున్న చీడపీడల నష్టం

30 రకాల 'నవధాన్య' (పచ్చిరొట్ట) పంటల సాగుతో మరింత ప్రయోజనం

వాతావరణ మార్పుతో చీడపీడల ఉధృతి

ప్రకృతి సాగే పరిష్కారం!


ప్రకృతి వ్యవసాయంలో మిరప పంట
రబీ అనంతరం పొలంలో 30 రకాల నవధాన్య పంటలు

మనం ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలను ఆరోగ్యంగా ఉంచాలి. 98% ప్రాణవాయువును మొక్కలే ఇస్తున్నాయి. 80% ఆహారం పంటల ద్వారానే వస్తోంది. భూతాపోన్నతి కారణంగా విజృంభిస్తున్న పురుగులు, తెగుళ్ల వల్ల దిగుబడి 40% మేరకు దెబ్బతింటున్నది. ఈ నష్టం విలువ ఏడాదికి 22,000 కోట్ల డాలర్లని ఎఫ్.ఎ.ఓ. లెక్కగట్టింది. మన దేశంలో కత్తెర పురుగు, నల్ల తామర పురుగు, రుగోస్ తెల్లదోమ.. వంటివి ఇందుకు ఉదాహరణలు.

అయితే, పొలాలు, పర్యావరణ వ్యవస్థలకున్న ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యంపై ఈ నష్టం తీవ్రత ఆధారపడి ఉంటుందని ఎఫ్.ఎ.ఓ. స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో.. సాగు పద్ధతి మార్చుకుంటే వీటి తీవ్రత తగ్గినట్లు ఏపీ రైతు సాధికార సంస్థ అధ్యయనంలో తేలింది. రసాయనిక వ్యవసాయంలో పురుగుల తీవ్రత, దిగుబడి నష్టం 50 శాతం పైగా ఉంటే.. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో 10% మాత్రమే. ప్రధాన పంట సాగుకు ముందు 30 రకాల పచ్చిరొట్ట (నవధాన్య) పంటలు సాగు చేసే రైతుల జీవవైవిధ్య క్షేత్రాల్లో ఒక్కో ఏడాది గడిచేకొద్దీ చీడపీడల బెడద అంతకంతకూ తగ్గుతోందని కూడా ఈ అధ్యయనం చెబుతోంది. ఈ నెల 12న 'అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా 'సాక్షి సాగుబడి' ప్రత్యేక కథనం.

మన దేశంలో ఇటీవల సంవత్సరాల్లో పంటలకు పెను నష్టం కలుగజేస్తున్న కత్తెర పురుగు, నల్ల తామర పురుగు, రుగోస్ తెల్లదోమ.. వంటి పురుగులే ఇందుకు ఉదాహరణలు. రసాయనిక వ్యవసాయం చేసే రైతులకు ఈ పురుగులు తీవ్ర నష్టం కలిగిస్తుండగా, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించే రైతుల పొలాల్లో ఈ పురుగుల తీవ్రత, నష్టం చాలా తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని అమలుచేస్తున్న రైతు సాధికార సంస్థ అధ్యయన వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. 30 రకాల పచ్చిరొట్ట పంటలు వేసిన తర్వాత ఆహార/వాణిజ్య పంటలు సాగు చేయటంయటం వల్ల వాతావరణ మార్పులను, చీడపీడలను తట్టుకొని నిలబడి మంచి దిగుబడులను ఇచ్చే శక్తి ప్రకృతి సేద్య క్షేత్రాలకు పెరుగుతున్నట్లు అర్థం అవుతున్నది.

రైతులు వచ్చే ఖరీఫ్‌లో సాగు చేసే ప్రధాన పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉండాలన్నా, భూసారం పెరగాలన్నా.. ఇప్పుడే పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలి. ఏ జనుమో, జీలుగో వేస్తే చాలదు.. ముప్పై పంటల విత్తనాలను చల్లేయాలి అంటున్నది ఏపీ రైతు సాధికార సంస్థ.

■ మిత్ర పురుగులే రైతుల సైన్యం

ప్రకృతి సేద్యం దిగుబడి సాధించటంతో పాటు అనేక ఇతర ప్రయోజనాలు కూడా నెరవేరుతున్నాయి. జీవవైవిధ్యం. ఒకే పంట వేయటం కాదు. అనేక పంటలు కలిపి సాగు చేయటం అనేది ప్రకృతి సేద్యంలో ఓ ముఖ్యమైన మూలసూత్రం. బహుళ పంటలు ఉన్న పొలంలో పురుగులు గానీ, తెగుళ్లుగానీ అదుపులో ఉంటాయి. రకరకాల పంటలున్న చేనులో అనేక రకాల మిత్ర పురుగులు మనుగడ సాధ్యపడుతుంది. రసాయనిక పురుగుమందులు వాడే పొలాల్లో శత్రు పురుగులతో పాటు ఈ మిత్ర పురుగులు కూడా నాశనమవుతాయి. కాబట్టి, చీడపీడలు ఉధృతం అవుతున్నాయి. ప్రకృతి వ్యవసాయంలో మిత్ర పురుగులే రైతుల సైన్యం. ప్రకృతి సేద్యం చేయటంతో పాటు.. ఏడాది పొడవునా ఇటువంటి బహుళ పంటలతో భూమిని కప్పి ఉంచితే (365 డేస్ గ్రీన్ కవర్) ఇంకా మంచిది. ఈ పద్ధతులు పాటించే ప్రకృతి సేద్య క్షేత్రాల్లో చీడపీడల సమస్య చాలా తక్కువగా కనిపిస్తోందని ఏపీ రైతు సాధికార సంస్థ తెలిపింది. ముఖ్యంగా, కత్తెర పురుగు, నల్లతామర వంటి పురుగుల విషయంలో ఇది ప్రస్ఫుటంగా నమోదైంది.

■ 90% తగ్గిన కత్తెర పురుగు

విజయనగరం, ప.గో., గుంటూరు జిల్లాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్న 49 ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, మరో 49 రసాయనిక వ్యవసాయ క్షేత్రాల్లో కత్తెర పురుగు తీవ్రతపై ఏపీ రైతు సాధికార సంస్థ అధ్యయనం చేసింది. కత్తెర పురుగు తీవ్రత పురుగుమందులు చల్లిన పొలాల్లో 5% మాత్రమే తగ్గితే, ప్రకృతి సేద్య పొలాల్లో 90% తగ్గిందని ఈ అధ్యయనంలో తేలింది.

పీఎండీఎస్‌తో తగ్గుతున్న చీడపీడల తీవ్రత

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా వానకు ముందే 30 రకాల ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు తదితర పంటల విత్తనాలను (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్– పీఎండీఎస్) వానకు ముందే విత్తితే.. భూమి సారవంతం అవుతుంది. భూమి తేమగా ఉంటే నేరుగా విత్తనాలు వేస్తున్నారు. తేమ లేకపోతే విత్తనాలకు మట్టి, ఘనజీవామృతం తదితరాలను పట్టించి 'విత్తన గుళికలు' (సీడ్ పెల్లెట్స్) తయారు చేసి వేసవిలోనే వానకు ముందే విత్తుతున్నారు. ఇది ఏపీలో



ముఖ్యంగా అనంతపురం జిల్లా కేంద్రంగా ప్రకృతి వ్యవసాయదారులు అనుసరిస్తున్న వినూత్న ఆవిష్కరణ. ఈ ఏడాది ఇతర జిల్లాల్లో కూడా ఈ పద్ధతిని రైతులకు ఆర్బీకేల ద్వారా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు పరిచయం చేస్తున్నారు.

వరుసగా రెండేళ్లు, అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు వేసవిలో 30 రకాల పీఎండీఎస్ పంటలు పండించిన పొలాల్లో ఆ తర్వాత సీజన్‌లో సాగు చేసిన 123 క్షేత్రాల్లో చీడపీడల బెడదపై అధ్యయనం చేశారు. మూడేళ్లుగా వేసవిలో పీఎండీఎస్ పంటలు సాగు చేసిన పొలాల్లో అన్ని రకాల చీడపీడల బెడద రసాయనిక పొలాలతో పోల్చినప్పుడు 66 శాతం తగ్గిపోయినట్లు గుర్తించటం విశేషం.

18-19 తేదీల్లో చిరుధాన్యాలపై పులివెందులలో శిక్షణ

చిరుధాన్యాల శుద్ధి, విలువ జోడింపు, మార్కెటింగ్‌పై ఈ నెల 18–19 తేదీల్లో పులివెందులలోని ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీ ఆవరణలో ఔత్సాహికులకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం) శిక్షణ ఇవ్వనుందని లైవ్‌లిహుడ్ ఇంక్యుబేషన్ సెంటర్ కోర్సు డైరెక్టర్ డా. నబీరసూల్ తెలిపారు. ఎఫ్.పి.ఓలు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, చిరుధాన్యాల వ్యాపారులు, గ్రామీణ యువతకు ఇది ఉపయోగకరం. భోజన వసతి సదుపాయాలు ఉన్నాయి. ఫీజు రూ. 5 వేలు. వివరాలకు.. డా. నబీరసూల్ – 630297 72210

■ నల్ల తామర: ఇక్కడ 9.87% అక్కడ 57%

లక్షల ఎకరాల్లో మిరప పంటకు గతంలో నష్టం కలిగింది. రసాయనిక పురుగుమందులు ఎన్ని వాడినా నల్ల తామర తగ్గలేదు. కానీ ప్రకృతి వ్యవసాయంలో నియంత్రణలోకి వచ్చింది. ఏపీ రైతుసాధికార సంస్థ కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లోని 70 ప్రకృతి వ్యవసాయ మిరప తోటల్లో, 73 రసాయనిక మిరప తోటల్లో అధ్యయనం చేసింది. నల్లతామర కలిగించిన నష్టం ప్రకృతి సేద్య మిరప పొలాల్లో 9.87% కాగా, రసాయనిక మిరప పొలాల్లో 57.53% వరకు ఉందని గుర్తించారు. ప్రకృతిసేద్యం చేస్తున్న మిరప పొలాల్లో అక్షింతల పురుగులు, క్రైసోపెర్ల అనే రెక్కల పురుగులు వంటి మిత్ర పురుగులు విస్తారంగా నల్లతామర పురుగుల్ని తింటూ నియంత్రించినట్లు కనుగొన్నారు. రసాయనిక పురుగుమందులు చల్లే మిరప పొలాల్లో ఇవి కనిపించలేదు.

■ పంటలకొద్దీ మిత్రపురుగులు

పీఎండీఎస్‌లో నవధాన్య పంటలుగా ఎన్ని ఎక్కువ పంటలు సాగు చేస్తే ఆ తర్వాత సీజన్‌లో మిత్రపురుగుల సంఖ్య ఎక్కువగా ఉండి చీడపీడల బెడద తగ్గినట్లు రైతు సాధికార సంస్థ గుర్తించింది. వేర్వేరు జిల్లాల్లో కొన్ని పొలాల్లో 27 రకాలు, మరికొన్ని పొలాల్లో 19 రకాలు, ఇంకొన్ని పొలాల్లో 9 రకాల నవధాన్య పంటలను సాగు చేయించారు. 9,19 రకాలు సాగు చేసిన పొలాల్లో కన్నా 27 రకాలు సాగు చేసిన పొలాల్లో మిత్ర పురుగుల సంఖ్య అత్యధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఎన్ని ఎక్కువ పంటలు సాగు చేస్తే అన్ని ఎక్కువ మిత్రపురుగులుంటాయి.

రైతు దేవుళ్ల చేతుల్లోనే భవిత!

50–60 ఏళ్ల విషపూరిత వ్యవసాయం వల్ల మన భూములు, వాతావరణం, గాలి, నీరు నాశనమయ్యాయి. క్లైమెట్ ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయి. ఆరో ప్రళయం రాబోతోంది. పోషకార/ఆహార భద్రతకూ ముప్పు రానుంది. దీని నుంచి రక్షించగల శక్తి ఒక్క రైతు చేతుల్లోనే ఉంది. రసాయనిక వ్యవసాయం వల్ల వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించడంతో పాటు యావత్తు భూగోళాన్ని చల్లబరిచే శక్తి కూడా ప్రకృతి/పునరజ్జీవ వ్యవసాయానికి ఉంది. రసాయనాలు వాడకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేయటంతో పాటు.. 30 రకాల నవధాన్య (పీఎండీఎస్) పంటల సాగును వేసవిలో, పంట సీజన్లకు మధ్యలో ప్రతి పొలంలోనూ సాగు చేయాలి. ఇన్ని పంటలు ఎందుకంటే ప్రతి పంట మొక్క వేర్ల దగ్గర వేర్వేరు రకాల మేలు చేసే సూక్ష్మజీవరాశి పెరుగుతోంది. ఎన్ని ఎక్కువ పంటలు వేస్తే అన్ని ఎక్కువ రకాల సూక్ష్మజీవరాశి తిరిగి భూమిలోకి చేరుతున్నది. మట్టిలో సూక్ష్మ జీవుల వైవిధ్యం ఎంత ఎక్కువగా ఉంటే మన భూమి అంత సారవంతమవుతోంది. అంత శక్తివంతమవుతోంది. అంతగా చీడపీడల బెడద తగ్గుతుంది. కరువును, ప్రతికూల పరిస్థితులను తట్టుకొని నిలబడి 20–30% అధిక దిగుబడులు వస్తున్నాయి. ప్రతి పొలంలో పీఎండీఎస్ పంటలు సాగు చేయాలి. వాన నీరు పూర్తిగా పొలాల్లో ఎక్కడికక్కడే పూర్తిగా ఇంకుతుంది. ఇది అనంతపురం రైతు దేవుళ్ల అద్భుత ఆవిష్కరణ. ఈ ఏడాది ఏపీలో ఇతర జిల్లాల్లో కూడా దీన్ని అమలు చేస్తున్నాం. 10 వేల మంది రైతులను మాస్టర్ ట్రైనర్లుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యం. అనేక ఇతర రాష్ట్రాలతో పాటు ప్రపంచ దేశాలు కూడా మన వైపు చూస్తున్నాయి.



- టి. విజయకుమార్, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ https://apcnf.in/

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



అర్జున్‌కు మూడో పరాజయం

టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో పరాజయం చవిచూశాడు. స్వీడన్‌లో సోమవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో అర్జున్ 51 ఎత్తుల్లో జోర్డాన్ వాన్ ఫోరీస్ట్ (నెదర్లాండ్స్) చేతిలో ఓడిపోయాడు. భారత సంతతికి చెందిన అమెరికా గ్రాండ్‌మాస్టర్ అభిమన్యు మిశ్రా, భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ మధ్య జరిగిన గేమ్ 42 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ఐదో రౌండ్ తర్వాత గుకేశ్ మూడు పాయింట్లతో మూడో స్థానంలో, అర్జున్ రెండు పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నారు.

పోరాడి ఓడిన సౌరవ్ ఘోషాల్



ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ సౌరవ్ ఘోషాల్ పోరాటం ముగిసింది. షికాగోలో జరుగుతున్న ఈ టోర్నీలో సౌరవ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 11-9, 11-4, 6-11, 3-11, 10-12తో ప్రపంచ నంబర్‌వన్ డీగో ఇలియాస్ (పెరూ) చేతిలో ఓడిపోయాడు. 36 ఏళ్ల సౌరవ్ నిర్ణాయక ఐదో గేమ్‌లో స్కోరు 10-10 వద్ద అనవసర తప్పిదాలు చేసి వరుసగా రెండు పాయింట్లు చేజార్చుకొని ఓటమిని ఖరారు చేసుకున్నాడు.

వెర్‌స్టాపెన్‌కు మూడో గెలుపు



ఫ్లోరిడా: ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో తన ఆధిపత్యం చాటుకుంటూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మూడో విజయం నమోదు చేశాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన మయామి గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 57 ల్యాప్‌ల ఈ రేసును తొమ్మిదో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా గంటా 27 నిమిషాల 38.241 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. రెడ్‌బుల్ జట్టుకే చెందిన సెర్జియో పెరెజ్ రెండో స్థానంలో నిలిచాడు. అలోన్సో (ఆస్టన్ మార్టిన్) మూడో స్థానంలో, రసెల్ (మెర్సిడెస్) నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సీజన్‌లో ఐదు రేసులు జరగ్గా... ఐదింటిలోనూ రెడ్‌బుల్ డ్రైవర్లే విజేతగా నిలువడం విశేషం. డ్రైవర్స్ చాంపియన్‌షిప్ రేసులో వెర్‌స్టాపెన్ (119 పాయింట్లు), పెరెజ్ (105 పాయింట్లు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.


అల్‌కరాజ్‌కే టైటిల్



మాడ్రిడ్: ఈ ఏడాది తన జోరు కొనసాగిస్తూ స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ నాలుగో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో 20 ఏళ్ల అల్‌కరాజ్ వరుసగా రెండో ఏడాది చాంపియన్‌గా నిలిచాడు. జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)తో జరిగిన ఫైనల్లో అల్‌కరాజ్ 6-4, 3-6 6-3తో గెలిచాడు. విజేతగా నిలిచిన అల్‌కరాజ్‌కు 11,05,265 యూరోల (రూ. 10 కోట్ల 12 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రాఫెల్ నాదల్ (స్పెయిన్) తర్వాత ఈ టోర్నీ చరిత్రలో వరుసగా రెండేళ్లు టైటిల్ నెగ్గిన రెండో ప్లేయర్‌గా అల్‌కరాజ్ గుర్తింపు పొందాడు. ఈ విజయంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌లో ఉన్న అల్‌కరాజ్ రోమ్ ఓపెన్‌లో బరిలోకి దిగితే మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటాడు.

రసెల్ ధమాకా...

- చివరి బంతికి కోల్‌కతా విజయం
- రాణించిన రింకూ సింగ్, రాణా
- ధావన్ శ్రమ వృథా
- పంజాబ్‌కు ఆరో ఓటమి



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రసెల్

కోల్‌కతా: ఆంద్రీ రసెల్ (23 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అడుగంటిన కోల్‌కతా ఆశలకు సిక్సర్లతో జీవం పోశాడు. మళ్లీ ఆఖరి ఓవర్ డ్రామా కనిపించినా... నైట్‌రైడర్స్ 5 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. మొదట పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. ధావన్ (47 బంతుల్లో 57; 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. అనంతరం కోల్‌కతా 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసి గెలిచింది. నితీశ్ రాణా (38 బంతుల్లో 51; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించాడు.

ధావన్ ఫిఫ్టీతో...

కోల్‌కతా పవర్‌ప్లేలోనే ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (12), రాజపక్స (0) వికెట్లను కోల్పోయింది. వీరిద్దరిని హర్షిత్ రాణా పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో మిగతా జట్టు సభ్యుల నుంచి సహకారం కరువైనా... శిఖర్ ధావన్ జట్టును నడిపించాడు. లివింగ్‌స్టోన్ (9 బంతుల్లో 15; 3 ఫోర్లు), జితేశ్ శర్మ (18 బంతుల్లో 21; 2 సిక్సర్లు) తక్కువే చేసినా... ధావన్ (41 బంతుల్లో) ఫిఫ్టీతో జట్టు స్కోరు 100 పరుగులు దాటింది. జితేశ్, ధావన్ నాలుగో వికెట్‌కు 53 పరుగులు జోడించారు. పరుగుల వేగం పెరగాల్సిన దశలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పిన్‌కు పంజాబ్ డీలా పడింది. 106/3 స్కోరు వద్ద పటిష్టంగా కనిపించిన జట్టు స్వల్ప వ్యవధిలో 4 వికెట్లను కోల్పోయింది. స్యామ్ కరన్ (4), రిషి ధావన్ (11 బంతుల్లో 19; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా ఆకట్టుకోలేదు. ఇలాంటిస్థితిలో షారుఖ్ (8 బంతుల్లో 21 నాటౌట్, 3 ఫోర్లు, 1 సిక్స్), హర్‌ప్రీత్ బ్రార్ (9 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటితో ఆఖరి 16 బంతుల్లో 40 పరుగులు చేయగలిగింది.

కెప్టెన్ ఇన్నింగ్స్...

జేసన్ రాయ్ (24 బంతుల్లో 38; 8 ఫోర్లు) బౌండరీలతో కోల్‌కతా ఇన్నింగ్స్ వేగంగా సాగింది. అయితే గుర్బాజ్ (12 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్) వికెట్ పారేసుకోగా... కోల్‌కతా ఇన్నింగ్స్ కూడా కెప్టెన్ నితీశ్ రాణా అర్ధసెంచరీతోనే నడించింది. రాయ్ దూకుడుకు హర్‌ప్రీత్ బ్రేకులేయగా, నితీశ్... వెంకటేశ్ (11)తో కలిసి జట్టు స్కోరును వంద పరుగులు దాటించింది. మధ్యలో పంజాబ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పరుగుల వేగం తగ్గింది. 16వ ఓవర్లో రాణా అవుటయ్యాక ఒత్తిడి పెరిగింది. 12 బంతుల్లో 26 పరుగుల సమీకరణం ఇరు జట్లకూ అవకాశమిచ్చింది. కానీ స్యామ్ కరన్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో రసెల్ 3 భారీ సిక్సర్లతో 20 పరుగులొచ్చాయి. దీంతో 6 బంతుల్లో 6 పరుగుల సమీకరణం కోల్‌కతావైపే మొగ్గింది. అయితే 2 పరుగుల దూరంలో ఐదో బంతికి రసెల్ రనౌట్ కావడంతో కాస్త ఉత్కంఠ రేకెత్తించినా... అర్ష్ దీప్ వేసిన చివరి బంతిని రింకూ సింగ్ (10 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీకి తరలించి గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	11	6	4	1	13	0.409
లక్నో	11	5	5	1	11	0.294
రాజస్తాన్	11	5	6	0	10	0.388
కోల్‌కతా	11	5	6	0	10	-0.079
బెంగళూరు	10	5	5	0	10	-0.209
పంజాబ్	11	5	6	0	10	-0.441
ముంబై	10	5	5	0	10	-0.454
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	10	4	6	0	8	-0.529

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై x బెంగళూరు (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రాన్ (సి) గుర్బాజ్ (బి) హర్షిత్ 12; ధావన్ (సి) వైభవ్ (బి) నితీశ్ రాణా 57; రాజపక్స (సి) గుర్బాజ్ (బి) హర్షిత్ 0; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వరుణ్ 15; జితేశ్ (సి) గుర్బాజ్ (బి) వరుణ్ 21; స్యామ్ కరన్ (సి) గుర్బాజ్ (బి) సుయశ్ 4; రిషి ధావన్ (బి) వరుణ్ 19; షారుఖ్ (నాటౌట్) 21; హర్‌ప్రీత్ బ్రార్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 179. వికెట్ల పతనం:** 1-21, 2-29, 3-53, 4-106, 5-119, 6-139, 7-139. **బౌలింగ్:** వైభవ్ 3-0-32-0, హర్షిత్ 3-0-33-2, రసెల్ 1-0-19-0, వరుణ్ 4-0-26-3, సుయశ్ 4-0-26-1, నరైన్ 4-0-29-0, నితీశ్ రాణా 1-0-7-1.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) షారుఖ్ (బి) హర్‌ప్రీత్ 38; గుర్బాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఎలిస్ 15; నితీశ్ రాణా (సి) లివింగ్‌స్టోన్ (బి) చహర్ 51; వెంకటేశ్ (సి) లివింగ్‌స్టోన్ (బి) చహర్ 11; రసెల్ (రనౌట్) 42; రింకూ సింగ్ (నాటౌట్) 21; శార్దుల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1-38, 2-64, 3-115, 4-124, 5-178. **బౌలింగ్:** రిషి ధావన్ 2-0-15-0, అర్ష్‌దీప్ సింగ్ 4-0-39-0, ఎలిస్ 4-0-29-1, స్యామ్ కరన్ 3-0-44-0, లివింగ్‌స్టోన్ 2-0-27-0, హర్‌ప్రీత్ 1-0-4-1, రాహుల్ చహర్ 4-0-23-2.

కేఎల్ రాహుల్ స్థానంలో ఇషాన్ కిషన్



ముంబై: తొడ కండరాల గాయంతో ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు దూరమైన భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను టీమిండియాలోకి ఎంపిక చేశారు. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జూన్ 7 నుంచి 11 వరకు లండన్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ జరుగుతుంది. జార్ఖండ్‌కు చెందిన 24 ఏళ్ల ఇషాన్ కిషన్ భారత్ తరఫున 14 వన్డేలు, 27 టి20 మ్యాచ్‌లు ఆడాడు. ప్రస్తుత ఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్లో పాల్గొనే భారత జట్టు సభ్యుడైన బౌలర్ జైదేవ్ ఉనాద్కట్ భుజం గాయంతో బాధపడుతున్నాడు. ఉనాద్కట్ ఫైనల్‌కు అందుబాటులో ఉంటాడా లేదా అనేది త్వరలో తేలుతుంది. స్టాండ్‌బై ఆటగాళ్లుగా రుతురాజ్ గైక్వాడ్, ముకేశ్ కుమార్, సూర్యకుమార్ యాదవ్‌లను బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది.

ప్రిక్వార్టర్స్‌లో సచిన్



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సోమవారం భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సచిన్ సివాచ్ (54 కేజీలు) శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... నవీన్ కుమార్ (92 కేజీలు), గోవింద్ సహని (48 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్ దాటలేకపోయారు. తొలి రౌండ్ బౌట్‌లో ప్రపంచ మాజీ యూత్ చాంపియన్ సచిన్ 5-0తో సెర్గీ నొవాక్ (మాల్డోవా)పై గెలుపొందగా... నవీన్ 0-5తో రేయస్ (స్పెయిన్) చేతిలో... గోవింద్ 0-5తో అల్ఖావెర్డోవి సాఖిల్ (జార్జియా) చేతిలో ఓడిపోయారు.

కోట్ల మంది టీవీల ముందు...

ముంబై: ఐపీఎల్‌కున్న క్రేజ్ ఏటికేడు పెరిగిపోతోంది. లీగ్‌పై కన్నేసే ప్రేక్షకులు అంతకంతకూ పెరిగిపోతున్నారు. స్టార్ స్పోర్ట్స్ చానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం అవుతున్న మ్యాచ్‌ల్ని చూసేందుకు కోట్ల మంది టీవీలకు అతక్కుపోతున్నారు. ఈ సీజన్‌లో తొలి 38 మ్యాచ్‌లకుగాను 26 మ్యాచ్‌లని కనీసం 3 కోట్ల మందికి పైగా చూశారు. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్, మాజీ చాంపియన్ చెన్నైల మధ్య ప్రారంభ పోరునైతే ఏకంగా 5.60 కోట్ల మంది వీక్షించినట్లు స్టార్ స్పోర్ట్స్ గణాంకాల ద్వారా తెలిసింది. ధోని, కోహ్లిలు బరిలోకి దిగిన చెన్నై–బెంగళూరు, చెన్నై–కోల్‌కతా, చెన్నై–లక్నోల మధ్య జరిగిన మ్యాచ్‌లకు 5 కోట్ల మంది పైచిలుకు తిలకించారు. అయితే ఇవీ కేవలం టీవీ ప్రేక్షకులకు సంబంధించిన గణాంకాలే! ఎందుకంటే 'జియో సినిమా' యాప్‌లో చూసిన వారిని కలుపుకొంటే ఈ సంఖ్య ఇంకెన్ని కోట్లకు చేరుతుందో!

కివీస్‌కు ఊరట విజయం

వన్డే సిరీస్‌ను 4–1తో గెలుచుకున్న పాక్



కరాచీ: పాకిస్తాన్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో క్లీన్‌స్వీప్ కాకుండా న్యూజిలాండ్ పరువు కాపాడుకుంది. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన న్యూజిలాండ్ చివరిదైన ఐదో వన్డేలో 47 పరుగుల తేడాతో గెలిచి ఊరట చెందింది. బాబర్ ఆజమ్ కెప్టెన్సీలోని పాకిస్తాన్ ఈ సిరీస్‌ను 4–1తో సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 49.3 ఓవర్లలో 299 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ విల్ యంగ్ (87; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ టామ్ లాథమ్ (59; 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. పాక్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది మూడు వికెట్లు తీయగా... ఉసామా మీర్, షాదాబ్ ఖాన్ రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు. 300 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ 46.1 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన బాబర్ ఆజమ్ ఒక్క పరుగుకే అవుటయ్యాడు. ఇఫ్తికార్ అహ్మద్ (72 బంతుల్లో 94 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆగా సల్మాన్ (57; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా ఫలితం లేకపోయింది. కివీస్ బౌలర్లలో షిప్లే, రచిన్ రవీంద్ర మూడు వికెట్ల చొప్పున తీశారు.

సినిమా

భాయ్ ముంబైలో అడుగుపెట్టారు!


రజనీ కాంత్

రజనీకాంత్ కెరీర్‌లో గుర్తుంచుకోదగ్గ చిత్రాల్లో 'బాషా' ఒకటి. పాతికేళ్ల క్రితం వచ్చిన ఈ సినిమా ఫ్లాష్‌బ్యాక్‌లో ముంబైలో 'మాణిక్ బాషా'గా కనిపించారు రజనీకాంత్. బాషా భాయ్‌గా రజనీ నటన, స్టయిల్‌ని మరచిపోలేం. ఇప్పుడు మొయిద్దీన్ భాయ్‌గా రజనీ కనిపించనున్న చిత్రం 'లాల్ సలామ్'. ముంబై బ్యాక్‌డ్రాప్ ఉన్న ఈ చిత్రాన్ని రజనీ పెద్ద కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో రజనీ చేస్తున్న మొయిద్దీన్ భాయ్ పాత్ర కీలకం. 'అందరి ఫేవరెట్ అయిన భాయ్ మళ్లీ ముంబైలో అడుగుపెట్టారు' అంటూ ఆయన లుక్‌ని సోమవారం రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో రజనీకాంత్ రాకింగ్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను అలరించనున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: విష్ణు రామస్వామి.


శ్రియ

జోడీ సెట్


షాహిద్ కపూర్


పూజా హెగ్డే

షాహిద్ కపూర్–పూజా హెగ్డే జోడీ ఒక సినిమాకి సెట్ అయ్యిందన్నది బాలీవుడ్ తాజా ఖబర్. రోషన్ ఆండ్రూస్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రానికి 'కోయీ షాక్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. మర్డర్ మిస్టరీ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ ఈ నెలలోనే ఆరంభం కావాల్సింది. అయితే ముందుగా ప్రారంభోత్సవం జరిపి, ఆ తర్వాత కొంత గ్యాప్ తీసుకుని షూటింగ్ ప్లాన్ చేస్తారట. ఈ చిత్రాన్ని సిద్ధార్థ్ రాయ్ కపూర్ నిర్మించనున్నారు. కాగా, ఇటీవల పూజా హెగ్డే 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' చిత్రంలో నటించిన విషయం తెలిసిందే. తాజాగా హిందీలో ఆమె మూడు చిత్రాలు సైన్ చేశారని, వాటిలో 'కోయీ షాక్' ఒకటని సమాచారం.

ఆ విషయంలో నేను లక్కీ

''పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలు, సంగీతం కూడా చాలా ముఖ్యం. కానీ, ప్రస్తుతం ఎంతోమంది తల్లిదండ్రులు కేవలం చదువు, ర్యాంకులు అంటూ పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పిల్లల్ని చదువుతో పాటు సంగీతం, ఆటపాటల్లోనూ ప్రోత్సహించాలని చెప్పే చిత్రమే 'మ్యూజిక్ స్కూల్'' అన్నారు శ్రియ. పాపారావు బియ్యాల స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'మ్యూజిక్ స్కూల్'. శ్రియ, శర్మాన్ జోషి, షాన్ ప్రధాన పాత్రల్లో నటించారు. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఈ నెల 12న ఈ చిత్రం విడుదల కానుంది. తెలుగులో 'దిల్' రాజు, హిందీలో 'పీవీఆర్' సినిమాస్ 'మ్యూజిక్ స్కూల్'ని రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో శ్రియ చెప్పిన విశేషాలు. • ఐఏఎస్‌గా ఉన్నత స్థానంలో ఉన్న పాపారావుగారు సినిమాపై ప్యాషన్‌తో ఐదారు కథలు సిద్ధం చేసుకున్నారు. వాటిలో 'మ్యూజిక్ స్కూల్' ఒకటి. ఈ కథ వినగానే ఎగ్జైటింగ్‌గా అనిపించడంతో నటించేందుకు ఓకే చెప్పాను. 'సంతోషం' చిత్రంలో నేను సంగీతం నేర్చుకునే స్టూడెంట్‌గా చేశా. 'మ్యూజిక్ స్కూల్'లో సంగీతం నేర్పించే టీచర్ పాత్ర నాది. • పిల్లల్లో ఉండే ప్రతిభని తల్లితండ్రులు గుర్తించి, ప్రోత్సహించాలి. ఆ విషయంలో నేను లక్కీ. మా తల్లితండ్రులు ఏ విషయంలోనూ నాకు అడ్డు చెప్పకుండా ప్రోత్సహించారు. మా అమ్మాయి రాధను కూడా చదువుతో పాటు సంగీతం, డ్యాన్స్, ఆటల్లో ప్రోత్సహిస్తాను. పాపారావుగారు ఈ మూవీని అద్భుతంగా తీశారు. ఈ సినిమాకి ఇళయరాజాగారి సంగీతం హైలైట్. • 'ఇష్టం' (2001) సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి వచ్చాను. ఇన్నేళ్ల కెరీర్‌లో ఎంతోమంది దర్శకులతో పనిచేశా.. ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేశా.. ఇది నా అదృష్టంగా భావిస్తున్నా. నేను చేసే ప్రతి పాత్ర డ్రీమ్ రోల్‌లాంటిదే. 'ఆర్ఆర్ఆర్' చిత్రం షూటింగ్‌లో ఐదురోజులు మాత్రమే పాల్గొన్నాను. నా పాత్ర నిడివి తక్కువే అయినా ప్రాధాన్యత ఉంటుంది. ప్రతి క్యారెక్టర్‌ను సవాలుగా తీసుకుని చేస్తాను. ప్రస్తుతం రెండు కొత్త సినిమాల్లో నటిస్తున్నాను.

కొంచెం ముందే మేమ్ ఫేమస్


'మేమ్ ఫేమస్' యూనిట్‌తో విజయ్

సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్ర పోషించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య, సిరి రాసి కీలక పాత్రల్లో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించారు. ఈ చిత్రాన్ని జూన్ 2న విడుదల చేయనున్నట్లు ఇటీవల మేకర్స్ ప్రకటించారు. అయితే కొంచెం ముందే ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు హీరో విజయ్ దేవరకొండ ద్వారా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియోలో ''ట్రాక్టర్ లా పోస్తాం డీజిల్.. విజయ్ అన్న ఒచ్చిండు కొట్టుర్రా విజిల్' అంటూ టీమ్ చెప్పగా, 'వర్షం పడుతోంది చమ్ చమ్ చమ్... మే 26న మేమ్ ఫేమస్‌కి అందరూ కమ్ కమ్ కమ్' అంటూ విజయ్ దేవరకొండ తనదైన స్టైల్‌లో చెప్పారు.

సైయారా.. సైయారా...


తేజ్, బ్రహ్మానందం

తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా నటించిన చిత్రం 'మాధవే మధుసూదన'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. వికాస్ బాడిస సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సైయారా.. సైయారా...' అంటూ సాగే రెండవ లిరికల్ సాంగ్‌ని ప్రముఖ నటుడు డా. బ్రహ్మానందం విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఈ పాట చూశాను.. బాగుంది. తేజ్ డ్యాన్స్ బాగా చేశాడు.. తనకి మంచి భవిష్యత్ ఉంటుంది. రామచంద్ర రావు ఇంత బాగా డైరెక్షన్ చేస్తాడని అనుకోలేదు.. బాగా తీశాడు'' అన్నారు.

ఎందుకు శత్రువులవుతారు?


నీలకంఠ, సాయి రోనక్

'షో, విరోధి, మిస్సమ్మ, సదా మీ సేవలో' వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న నీలకంఠ కొంత గ్యాప్ తర్వాత తెరకెక్కిస్తున్న చిత్రం 'సర్కిల్'. ఎవరు, ఎప్పుడు, ఎందుకు శత్రువులవుతారో అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఆరా ప్రొడక్షన్స్‌పై రూపొందుతోన్న ఈ చిత్రంలో సాయి రోనక్, బాబా భాస్కర్, అర్షిన్ మెహతా, రిచా పనై, నైనా, పార్థవ సత్య నటిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: ఎం.వి శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డ గడ.

అన్నీ మంచి శకునములే హాయినిస్తుంది

– అల్లు అరవింద్


అశ్వినీదత్, సంతోష్ శోభన్, అల్లు అరవింద్, మాళవికా నాయర్, కె. రాఘవేంద్రరావు, నందినీ రెడ్డి

''రాఘవేంద్రరావు, అశ్వినీదత్‌గార్లతో నాది 30 ఏళ్లు పైబడిన స్నేహం. స్వప్న, ప్రియాంక నా కూతుళ్లలాంటివారు. నేను, దత్‌గారు యాభై ఏళ్లుగా పరిశ్రమలో ఉన్నప్పటికీ ఇవాళ మా పిల్లల వల్ల ఇంకా ఎక్కువ షైన్ అవుతున్నాం. 'అన్నీ మంచి శకునములే' మనందరికీ హాయి ఇస్తుందనే నమ్మకం ఉంది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చెయ్యి చెయ్యి కలిపేద్దాం..' అంటూ సాగే నాలుగో పాటను డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు, నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వినీదత్ రిలీజ్ చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను శ్రీ కృష్ణ, వేణు శ్రీరంగం, సందీప్, చైత్ర అంబడిపూడి పాడగా, బృందా మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ–''అన్నీ మంచి శకునములే' మూవీ 'పెళ్లి సందడి' అంత పెద్ద విజయం సాధిస్తుంది'' అన్నారు ''రాఘవేంద్రరావు, అల్లు అరవింద్, అశ్వినీదత్‌గార్లు నాకు మంచి శకునం'' అన్నారు నందినీ రెడ్డి. ''చిన్నప్పటినుంచి ఈ ముగ్గుర్ని (రాఘవేంద్రరావు, అల్లు అరవింద్, అశ్వినీదత్) చూస్తూ పెరిగాం .. వీరిని ఒకే వేదికపై చూడటం ఆనందంగా ఉంది'' అన్నారు నిర్మాతలు ప్రియాంకా దత్, స్వప్నా దత్.

'బలగం'కి మరో రెండు అవార్డులు

- ఉత్తమ నటుడు ప్రియదర్శి
- ఉత్తమ సహాయ నటుడు కేతిరి సుధాకర్ రెడ్డి


ప్రియదర్శి


సుధాకర్ రెడ్డి

ఓ కుటుంబ పెద్ద చనిపోయిన నేపథ్యంలో ఆ కుటుంబ సభ్యులు, అతని సన్నిహితుల భావోద్వేగం, అనుబంధాలతో సాగే 'బలగం'కి విశేష ఆదరణ లభించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో అవార్డులు దక్కాయి. తాజాగా 'స్వీడిష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2023'లో 'బలగం' చిత్రానికి గాను ఉత్తమ నటుడుగా ప్రియదర్శి, ఉత్తమ సహాయ నటుడుగా కేతిరి సుధాకర్ రెడ్డి (కొమురయ్య పాత్రధారి) అవార్డులను గెలుచుకున్నారు. వేణు ఎల్డండి దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే.

వారి నమ్మకం నాకు ధైర్యాన్ని ఇచ్చింది

– ఐశ్వర్యా రాజేష్


ఎస్ఆర్ ప్రభు, ఐశ్వర్యా రాజేష్, నెల్సన్, ఐశ్వర్యా దత్తా

''ఫర్హానా' నాకు స్పెషల్ మూవీ. నాపై నమ్మకంతో ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ్‌లో భారీ స్థాయిలో విడుదల చేస్తున్న నిర్మాతలకు కృతజ్ఞతలు. ఓ లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ మూడు భాషల్లో విడుదల కావడం పెద్ద విషయం. డైరెక్టర్, నిర్మాతలు నాపై పెట్టుకున్న నమ్మకం నాకు ధైర్యాన్ని ఇచ్చింది'' అన్నారు ఐశ్వర్యా రాజేష్. నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వంలో ఐశ్వర్యా రాజేష్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఫర్హానా'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఐశ్వర్యా రాజేష్ మాట్లాడుతూ–''సినిమాని సెలబ్రేట్ చేసే ఇండస్ట్రీ టాలీవుడ్. ఇక్కడ మంచి కంటెంట్‌ని సెలబ్రేట్ చేస్తారు. ఆ నమ్మకంతో 'ఫర్హానా'ని తెలుగులో రిలీజ్ చేస్తున్నాం''అన్నారు. ''ఫర్హానా' నా మూడో చిత్రం. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు నన్ను పరిచయం చేస్తున్న నిర్మాతలకు కృతజ్ఞతలు. ఇది పక్కా తెలుగు సినిమాలా ఉంటుంది'' అన్నారు నెల్సన్ వెంకటేశన్. ''గత ఏడాది మేం రిలీజ్ చేసిన 'ఒకే ఒక జీవితం'ని ప్రేక్షకులు ఆదరించారు. ఇప్పుడు 'ఫర్హానా'తో వస్తున్నాం'' అన్నారు నిర్మాత ఎస్ఆర్ ప్రభు. ''ఫర్హానా' ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకర్, నటి ఐశ్వర్యా దత్తా.

పొలిమేరలో...


డా. అనిల్, రాజేష్, శ్రీనివాస్ యాదవ్

''మా ఊరి పొలిమేర' పోస్టర్ బాగుంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు తెలంగాణ రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌరు గణబాబు సమర్పణలో డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరీకృష్ణ నిర్మించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. సత్యం రాజేష్, డా. కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి, అక్షత, బాలాదిత్య, సాహితి దాసరి, రవి వర్మ, చిత్రం శ్రీను ముఖ్య తారలు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రిలీజ్ చేశారు. ''మా ఊరి పొలిమేర' చూసి ఎగ్జయిట్ అయ్యాను. ఆ సినిమా సీక్వెల్‌ను మా బ్యానర్‌లో చేసినందుకు డా. అనిల్ విశ్వనాథ్ గారికి ధన్యవాదాలు'' అన్నారు గౌరీకృష్ణ.

సాక్షి బిజినెస్

మంగళవారం
9-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	710	61,764
నిఫ్టీ ▲	195	18,264

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,228	▽	7
డోజోన్స్	33,599	▽	75
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,778	▲	76
డాక్స్	15,953	▽	8
షాంఘై	3,395	▲	61
నికాయ్	28,950	▽	208

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో — ముంబై	
బంగారం (24 క్యారట్)	61,169
బంగారం (22 క్యారట్)	60,925
వెండి (కిలో)	76,315

కెనరా బ్యాంక్ లాభం దూకుడు

- క్యూ4లో రూ. 3,337 కోట్లు
- షేరుకి రూ. 12 డివిడెండ్

ముంబై: ప్రభుత్వ రంగ సంస్థ కెనరా బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 74 శాతం జంప్‌చేసి రూ. 3,337 కోట్లకు చేరింది. ప్రొవిజన్లు తగ్గడం, అధిక వడ్డీ ఆదాయం ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 1,919 కోట్లు ఆర్జించింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం రూ. 6,125 కోట్ల నుంచి రూ. 11,255 కోట్లకు దూసుకెళ్లింది. వాటాదారులకు బ్యాంక్ బోర్డు షేరుకి రూ. 12 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 23 శాతం పుంజుకుని రూ. 8,617 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 0.14 శాతం



బలపడి 3.07 శాతానికి చేరాయి. ఇతర ఆదాయం 7 శాతం వృద్ధితో రూ. 4,776 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 7.51 శాతం నుంచి 5.35 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 16.68 శాతంగా నమోదైంది. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,727 కోట్ల నుంచి రూ. 3,098 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో కెనరా బ్యాంక్ షేరు 1.4 శాతం నష్టంతో రూ. 314 వద్ద ముగిసింది.

దివాలా పిటిషన్‌ను త్వరగా తేల్చండి

ఎన్‌సీఎల్‌టీకి గో ఫస్ట్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న విమానయాన సంస్థ గో ఫస్ట్ తాము స్వచ్ఛందంగా దాఖలు చేసిన దివాలా పిటిషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి విజ్ఞప్తి చేసింది. విమానాలను లీజుకిచ్చిన సంస్థలు (లెస్సర్లు) వాటిని డీరిజిస్టర్ చేయడం మొదలుపెట్టాయని తెలిపింది. దీనితో గో ఫస్ట్ అభ్యర్థనను సత్వరం పరిశీలించేందుకు ఎన్‌సీఎల్‌టీ బెంచ్ అంగీకరించింది. 36 విమానాల రిజిస్ట్రేషన్‌ను ఉపసంహరించాల్సిందిగా కోరుతూ లీజింగ్ కంపెనీలు పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ)ని కోరాయి. మరోవైపు, తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు టికెట్ల బుకింగ్ చేపట్టవద్దంటూ కంపెనీని డీజీసీఏ ఆదేశించింది. అలాగే, సురక్షితమైన, విశ్వసనీయమైన విధంగా సర్వీసులు నడపడంలో విఫలం కావడంపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సమాచారం. ఆ వివరణను బట్టి ఆపరేటర్ సర్టిఫికెట్ (ఏవోసీ)ని కొనసాగనివ్వడంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఫ్లయిట్ సేవలను నిలిపివేసిన గో ఫస్ట్.. మే 15 వరకూ టికెట్ల విక్రయాన్ని ఆపేసిన సంగతి తెలిసిందే. గో ఫస్ట్ గత 17 ఏళ్లుగా విమాన సేవలు నిర్వహిస్తోంది. అయితే, ప్రాట్ అండ్ విట్నీ (పీఅండ్‌డబ్ల్యూ) ఇంజిన్ల వైఫల్యం కారణంగా కొన్నాళ్లుగా సగానికి పైగా విమానాలను నడపడం లేదు. దీంతో ఆదాయం పడిపోయి, ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో కూరుకుపోవడం వల్ల దివాలా ప్రక్రియ చేపట్టాలంటూ ఎన్‌సీఎల్‌టీని కంపెనీ ఆశ్రయించింది. దీనిపై మే 4న విచారణ జరిపిన ట్రిబ్యునల్ .. ఉత్తర్వులను రిజర్వ్‌లో ఉంచింది. రుణ దాతలకు గో ఫస్ట్ దాదాపు రూ. 11,463 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఇండియన్ బ్యాంక్ లాభం అప్

- క్యూ4లో రూ. 1,447 కోట్లు
- షేరుకి రూ. 8.6 డివిడెండ్

ముంబై: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 47 శాతం జంప్ చేసి రూ. 1,447 కోట్లను తాకింది. మొండిరుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పెరగడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో కేవలం రూ. 984 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో మొత్తం ఆదాయం రూ. 11,405 కోట్ల నుంచి రూ. 14,238 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం రూ. 9,832 కోట్ల నుంచి రూ. 12,224 కోట్లకు బలపడింది. బ్యాంక్ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 8.6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 8.47 శాతం



నుంచి 5.95 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 2.27 శాతం నుంచి 0.9 శాతానికి దిగి వచ్చాయి. ప్రొవిజన్లు రూ. 2,046 కోట్ల నుంచి రూ. 1,040 కోట్లకు తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 16.49 శాతంగా నమోదైంది. ఈ ఏడాది(2023–24) రూ. 4,000 కోట్ల ఈక్విటీ పెట్టుబడులను సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉన్నట్లు బ్యాంక్ వెల్లడించింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం రూ. 3,945 కోట్ల నుంచి రూ. 5,282 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 45,772 కోట్ల నుంచి రూ. 52,085 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో ఇండియన్ బ్యాంక్ షేరు దాదాపు 5% పతనమై రూ. 316 వద్ద ముగిసింది.

స్పైస్‌జెట్‌కు ఎన్‌సీఎల్‌టీ నోటీసులు

మే 17న తదుపరి విచారణ



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌పై దివాలా పరిష్కార ప్రక్రియ కింద చర్యలు తీసుకోవాలంటూ కంపెనీకి ఎయిర్‌క్రాఫ్టులను లీజుకి ఇచ్చిన ఎయిర్‌క్యాజిల్ (ఐర్లాండ్) పిటీషన్‌పై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) విచారణ జరిపింది. స్పైస్‌జెట్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మే 17కు వాయిదా వేసింది. నోటీసుల జారీ ప్రక్రియ సాధారణమేనని, ఎన్‌సీఎల్‌టీ తమకు ప్రతికూలంగా ఉత్తర్వులేమీ ఇవ్వలేదని స్పైస్‌జెట్ అధికార ప్రతినిధి తెలిపారు. సెటిల్మెంట్ కోసం ఇరు పక్షాలు చర్చలు జరుపుతున్న విషయాన్ని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుందని పేర్కొన్నారు. ఇకపైనా చర్చలను కొనసాగించవచ్చని వివరించారు. స్పైస్‌జెట్‌పై ఎయిర్‌క్యాజిల్ ఏప్రిల్ 28న పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తమ దగ్గర ఎయిర్‌క్యాజిల్ విమానాలేమీ లేవని, ఈ పిటిషన్‌తో తమ కార్యకలాపాలపై ఎటువంటి ప్రభావమూ ఉండబోదని స్పైస్‌జెట్ గత వారం తెలిపింది. ఎన్‌సీఎల్‌టీ వెబ్‌సైట్ ప్రకారం స్పైస్‌జెట్‌పై ఇప్పటికే రెండు దివాలా పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి.

మార్కెట్ల హైజంప్

- సెన్సెక్స్ 710 పాయింట్లు జూమ్
- 195 పాయింట్లు ఎగసిన నిఫ్టీ
- 61,764 –18,264 వద్ద ముగింపు
- ప్రైవేట్ బ్యాంక్స్, ఆటో, రియల్టీ అప్

వారాంతాన పతన బాటలో సాగిన దేశీ స్టాక్ మార్కెట్లు నేలకొట్టిన బంతిలా పైకెగశాయి. తొలి నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే కట్టుబడటంతో సమయం గడిచే కొద్దీ మార్కెట్లు మరింత జోరు చూపాయి. వెరసి సెన్సెక్స్ 710 పాయింట్లు జంప్‌చేసి 61,764కు చేరగా.. నిఫ్టీ సైతం 195 పాయింట్లు పురోగమించి 18,264 వద్ద ముగిసింది.



ముంబై: ప్రపంచ స్టాక్ మార్కెట్లలో నెలకొన్న ర్యాలీ ప్రభావంతో దేశీయంగానూ సెంటిమెంటు బలపడింది. దీంతో ఇన్వెస్టర్లకు ప్రోత్సాహం లభించింది. వారాంతాన యూఎస్ మార్కెట్లు భారీగా లాభపడగా.. ఫెడ్ రేట్ల పెంపునకు బ్రేక్‌పడనున్న అంచనాలు వడ్డీ ప్రభావిత రంగాలకు బూస్టునిచ్చాయి. ఫలితంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్, రియల్టీ రంగాలకు జోష్ వచ్చింది. ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఆటో, ప్రయివేట్ బ్యాంక్స్, రియల్టీ 1.7 శాతం చొప్పున ఎగశాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లు దాదాపు ఇంట్రాడే గరిష్టాల సమీపంలోనే ముగిశాయి. ఒక దశలో సెన్సెక్స్ 800 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 218 పాయింట్లు జమ చేసుకుంది. యూఎస్ బ్యాంకింగ్ రంగ సమస్యలు తగ్గుముఖం పడుతున్న పరిస్థితులు సైతం ఇన్వెస్టర్లకు హుషారునిచ్చినట్లు విశ్లేషకులు తెలియజేశారు. దేశీయంగా ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ రంగాల పటిష్ట ఫలితాలు సైతం ఇందుకు జత కలసినట్లు పేర్కొన్నారు. అయితే ఎన్ఎస్ఈలో పీఎస్‌యూ బ్యాంక్స్ 1 శాతం, మీడియా 0.6 శాతం చొప్పున డీలాపడ్డాయి.

బ్లూచిప్స్ ర్యాలీ

నిఫ్టీ–50 దిగ్గజాలలో 8 షేర్లు మాత్రమే నష్టపోయాయి. బ్లూచిప్స్‌లో ఇండస్ఇండ్, టాటా మోటార్స్, బజాజ్ త్రయం, ఓఎన్‌జీసీ, హిందాల్కో, హెచ్‌సీఎల్ టెక్, ఎంఅండ్ఎం, యాక్సిస్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, మారుతీ, ఆర్ఐఎల్, ఐసీఐసీఐ, టాటా స్టీల్ 5–1 శాతం మధ్య పుంజుకున్నాయి. అయితే క్యూ4 ఫలితాలు నిరాశపరచడంతో కోల్ ఇండియా షేరు 2 శాతం క్షీణించి రూ. 233 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో కలిపి కోటికిపైగా షేర్లు ట్రేడయ్యాయి. ఈ బాటలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, బ్రిటానియా, ఎల్అండ్‌టీ 1.5–0.4 శాతం మధ్య నీరసించాయి. రియల్టీ కౌంటర్లలో మహీంద్రా లైఫ్, లోధా, శోభా, డీఎల్ఎఫ్, గోద్రెజ్ ప్రాపర్టీస్ 3.7–1.4 శాతం మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్లు గుడ్

మార్కెట్ల బాటలో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ 1–0.5 శాతం చొప్పున బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,998 లాభపడగా.. 1,654 వెనకడుగు వేశాయి. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 778 కోట్లు ఇన్వెస్ట్ చేయగా.. దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 2,199 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి.

స్టాక్ హైలైట్స్

- ప్రోత్సాహకర ఫలితాలు (క్యూ4) ప్రకటించిన స్మాల్ క్యాప్ ఏజీఐ గ్రీన్‌ప్యాక్ షేరు 9 శాతం దూసుకెళ్లి రూ. 540 వద్ద నిలిచింది. గత రెండు రోజుల్లో ఈ కౌంటర్ ఏకంగా 43 శాతం లాభపడింది.
- క్యూ4లో కన్సాలిడేటెడ్ నష్టం భారీగా తగ్గడంతో పేటీఎమ్ మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేరు 5 శాతం జంప్‌చేసి రూ. 724 వద్ద ముగిసింది.

ఇన్వెస్టర్ల సంపద జూమ్

మార్కెట్లు జోరందుకోవడంతో సోమవారం ఒక్క రోజులోనే లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్(విలువ) రూ. 2.27 లక్షల కోట్లకు పైగా లాభపడింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల విలువ రూ. 2.76 లక్షల కోట్లను దాటింది.

ఐదేళ్లలో డీజిల్ ఫోర్ వీలర్ల బ్యాన్!

- 10 లక్షల జనాభా నగరాల్లో అమలు
- కేంద్రానికి చమురు శాఖ సూచన



న్యూఢిల్లీ: పది లక్షలకుపైగా జనాభా ఉన్న నగరాల్లో డీజిల్ ఆధారిత ఫోర్ వీలర్లను 2027 నాటికి నిషేధించాలని చమురు మంత్రిత్వ శాఖ సూచించింది. ఎలక్ట్రిక్, గ్యాస్ ఆధారిత వాహనాలను ప్రోత్సహించాలని చమురు మంత్రిత్వ శాఖ మాజీ సెక్రటరీ తరుణ్ కపూర్ నేతృత్వంలోని కమిటీ విన్నవించింది. 'ఇంటర్నల్ కంబషన్ ఇంజన్‌తో తయారైన మోటార్‌సైకిళ్లు, స్కూటర్లు, త్రిచక్ర వాహనాల తయారీని 2035 నాటికి దశలవారీగా నిలిపివేయాలి. సుమారు 10 ఏళ్లలో పట్టణ ప్రాంతాల్లో డీజిల్ సిటీ బస్సులను నూతనంగా జోడించకూడదు. ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ ఆధారిత ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను దశలవారీగా నిర్మూలించడానికి ఎలక్ట్రిక్ వెహికిల్స్ సరైన పరిష్కారంగా ప్రచారం చేయాలి. మధ్యంతర కాలంలో మిశ్రమ నిష్పత్తిని పెంచుతూ ఇథనాల్‌తో కూడిన ఇంధనానికి విధాన మద్దతు ఇవ్వాలి. డీజిల్‌తో నడిచే ఫోర్ వీలర్లను వీలైనంత త్వరగా తొలగించవచ్చు. అందువల్ల 10 లక్షలకుపైగా జనాభా ఉన్న నగరాలు, అధిక కాలుష్యం ఉన్న అన్ని పట్టణాలలో డీజిల్‌తో నడిచే నాలుగు చక్రాల వాహనాలపై నిషేధాన్ని ఐదేళ్లలో అమలు చేయాలి. ఫ్లెక్స్ ఫ్యూయల్, హైబ్రిడ్‌లతో కూడిన వాహనాలను ప్రోత్సహించేలా స్వల్ప, మధ్యస్థ కాలంలో ప్రచారం చేయాలి. పన్నుల వంటి ఆర్థిక సాధనాల ద్వారా ఇది చేయవచ్చు. ఈవీల వినియోగాన్ని పెంచేందుకు ఫేమ్‌ను కొనసాగించాలి. నగరాల్లో సరుకు డెలివరీ కోసం ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రమే కొత్తగా రిజిస్ట్రేషన్‌లకు అనుమతించాలి. కార్గో తరలింపు కోసం రైల్వేలు, గ్యాస్‌తో నడిచే ట్రక్కులను ఎక్కువగా ఉపయోగించాలి. ఈ సూచనలు అమలైతే 2070 నాటికి ఉద్గారాల విషయంలో భారత్ నెట్ జీరో స్థాయికి చేరుకుంటుంది' అని నివేదిక పేర్కొంది.

ఎక్సైడ్ లాభం రూ.181 కోట్లు



న్యూఢిల్లీ: బ్యాటరీల తయారీ సంస్థ ఎక్సైడ్ ఇండస్ట్రీస్ మార్చి త్రైమాసికానికి రూ.181 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో వచ్చిన లాభం రూ.3,953 కోట్లతో పోలిస్తే గణనీయంగా తగ్గింది. ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటాలను క్రితం ఏడాది ఇదే కాలంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌కు విక్రయించడం వల్ల అప్పట్లో లాభం గణనీయంగా నమోదైంది. ఆదాయం రూ.3,677 కోట్లుగా నమోదైంది. ఇక 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎక్సైడ్ రూ.15,078 కోట్ల ఆదాయంపై రూ.823 కోట్ల లాభాన్ని ప్రకటించింది. 2022–23 సంవత్సరానికి షేరుకు తుది డివిడెండ్ కింద రూ.2 చొప్పున చెల్లించాలని కంపెనీ బోర్డ్ నిర్ణయించింది.

భవిత

నేడే టీఎస్ ఇంటర్ ఫస్ట్, సెకండియర్ ఫలితాలు–2023
ఫలితాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వెంటనే ఫలితాలు పొందండి.
పూర్తి వివరాల కోసం www.sakshieducation.com చూడొచ్చు.

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ గురుకులాల్లో 2008 జూనియర్ లెక్చరర్, పీడీ, లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థ(జూనియర్ కళాశాలలు)ల్లో డైరెక్ట్ ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్, పీడీ, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2008
» **పోస్టుల వివరాలు:** జూనియర్ లెక్చరర్–1924, ఫిజికల్ డైరెక్టర్–34, లైబ్రేరియన్ –50.
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** తెలుగు–225, హిందీ –20, ఉర్దూ–50, ఇంగ్లిష్–230, మ్యాథ్స్–324, ఫిజిక్స్–205, కెమిస్ట్రీ–207, బోటనీ–204, జువాలజీ–199, హిస్టరీ–07, ఎకనామిక్స్–82, కామర్స్–87, సివిక్స్–84.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, బీఈడీ, బీపీ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీపీఈడీ, బీపీఈ, ఎంపీఈడీ, ఎంఎల్ఐఎస్సీ లేదా తత్సమాన అర్హత ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.58,220 నుంచి రూ.1,33,630 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలు(పేపర్–1, పేపర్–2, పేపర్–3), డెమానిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.05.2023
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 275 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు.. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థ(పాఠశాలలు)ల్లో డైరెక్ట్ ప్రాతిపదికన ఫిజికల్ డైరెక్టర్(స్కూల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 275
» **సొసైటీల వారీగా ఖాళీలు:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు–57; తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు–38; మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు–120; తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు–60.
» **అర్హత:** డిగ్రీ, బీపీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.42,300 నుంచి రూ.1,15,270 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(పేపర్–1, పేపర్–2), డెమాన్‌స్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

నిర్మల్ జిల్లాలో వివిధ ఉద్యోగాలు

నిర్మల్ జిల్లా మహిళ,శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ.. ఒప్పంద ప్రాతిపదికన డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్(డీహెచ్ఈడబ్ల్యూ), డొమెస్టిక్ వయొలెన్స్ సెల్(నిర్మల్)లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **పోస్టుల వివరాలు:** స్పెషలిస్ట్(ఫైనాన్షియల్ లిటరసీ)–01, అకౌంట్స్ అసిస్టెంట్–01, ఎంటీఎస్–01, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్–01, జెండర్ స్పెషలిస్ట్–01.
» **అర్హత:** పదో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, డబ్ల్యూసీడీ అండ్ ఎస్సీ విభాగం, శరద్‌మహల్, నిర్మల్, నిర్మల్ జిల్లా చిరునామకు పంపాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.05.2023.
» **వెబ్‌సైట్:** www.nirmal.telangana.gov.in

నారాయణపేట జిల్లా డీఎంహెచ్‌వోలో వివిధ పోస్టులు

నారాయణపేట జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన అర్బన్ హెల్త్ సెంటర్(నారాయణపేట)ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
» **పోస్టుల వివరాలు:** ఫార్మాసిస్ట్–01, ల్యాబ్ టెక్నీషియన్–01, ఎంపీహెచ్ఏ (ఎఫ్)–05.
» **అర్హత:** డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్ఏ(ఎఫ్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు:18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.27,300 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నారాయణపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, సింగారం ఎక్స్–రోడ్, నారాయణపేట చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.05.2023.
» **వెబ్‌సైట్:** www.narayanpet.telangana.gov.in

సాయుధ దళాల్లో.. అసిస్టెంట్ కమాండెంట్!

బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారా.. యూనిఫార్మ్ సర్వీస్‌పై ఆసక్తి ఉందా.. దేశ భద్రతలో పాల్పంచుకోవాలనే తపన, తెగువ సైతం ఉన్నాయా..! అయితే మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! సాయుధ దళాల్లో సాహసోపేతమైన కొలువుకు మార్గం.. సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎగ్జామినేషన్! తాజాగా యూపీఎస్సీ.. సీఏపీఎఫ్(ఏసీ) ఎగ్జామినేషన్ 2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. అసిస్టెంట్ కమాండెంట్ ఎంపిక విధానం, రాత పరీక్ష, సిలబస్ విశ్లేషణ, విజయానికి ప్రిపరేషన్ తదితర సమాచారం..

» సీఏపీఎస్(ఏసీ) ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ విడుదల
» మొత్తం 322 పోస్ట్‌లకు యూపీఎస్సీ ఎంపిక ప్రక్రియ
» ఏదైనా డిగ్రీ అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు



కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని పలు సాయుధ దళాల్లో..అసిస్టెంట్ కమాండెంట్ కొలువుల భర్తీకి నిర్వహించే పరీక్ష.. సీఏపీఎఫ్–ఏసీ ఎగ్జామినేషన్! దీని ద్వారా నాలుగు విభాగాల్లో మొత్తం 322 పోస్టులు భర్తీ చేయనున్నారు.

అవి.. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)–86 పోస్టులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)–55, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)–91 పోస్టులు, ఇండో–టిబెటిన్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)–60 పోస్టులు, సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ)–30 పోస్టులు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అసిస్టెంట్ కమాండెంట్ పోస్టులకు పురుషులతోపాటు మహిళలు కూడా అర్హులే.

వయసు

ఆగస్టు 1, 2023 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ట వయో పరిమితిలో ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు ఉంటుంది. వీటితోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.

మూడంచెల ఎంపిక విధానం

యూపీఎస్సీ నిర్వహించే సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడు దశల్లో జరుగుతుంది. అవి..రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్,పర్సనాలిటీ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ.

తొలి దశ రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో మొదటి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది. అవి.. పేపర్–1 జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్ –250 మార్కులు; పేపర్–2 జనరల్ స్టడీస్, ఎస్సే, కాంప్రహెన్షన్ –200 మార్కులు. ఇలా మొత్తం 450 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్–1కు రెండు గంటలు, పేపర్–2కు మూడు గంటల సమయం లభిస్తుంది. పరీక్ష పెన్ పేపర్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్–1లో నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులను తగ్గిస్తారు.

ఆబ్జెక్టివ్ విధానంలో.. పేపర్-1

పేపర్ 1 జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్‌లో సమకాలీన అంశాలపై అవగాహనతోపాటు జనరల్ నాలెడ్జ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 125 ప్రశ్నలు ఉంటాయి. భారత చరిత్ర, రాజ్యాంగం, ఎకానమీ, జాగ్రఫీ, సైన్స్, మ్యాథ్స్, రీజనింగ్, పర్యావరణం–జీవ వైవిధ్యం, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2.. డిస్క్రిప్టివ్ విధానం

పేపర్–2ను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో ఎస్సే, కాంప్రహెన్షన్ విభాగాలు ఉంటాయి. పార్ట్–ఎలో ఎస్సే కొశ్చన్స్ అడుగుతారు. ఎస్సే రైటింగ్ విభాగంలో నిర్దేశిత అంశాలపై మూడు వందల పదాలకు మించకుండా చిన్నపాటి వ్యాసాలు రాయాల్సి ఉంటుంది. పార్ట్–ఎకు 80 మార్కులు కేటాయించారు. పార్ట్–బి 120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ప్రెసిస్ రైటింగ్, రిపోర్ట్ రైటింగ్, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై ప్రశ్నలు ఉంటాయి.

రెండో దశలో పీఈటీ

మొదటి దశ రాత పరీక్ష పేపర్–1, 2లలో నిర్దేశిత కటాఫ్ సాధించిన అభ్యర్థులకు రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఈ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నాలుగు విభాగాల్లో(వంద మీటర్ల పరుగు పందెం, 800 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్) ఉంటుంది. వీటిని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లలో పొందిన మార్కులు ఆధారంగా.. నిర్దేశిత కటాఫ్‌లను అనుసరించి మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. దీనికి 150 మార్కులు కేటాయించారు.

గెజిటెడ్ కొలువు

మూడు దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన అభ్యర్థులకు.. వారు పొందిన ర్యాంకు, సర్వీస్ ప్రిఫరెన్స్ ఆధారంగా విభాగాన్ని కేటాయిస్తారు. తర్వాత దశలో సుమారు ఏడాది పాటు ఆయా దళాల్లో శిక్షణ ఉంటుంది. అది కూడా పూర్తి చేసుకుంటే గ్రూప్–ఎ గెజిటెడ్ హోదాలో అసిస్టెంట్ కమాండెంట్‌గా శాశ్వత కొలువు సొంతమవుతుంది.

సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా కెరీర్ ప్రారంభించిన వారు.. భవిష్యత్తులో తాము ఎంపికైన విభాగాల్లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, ఆపై స్థాయికి చేరుకునే అవకాశముంది. కెరీర్‌లో అత్యంత ప్రతిభా పాటవాలు చూపితే అడిషనల్ డైరెక్టర్ జనరల్ హోదాను కూడా సొంతం చేసుకోవచ్చు.

విజయం సాధించాలంటే

- **పేపర్–1:** ఈ పేపర్‌లో రాణించేందుకు ముందుగా సిలబస్‌లో పేర్కొన్న సబ్జెక్ట్‌లకు సంబంధించి ఆరు నుంచి 12వ తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలి. దీనివల్ల అన్ని అంశాల బేసిక్స్, ఫార్ములాలపై అవగాహన వస్తుంది. కరెంట్ అఫైర్స్ కోసం ఆర్థిక–రాజకీయ పరిణామాలపై దృష్టి సారించాలి. దీంతోపాటు చరిత్రలో ప్రధానంగా స్వాతంత్ర్య పోరాటం, ముఖ్య ఘట్టాలు–వ్యక్తులపై పరిజ్ఞానం పెంచుకోవాలి. ఇటీవల కాలంలో దేశ రక్షణ, భద్రత విభాగాల్లో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, కొత్త క్షిపణుల ప్రయోగాలు, దేశ రక్షణ–భద్రతకు సంబంధించి పలు దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

పేపర్-2 ప్రత్యేక వ్యూహం

- డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహించే పేపర్–2లో రాణించేందుకు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టుతోపాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదివి..అందులోని ముఖ్యాంశాలతో సొంత శైలిలో పరీక్షలో నిర్దేశించిన మాదిరిగా 300 పదాల్లో సారాంశాలను క్రోడీకరించడం ప్రాక్టీస్ చేయాలి.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో విజయం కోసం ప్రతి రోజు కనీసం రెండు గంటలు ప్రాక్టీస్ చేయాలి. ఈ ఫిజికల్ ప్రాక్టీస్ ఉదయం వేళల్లో చేస్తే శారీరక అలసటకు దూరంగా ఉండొచ్చు.

60 శాతం మార్కులే లక్ష్యంగా

సీఏపీఎఫ్–ఏసీ పరీక్షకు పోటీ పడే అభ్యర్థులు 60 శాతం మార్కులు లక్ష్యంగా ప్రిపరేషన్ సాగిస్తే.. తుది విజేతలుగా నిలిచే అవకాశం ఉంది. గత విజేతల స్కోర్‌ను పరిశీలిస్తే.. మొత్తం ఆరు వందల మార్కులకు(రాత పరీక్షకు 450 మార్కులు, ఇంటర్వ్యూకు 150 మార్కులు) జరిగే ఎంపిక ప్రక్రియలో.. 50 శాతం మార్కులు సాధించి, నిర్దేశిత ఫిజికల్ టెస్ట్‌లలో అర్హత సాధించిన వారు విజేతల జాబితాలో నిలిచే అవకాశం కనిపిస్తోంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మే 16, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: మే 17 నుంచి మే 23 వరకు
- సీఏపీఎఫ్ రాత పరీక్ష తేదీ: ఆగస్టు 6, 2023
- తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in
- ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: www.upsconline.nic.in

క్లుప్తంగా...

ఆర్‌-5 జోన్‌పై సుప్రీంకోర్టులో వచ్చే వారం విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతిలో ఆర్‌–5 జోన్‌పై ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సవాల్‌ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్‌ను వచ్చే వారం విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమ పిటిషన్‌ను త్వరగా విచారించాలంటూ పిటిషనర్ల తరఫు న్యాయవాది సోమవారం సీజేఐ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ ధర్మాసనం ముందు ప్రస్తావించారు.

బీ, సీ కేటగిరీ ఎంబీబీఎస్‌ సీట్ల విభజనలో మార్పులు

- అన్‌ ఎయిడెడ్, నాన్‌ మైనార్టీ ప్రొఫెషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ నిబంధనల్లో సవరణ
- ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: ఏపీ అన్‌ ఎయిడెడ్, నాన్‌ మైనార్టీ ప్రొఫెషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌– 2007 నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో అన్‌ ఎయిడెడ్, నాన్‌ మైనారిటీ వైద్య, దంత కళాశాలల్లో బీ, సీ కేటగిరీ సీట్ల విభజనకు సంబంధించి ఫ్రాక్షన్‌లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఉదాహరణకు ఒక కళాశాలలో మొత్తం సీట్లలో 50 శాతం కౌన్సెలింగ్‌ ద్వారా భర్తీ చేస్తారు. మిగిలిన 50 శాతంలో 35 శాతం సీట్లు బీ కేటగిరీ, 15 శాతం సీ కేటగిరీ కింద భర్తీ అవుతాయి. ఈ క్రమంలో బీ, సీ కేటగిరీ సీట్ల విభజనలో ఒక సీటు మిగిలితే ఆ సీటును ఒక ఏడాది బీ కేటగిరీ, మరుసటి సంవత్సరం సీ కేటగిరీకి బదలాయిస్తారు. ఇలా 17 ఎంబీబీఎస్‌ సీట్లు రొటేషన్‌ కానున్నాయి.

జూలైలోగా 500 ఆర్బీకేల పరిధిలో కిసాన్‌ డ్రోన్లు

- డిసెంబర్‌ నాటికి మరో 1,500
- వారంలోగా యంత్ర సేవా యూనిట్‌ విలువ నిర్ధారణ
- రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయం

సాక్షి, అమరావతి: ఆర్బీకేలకు అనుబంధంగా తొలిదశ కిసాన్‌ డ్రోన్ల ఏర్పాటుపై త్వరలో నోటిఫికేషన్‌ విడుదల చేయాలని రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయించింది. మంగళగిరిలోని వ్యవసాయశాఖ క్యాంప్‌ కార్యాలయంలో ఆ శాఖ స్పెషల్‌ కమిషనర్‌ చేవూరు హరికిరణ్‌ అధ్యక్షతన సోమవారం కమిటీ తొలి సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్బీకే స్థాయిలో 2023–24 సంవత్సరానికి రెండువేల కిసాన్‌ డ్రోన్లు ఏర్పాటు చేస్తున్నారు. జూలై నాటికి 500, డిసెంబర్‌ నాటికి 1,500 కిసాన్‌ డ్రోన్లు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. కిసాన్‌ డ్రోన్‌ కంపెనీలను ఎంపిక చేసేందుకు ఇటీవలే రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సిఫార్సు చేసిన కిసాన్‌ డ్రోన్లు తయారు చేసే కంపెనీలు, పనితీరును బట్టి డ్రోన్లు, వాటితో ఏర్పాటు చేసే యంత్ర సేవా యూనిట్‌ విలువ నిర్ధారణ వంటి వివరాలతో వారంలోగా నోటిఫికేషన్‌ విడుదల చేయాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్‌ ఎండీ రాహుల్‌ పాండే, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్‌ గెడ్డం శేఖర్‌బాబు, ఏపీ ఆగ్రోస్‌ ఎండీ కృష్ణమూర్తి, ఏపీ డ్రోన్‌ కార్పొరేషన్‌ ఎండీ కిరణ్, ఏపీ ఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమర్థంగా టెన్త్‌ పరీక్షలు నిర్వహించినందుకు అభినందనలు

ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి లేఖ

సాక్షి, అమరావతి : పదోతరగతి పరీక్షలను ఈ ఏడాది సమర్థంగా నిర్వహించారని, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం, చొరవతోనే ఇది సాధ్యమైందని కడప, కర్నూలు, అనంతపురం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అభినందించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా పరీక్షలు నిర్వహించడంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలు జరిగిన 18 రోజుల్లోనే ఫలితాలను ప్రకటించడం కూడా ఓ రికార్డేనని, సీఎం మార్గదర్శకంలో సమర్థ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ ఎమ్మెల్సీ సోమవారం లేఖ రాశారు.

ఏపీ ఈఏపీసెట్‌కు
దరఖాస్తుల వెల్లువ

సోమవారం నాటికి 3,38,407 మంది దరఖాస్తు

- నేటినుంచి అభ్యర్థులకు అందుబాటులో హాల్‌టికెట్లు
- రూ.5 వేల ఆలస్య రుసుముతో ఈ నెల 12 వరకు దరఖాస్తుకు అవకాశం
- రూ.10 వేల ఆలస్య రుసుముతో ఈ నెల 14 వరకు దరఖాస్తు చేయవచ్చు
- గతేడాదితో పోలిస్తే ఇప్పటికే పెరిగిన దరఖాస్తులు
- ఈ నెల 15 నుంచి 19 వరకు ఇంజనీరింగ్‌ విభాగంలో పరీక్షలు
- వ్యవసాయ, ఫార్మా విభాగం పరీక్షలు 22, 23 తేదీల్లో
- రోజుకు రెండు సెషన్లలో నిర్వహణ
- రాష్ట్రంలో 45, హైదరాబాద్‌లో రెండు పరీక్ష కేంద్రాలు

సాక్షి, అమరావతి/అనంతపురం: రాష్ట్రంలో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈఏపీసెట్‌–2023కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. సోమవారం నాటికి 3,38,407 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎంపీసీ స్ట్రీమ్‌లో 2,38,037 మంది, బైపీసీ స్ట్రీమ్‌లో 1,00,370 మంది ఉన్నారు. ఈ మొత్తం దరఖాస్తులు గతేడాది ఆలస్య రుసుముతో చివరి గడువు నాటికి వచ్చిన వాటికంటే అధికంగా ఉండటం విశేషం. ఏపీ ఈఏపీసెట్‌కు రూ.5 వేల ఆలస్య రుసుముతో 12వ తేదీ వరకు, రూ.10 వేల ఆలస్య రుసుముతో 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మంగళవారం నుంచి అభ్యర్థులకు cets.apsche.ap gov.in వెబ్‌సైట్‌ ద్వారా హాల్‌టికెట్లు అందించనున్నారు.

మొత్తం 47 పరీక్ష కేంద్రాలు

మన రాష్ట్రంలో 45, హైదరాబాద్‌లో రెండు కలిపి మొత్తం 47 ఆన్‌లైన్‌ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలో అనకాపల్లి, అనంతపురం, గుత్తి, తాడిపత్రి, మదనపల్లి, రాజంపేట, బాపట్ల, చీరాల, చిత్తూరు, పలమనేరు, రాజమండ్రి, ఏలూరు, గుంటూరు, కాకినాడ, అమలాపురం, గుడ్లవల్లేరు, మచిలీపట్నం, కర్నూలు, ఎమ్మిగనూరు, నంద్యాల, మైలవరం, తిరువూరు, విజయవాడ, నరసరావుపేట, మార్కాపురం, ఒంగోలు, కావలి, నెల్లూరు, పుట్టపర్తి, శ్రీకాకుళం, టెక్కలి, గూడూరు, పుత్తూరు, తిరుపతి, విశాఖపట్నం, ఆనందపురం, గాజువాక, బొబ్బిలి, రాజాం, విజయనగరం, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, కడప, ప్రొద్దుటూరుల్లోను, హైదరాబాద్‌లో ఎల్బీనగర్, సికింద్రాబాద్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

రోజుకు రెండు సెషన్లలో.. ఆన్‌లైన్‌లో..



ఇంజనీరింగ్‌ కోర్సుల్లో ప్రవేశానికి మే 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి 22, 23 తేదీల్లో రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించేందుకు ఏపీ ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలో జేఎన్‌టీయూ అనంతపురం అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలి సెషన్‌ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్‌ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. ఒక్కో విభాగంలో ఆబ్జెక్టివ్‌ తరహాలో 160 ప్రశ్నలుంటాయి. సరైన సమాధానం రాస్తే ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు కేటాయిస్తారు. ఇలా ఇంజనీరింగ్‌ విభాగంలో గణితం 80, ఫిజిక్స్‌ 40, కెమిస్ట్రీ 40 మార్కులకు పరీక్ష ఉంటుంది. వ్యవసాయ, ఫార్మా విభాగంలో బయాలజీ 80 (బోటనీ 40, జువాలజీ 40), ఫిజిక్స్‌ 40, కెమిస్ట్రీలో 40 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి.

హాల్‌టికెట్లలో తేడాలుంటే..

ఏపీ ఈఏపీసెట్‌ హాల్‌టికెట్లలో తేడాలుంటే 08554–23411, 232248 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం తెలపవచ్చని, లేదా helpdeskapeapcet–2023@ gmail.comకు మెయిల్‌ పంపవచ్చని సెట్‌ రాష్ట్ర చైర్మన్‌ ప్రొఫెసర్‌ జింకా రంగజనార్దన, కన్వీనర్‌ ప్రొఫెసర్‌ శోభాబిందు తెలిపారు. హాల్‌టికెట్ల వెనుక వైపు బస్టాండు నుంచి పరీక్ష కేంద్రానికి వెళ్లాల్సిన మార్గాన్ని ముద్రించినట్లు చెప్పారు. ఉదయం సెషన్‌లో 7.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 గంటలకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని వారు పేర్కొన్నారు.

జూన్‌ 2 నుంచి టెన్త్‌ అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ

సాక్షి, అమరావతి: పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు విద్యా సంవత్సరం వృథా కాకుండా జూన్‌ 2 నుంచి 10వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు సోమవారం పరీక్షల నిర్వహణ విభాగం డైరెక్టర్‌ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఓరియంటల్‌ సెకండరీ స్కూల్‌ సర్టిఫికెట్‌ (ఓఎస్‌ఎస్‌సీ) పరీక్షలు కూడా ఇదే షెడ్యూల్‌లో నిర్వహిస్తారు.

పరీక్షల తేదీలు ఇవీ..

జూన్‌ 2, శుక్రవారం:	ఫస్ట్‌ లాంగ్వేజ్‌/ఫస్ట్‌ లాంగ్వేజ్‌ పేపర్‌–1 (కాంపోజిట్‌ కోర్సు)
జూన్‌ 3, శనివారం:	సెకెండ్‌ లాంగ్వేజ్‌
జూన్‌ 5, సోమవారం:	ఇంగ్లిష్‌
జూన్‌ 6, మంగళవారం:	మ్యాథమెటిక్స్‌
జూన్‌ 7, బుధవారం:	సైన్స్‌
జూన్‌ 8, గురువారం:	సోషల్‌ స్టడీస్‌
జూన్‌ 9, శుక్రవారం:	ఫస్ట్‌ లాంగ్వేజ్‌ పేపర్‌ –2/ఓఎస్‌ఎస్‌సీ మెయిన్‌ లాంగ్వేజ్‌ పేపర్‌-1
జూన్‌ 10, శనివారం:	ఓఎస్‌ఎస్‌సీ మెయిన్‌ లాంగ్వేజ్‌ పేపర్‌–2

బాబువి బురద రాజకీయాలు

- రైతుకు సర్కారు అన్ని విధాలా అండగా ఉంది
- రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు వద్దన్న అరాచకవాది ఆయన
- టీడీపీ హయాంలో ఇచ్చిన ఇన్నోవాలు వారి బినామీల చేతుల్లోనే
- దళితుల సంక్షేమంపై చంద్రబాబే చర్చకు రావాలి
- చంద్రబాబుపై మంత్రి నాగార్జున నిప్పులు



సాక్షి, అమరావతి : అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నారని, అయినా రైతులతో బురద రాజకీయాలను చంద్రబాబు మానుకోలేదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున నిప్పులు చెరిగారు. చంద్రబాబు హయాంలో ఇలాంటి ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు ఆయన కనీసం స్పందించిన దాఖలాల్లేవని ఆరోపించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తడిసిన ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను కొనుగోలు చేసేలా ప్రభుత్వ యంత్రాంగం రైతుకు అన్ని విధాలుగా అండగా ఉందన్నారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే సామాజిక అసమానతలు ఏర్పడతాయని చెప్పిన అరాచకవాది చంద్రబాబు అని మండిపడ్డారు. పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టని అన్నారు. చంద్రబాబు పాలనలో పేదలు, దళితులు ధైర్యంగా బతికిన రోజులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దళితులకు ఏ మేలూ జరగడం లేదంటూ టీడీపీ ప్రచారం చేయించడాన్ని ఆయన తప్పుబట్టారు. దేశంలోని ఏ ఎస్సీ, బీసీ ముఖ్యమంత్రి సైతం చేయని విధంగా సీఎం జగన్‌ దళితుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారని నాగార్జున కొనియాడారు. టీడీపీ పాలనలో కంటే వైఎస్సార్‌సీపీ సర్కారే దళిత సంక్షేమానికి ఎక్కువ నిధులు ఖర్చుచేసిందని నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. దళితుల కోసం తాము ఖర్చుపెట్టిన రూ.వేల కోట్ల మొత్తంలో ఒక్క రూపాయి అవినీతి జరిగిందని నిరూపిస్తే తాను చెప్పుతో కొట్టించుకోవడానికి సిద్ధంగా ఉన్నానని మంత్రి ప్రకటించారు.

నాటి ఇన్నోవాలు పేదలకు చేరలేదు

చంద్రబాబు, లోకేశ్‌కు దమ్ముంటే టీడీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై చర్చకు రావాలని నాగార్జున సవాల్‌ విసిరారు. వారి పాలనలో ఇచ్చిన ఇన్నోవా వాహనాలు పేదలకు చేరలేదని, అవి టీడీపీ బినామీల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ప్రజలను మోసం చేయడానికి లోకేశ్, రైతులను మోసం చేయడానికి చంద్రబాబు రోడ్డునపడి తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు దళితుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే ఆయనే బహిరంగ చర్చకు రావాలని నాగార్జున సవాల్‌ చేసారు.

సంక్షేమ పథకాల అమలులో విమర్శలు సహజం

- ముఖ్యంగా నిధుల దుర్వినియోగం ఆరోపణలు వస్తూనే ఉంటాయి
- పేదలు లబ్ధి పొందుతున్నారా లేదా అన్నదే చూడాలి
- రేషన్‌ సరుకులు ఎలా ఇస్తున్నారన్నది ముఖ్యం కాదు
- అవి పేదలకు చేరుతున్నాయా లేదా అన్నదే ముఖ్యం
- హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు
- వాహనాల ద్వారా సరుకుల పంపిణీపై లోతుగా విచారణ జరుపుతామని స్పష్టీకరణ
- తదుపరి విచారణ జూలై 3కి వాయిదా



సాక్షి, అమరావతి : ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పుడు విమర్శలు రావడం చాలా సాధారణమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వస్తూనే ఉంటాయని, అంతిమంగా చూడాల్సింది సంక్షేమ పథకాల వల్ల పేదలు లబ్ధి పొందుతున్నారా లేదా అన్నదేనని స్పష్టం చేసింది. చౌక ధర వస్తువులను రేషన్‌ డీలర్లు అందచేస్తున్నారా? సంచార వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఇస్తున్నారా? అన్నది ముఖ్యం కాదని, అవి పేదలకు చేరుతున్నాయా లేదా అన్నదే ముఖ్యమని తెలిపింది. ఏ సంక్షేమ పథకమైనా పేదలు లబ్ధి పొందడమే ప్రధాన ఉద్దేశంగా ఉంటుందని తెలిపింది. సంచార వాహనాల ద్వారా సరుకులను ఇంటింటికీ వెళ్లి ఇచ్చేలా ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఈ వ్యాజ్యంపై జూలై 3న విచారణ జరుపుతామంది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ప్రశాంత్‌ కుమార్‌ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్‌ నైనాల జయసూర్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.సంచార వాహనాల ద్వారా ఇంటింటికీ సరుకులను పంపిణీ చేయడాన్ని సవాలు చేస్తూ ఏపీ రేషన్‌ షాపుల డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటరామారావు, కార్యదర్శి చిట్టిరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై సీజే ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది కె.శ్రీనివాస్‌ వాదనలు వినిపిస్తూ.. వాహనాల ద్వారా ఇంటింటికీ సరుకుల పంపిణీ విధానం వల్ల ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని, రేషన్‌ డీలర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. పాత విధానంలో రేషన్‌ డీలర్ల ద్వారా సరుకుల పంపిణీకి ఆదేశాలివ్వాలని కోర్టును కోరారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. ప్రతి సంక్షేమ పథకం అమలు సందర్భంగా విమర్శలు రావడం సహజమంది. ప్రభుత్వ న్యాయవాది శ్రేయాస్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వాహనాల ద్వారా ఇంటింటికీ సరుకులు ఇవ్వడం వల్ల రేషన్‌ డీలర్లకు వచ్చిన నష్టమేమీ లేదని, వారు యథాతథంగా కొనసాగుతున్నారని తెలిపారు. సరుకులు వారి వద్ద స్టాక్‌ చేసి, వాటిని సంచార వాహనాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. వారి కమీషన్‌ను కూడా తగ్గించలేదని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌ విధానానికి మన విధానానికి తేడా ఉందన్నారు.

'పది'లో ప్రభుత్వ విద్యార్థుల సత్తా

- అత్యధికంగా ఇద్దరికి 594 మార్కులు
- నలుగురికి 593, ముగ్గురికి 592
- ఏడుగురికి 591, 12 మందికి 590 మార్కులు
- టాప్‌–28 మందిలో 26 మంది ఇంగ్లిష్‌ మీడియం వారే..
- ప్రభుత్వ కృషికి విద్యార్థుల తల్లిదండ్రుల అభినందన

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. టాప్‌ మార్కులు సాధించి ప్రైవేటు, కార్పొరేట్‌ స్కూళ్లకు ధీటుగా నిలిచారు. అది కూడా ఇంగ్లిష్‌ మీడియంలో పరీక్షలు రాసి 600కు 590కిపైగా మార్కులు సొంతం చేసుకున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్‌ మీడియం ఎందుకని విమర్శిస్తున్నవారికి గట్టి జవాబు ఇచ్చారు. అత్యున్నత ఉత్తీర్ణత శాతం సాధించిన పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఉత్తీర్ణతలో దిగువనున్న నంద్యాల జిల్లా వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. రాష్ట్రవ్యాప్తంగా 28 మంది 590 ఆపై మార్కులు సాధించారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు 594 మార్కులు, నలుగురు 593, ముగ్గురు 592, ఏడుగురు 591 మార్కులు సొంతం చేసుకున్నారు. మరో 12 మంది 590 మార్కులు సాధించారు. ఈ 28 మందిలో ఒకరు తెలుగు మీడియంలో, మరొకరు ఒడియా మీడియంలో పరీక్షలు రాయగా, మిగిలిన 26 మంది ఇంగ్లిష్‌ మీడియంలో పరీక్షలు రాసినవారే. 28 మందిలో 14 మంది బాలికలు, 14 మంది బాలురు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలను అందించడం, రోజూ డిక్షనరీలోని నిర్దిష్ట పదాలను గుర్తుంచుకునేలా తర్ఫీదు, నిపుణులైన ఉపాధ్యాయుల శిక్షణ, పర్యవేక్షణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం ఉత్తమ ఫలితాలకు దోహదపడ్డాయి. ఒకప్పుడు ఇంగ్లిష్‌ అంటేనే భయపడే విద్యార్థులు తక్కువ కాలంలోనే ఇంగ్లిష్‌ మీడియంపై పట్టు సాధించి అత్యధిక మార్కులు సొంతం చేసుకున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యుత్తమ మార్కుల సాధనలో ప్రభుత్వ కృషిని అభినందిస్తున్నారు.

జిల్లాల వారీగా టాపర్స్‌..

శ్రీకాకుళం, బాపట్ల జిల్లాల్లో నలుగురు చొప్పున టాపర్స్‌ ఉన్నారు. అనకాపల్లిలో ముగ్గురు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, విశాఖ, సత్యసాయి, వైఎస్సార్‌ జిల్లాల్లో ఇద్దరు చొప్పున విద్యార్థులు టాపర్స్‌గా నిలిచారు. గుంటూరు, కృష్ణా, అన్నమయ్య, నంద్యాల, ప్రకాశం, పల్నాడు, ఎన్టీఆర్, ఏలూరు, అనంతపురం జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున అత్యధిక మార్కులు సాధించారు.

టెన్త్‌లో సత్తా చాటిన బీసీ గురుకులాల విద్యార్థులకు సన్మానం

మంత్రి చెల్లుబోయిన

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులు సత్తా చాటడం గర్వకారణమని, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన పది మంది విద్యార్థులకు విజయవాడలో సన్మానం చేసి, ప్రశంస పత్రాలను అందజేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీ గురుకులాలకు చెందిన 5,114 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 4,579 మంది ఉత్తీర్ణులై 90 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. గతేడాది సాధించిన 82 శాతంతో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధిగా తెలిపారు. వీరిలో 3,858 మంది(76 శాతం) ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. 11 రెసిడెన్షియల్‌ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించినట్టు తెలిపారు. బీసీ సంక్షేమ వసతి గృహాలకు చెందిన 8,235 మంది విద్యార్థుల్లో 5,916 మంది(72 శాతం) ఉత్తీర్ణతను సాధించారని.. వారిలో 3,443 మంది(58 శాతం) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. గతేడాది 76 సంక్షేమ వసతి గృహాలు 100 శాతం ఫలితాలను సాధించగా, ఈ ఏడాది 107 వసతి గృహాలు నూరు శాతం ఫలితాలు సాధించాయని తెలిపారు.

పెరిగిన టికెట్‌ ధరలు భరించేందుకు
రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం

- హజ్‌ యాత్రికులకు ఆందోళన అవసరం లేదు
- టికెట్‌ ధరలు నిర్ణయించేది సెంట్రల్‌ హజ్‌ కమిటీ ఆఫ్‌ ఇండియా
- ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదు
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా



కడప కార్పొరేషన్‌ : హజ్‌ యాత్రకు సంబంధించి విమానయాన టికెట్ల ధరలపై హజ్‌ యాత్రికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా భరోసా ఇచ్చారు. కడపలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి హజ్‌ యాత్రలకు వెళ్లేవారికి టికెట్‌ ధరలను సెంట్రల్‌ హజ్‌ కమిటీ ఆఫ్‌ ఇండియా నిర్ణయిస్తుందని తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఎంబార్కేషన్‌ నుంచి హజ్‌కు వెళ్లే వారికి ధరలు నిర్ణయిస్తూ హజ్‌ కమిటీ ఆఫ్‌ ఇండియా ముంబై సర్క్యులర్‌ విడుదల చేసిందన్నారు. వారు నిర్ణయించిన మేరకు రూ.3.88 లక్షల ధరతో విజయవాడ నుంచి హజ్‌ యాత్ర చేసేందుకు వీలుందన్నారు. హైదరాబాద్‌ నుంచి రూ.3.05 లక్షలు, బెంగళూరు నుంచి రూ.3.04 లక్షల ధరను నిర్ణయించారని తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్‌ పాయింట్‌ను ఎంచుకున్న ముస్లిం సోదరులు ధర ఎక్కువని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఢిల్లీకి రాగానే తమ పార్టీ ఎంపీలతో కలిసి, తాను కూడా ఢిల్లీకి వెళ్లి ముఖ్యమంత్రి రాసిన లేఖను ఆమెకు అందజేసి టికెట్‌ ధరలను సమీక్షించాలని కోరుతామన్నారు. ధరలు తగ్గించడం వీలుకాని పక్షంలో ఎంబార్కేషన్‌ పాయింట్‌ మార్చాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. అదీ సాధ్యం కాకుంటే పెరిగిన ధరలను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని అంజద్‌బాషా వెల్లడించారు. ముస్లిం, మైనార్టీలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రేమాభిమానాలకు ఇదే నిదర్శనమన్నారు. సీఎం జగన్‌ ఉండగా ముస్లిం మైనార్టీలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చారు. ఈ ధరలను నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర హజ్‌ కమిటీకి ఉండదన్న వాస్తవాన్ని హజ్‌ యాత్రికులు, టీడీపీ నేతలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిదీ రాజకీయం చేయడమే లక్ష్యంగా టీడీపీ నాయకులు పనిచేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.3 లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న హజ్‌ యాత్రికులకు రూ.60 వేలు, అంతకంటే ఎక్కువ ఉన్నవారికి రూ.30 వేలు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోందని, దేశంలో మరే రాష్ట్రంలో ఇలా ఇవ్వడం లేదని చెప్పారు. సమావేశంలో ఏపీ హజ్‌ కమిటీ చైర్మన్‌ గౌసులాజం తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌ సేవలు అభినందనీయం



రెడ్‌ క్రాస్‌ అవార్డులు అందుకున్న కలెక్టర్లు, అధికారులు, పలు సంస్థల ప్రతినిధులతో గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌

ప్రపంచ రెడ్‌క్రాస్‌ దినోత్సవంలో గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌

సాక్షి, అమరావతి: ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ సొసైటీ మూడేళ్లుగా నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర గవర్నర్‌ ఎస్‌.అబ్దుల్‌ నజీర్‌ అన్నారు. ప్రపంచంలో రెడ్‌క్రాస్‌ ఉద్యమాన్ని స్థాపించిన జీన్‌ హెన్నీ డ్యూనాంట్‌ జయంతిని పురస్కరించుకుని విజయవాడ రాజ్‌భవన్‌లో సోమవారం ప్రపంచ రెడ్‌క్రాస్‌ దినోత్సవం–2023ను నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్‌ సొసైటీ ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర శాఖ అధ్యక్షులు అబ్దుల్‌ నజీర్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గవర్నర్‌ మాట్లాడుతూ 'ఒక చెట్టును నాటండి–పర్యావరణాన్ని రక్షించండి' అనే థీమ్‌తో భారీ చెట్ల పెంపకంపై ప్రచారం, 'రక్తదానం చేయండి–ప్రాణాన్ని కాపాడండి' ప్రచారాలను బాగా నిర్వహించారన్నారు. ఐఆర్‌సీఎస్‌ ఏపీ స్టేట్‌ బ్రాంచి ద్వారా మొదటిసారిగా రూపొందించిన క్లైమేట్‌ యాక్షన్‌ ఫండ్‌కు ఉదార సహకారం అందించాలని గవర్నర్‌ విజ్ఞప్తి చేశారు.

రెడ్‌క్రాస్‌ మెడల్స్‌ విన్నర్స్‌కు అభినందనలు

పలు విభాగాల్లో అనేక సేవలు అందించి రెడ్‌క్రాస్‌ మెడల్స్‌ దక్కించుకున్న విజేతలను గవర్నర్‌ నజీర్‌ అభినందించారు. రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్‌ వి.వినోద్‌కుమార్, కలెక్టర్లు ఎస్‌బి లత్కర్, ఎ.మల్లికార్జున, కృతికా శుక్లా, కె.మాధవీలతను, పలు రంగాల్లో సేవలందించిన ప్రముఖులను అభినందించారు. ఐఆర్‌సీఎస్‌ ఏపీ స్టేట్‌ బ్రాంచి చైర్మన్‌ డాక్టర్‌ ఎ.శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరిదా గవర్నర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

సీఐ ఇస్మాయిల్‌పై హైకోర్టు మండిపాటు

- సీఐ చర్యలు న్యాయ ప్రక్రియకు విఘాతం కలిగించేవన్న ధర్మాసనం
- కోర్టు ధిక్కార కేసు నమోదుకు ఆదేశం.. నోటీసులు
- విచారణ జూన్‌ 14కి వాయిదా

సాక్షి, అమరావతి : ఓ వ్యక్తి నిర్బంధం విషయంలో వాస్తవాలను తేల్చేందుకు నియమితులైన అడ్వొకేట్‌ కమిషనర్‌ను, అతనికి సహాయంగా వెళ్లిన కోర్టు సిబ్బంది, ఇతరులను అనంతపురం జిల్లా హిందూపురం 1 టౌన్‌ ఇన్‌స్పెక్టర్‌ ఇస్మాయిల్‌ కొట్టడంపై హైకోర్టు మండిపడింది. కోర్టు ద్వారా నియమితులైన అధికారిని కొట్టేందుకు ఎంత ధైర్యం అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది న్యాయ ప్రక్రియకు విఘాతం కలిగించడమేనంది. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే ఇస్మాయిల్‌ చర్యలు కోర్టు ధిక్కారమేనంది. ఆయనపై కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణకు ఇస్మాయిల్‌ స్వయంగా తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఆయనకు నోటీసులు జారీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ప్రశాంత్‌ కుమార్‌ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్‌ నైనాల జయసూర్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అడ్వొకేట్‌ కమిషనర్, కోర్టు సిబ్బందిని ఇస్మాయిల్‌ కొట్టారంటూ అనంతపురం జిల్లా జడ్జి ఇచ్చిన నివేదికను హైకోర్టు సుమోటో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్‌)గా మలిచిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం విచారణ సోమవారం జరిపింది. ఈ సందర్భంగా సీఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సుమోటో పిల్‌లో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, అనంతపురం రేంజ్‌ డీఐజీ, జిల్లా ఎస్పీ తదితరులకు కూడా నోటీసులిచ్చింది. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది (జీపీ) వి. మహేశ్వరరెడ్డి స్పందిస్తూ.. ఇప్పటికే సీఐపై చర్యలు తీసుకున్నామని, వీఆర్‌కు పంపామని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో స్టేటస్‌ రిపోర్ట్‌ దాఖలు చేస్తామన్నారు. జీపీ అభ్యర్థనను మన్నించిన ధర్మాసనం తదుపరి విచారణను జూన్‌ 14కి వాయిదా వేసింది.

మన కులపోడు మోసగాడైనా సీఎంని చేయాలా?

- వెన్నుపోటు రాజకీయాలను ఒప్పుకోకూడదు
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్‌ పోసాని కృష్ణమురళి

ఏఎన్‌యూ : 'మన కులం వాడైనా వంద మంచి లక్షణాలుంటేనే కూతుర్ని ఇస్తాం. కానీ మోసగాడు, చెడ్డవాడైనా పరవాలేదు.. మనం కులం వాడినే ముఖ్యమంత్రిని చేద్దామనుకోవడం నా కులం వాళ్లకు తగునా? మన కులం వాడని రాష్ట్ర భవిష్యత్‌ను మోసగాడి చేతిలో పెడతామా? ఇదేమి మానవత్వం? నాలో మనిషి లక్షణాలు మాత్రమే ఉన్నాయి. అవి నా కూతురి విషయంలోనైనా, రాష్ట్ర భవిష్యత్తు విషయంలోనైనా ఒకే రకంగా ఉంటాయి. మన కులపోడని వెన్నుపోటు రాజకీయాలు ఒప్పుకోను. నేను తప్పుకు తల వంచను' అని ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్‌ పోసాని కృష్ణమురళి చెప్పారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఏఎన్‌యూ ఆర్ట్స్, కామర్స్, లా, సైన్స్‌ కళాశాలల ఉత్సవాలకు పోసాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తికి అతని కులం అంటే అభిమానం ఉండటంలో తప్పు లేదని, కానీ ఆ అభిమానం రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసేదిగా ఉండకూడదని తెలిపారు. తన కులం అని గర్వించడంలో తప్పులేదని, కానీ తన కులమే గొప్ప అని భావించడం తప్పని చెప్పారు. ద్రోహులే కులతత్వాన్ని రూపొందించి, పెంచి పోషిస్తుంటారన్నారు. కులతత్వాన్ని, వెన్నుపోటు రాజకీయాలను ప్రోత్సహించడం మానవత్వం కాదని, దీనిని యువత గుర్తించాలని చెప్పారు. వీసీ పి.రాజశేఖర్, రెక్టార్‌ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్‌ బి కరుణ తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943